# కథామంజరి

## పది కథల సమాహారం



ఆగస్టు 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**ఆగష్టు 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 8

శ్రీమతి సత్య సమేతులై శ్రీ గరిమెళ్ళ శ్రీనివాస్‌గారు..

తల్లి శ్రీమతి సరస్వతి, తండ్రి స్వర్గీయ నాగభూషణం గారు,

తాతగారు స్వర్గీయ దువ్వూరి సాంబమూర్తి గార్లను

స్మరించుకుంటూ, విద్యా, సాహిత్య కళారంగాలలో

వారి విశేష శేముషీ వైభవాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ

అందించిన వరద హస్తం.

వారికి కథామంజరి మంజుల నీరాజనాలు.



# కథామంజరి
## పది కథల సమాహారం

"కథామంజరి" దాదాపు మూడు సంవత్సరాలుగా
కొత్త, పాత రచయితల రచనలను ఎంచుకుని, నెల నెలా
ఓ పది కథల సమాహారాన్ని పాఠకులకి అందిస్తోంది.
ఈ ఆన్ లైన్ సంచికలో కథలు తప్ప మరేమీ ఉండవు.
ప్రచురించిన పది కథలనూ, శబ్దీకరించి,
ఇపుడు శ్రావ్యసంచికగా కూడా విడుదల చేస్తోంది. దీనివలన
చదవలేనివారు, చదవడానికి సమయం లేని వారు కూడా
ఈ కథలకు దగ్గిరవుతున్నారు.
"కథామంజరి" ఎటువంటి లాభాపేక్ష లేని సంస్థ. ఇంతవరకు,
కొద్దిమంది కథాప్రియుల ఆసరాతో సౌఖ్యంగానే నడిచినా,
పాఠకులు దన్నుదారులైతే మరింత శోభగా ఉంటుందనే
ఆలోచనతో మీ ముందుకు వచ్చాం.
వార్షిక చందా **రూ.200/-**
ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నాం.

చందా చెల్లించుటకుఇచట నొక్కండి

# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... iii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... v

కథా పరిచయం ... ... ... ... ... ... vii

కథాపుస్తక పరిచయం ... ... ... ... ... ... x

వినదగునెవ్వరు చెప్పిన ... ... ... ... ... ... xii


## కథలు, వ్యాసాలు


నట నక్షత్రాలు! ... వి. రాజా రామమోహనరావు ... 1

ప్రేమా! నీ చిరునామా ఏమిటి? ... సింహప్రసాద్ ... ... ... 4

జవరాలి జడదెబ్బ ... డీ.వీ. హనుమంతరావు ... ... 11

రంగుల కల ... కె. వి. లక్ష్మణరావు ... ... 15

నాన్న మళ్ళీ పుట్టారు! ... పి. రాజేంద్ర ప్రసాద్ ... ... 21

మిస్సైన బస్సు ... కొయిలాడ రామ్మోహన రావు ... 27

వడ్లగింజలో బియ్యపుగింజ ... సి.హెచ్.వి.యస్.యస్. పుల్లంరాజు 32

సమాధానం ... మద్దూరి నరసింహమూర్తి ... 39

సామంతరాజులు ... అట్టాడ అప్పల్నాయుడు ... ... 46

ఖుదానంద్ ... కీ. శే. మల్లాది రామకృష్ణ శాస్త్రి ... 58


Cover Page Credit : Gianluca Grisenti, Italy

ఎంత మంచి సినిమా అయినా రెండున్నర గంటలు, నాటకం ఓ గంట, సంగీతం రెండు గంటలు, పాకిస్తాన్ ఇండియా క్రికెట్ మ్యాచ్ రెండున్నర గంటలు, సాహితీ కార్యక్రమం రెండు గంటలు, మంచి రాజకీయ వక్త ఉపన్యాసం మహా అయితే అరగంట, ఆధ్యాత్మిక ఉపన్యాసం గంటన్నర.... ఇలా ఆ సమయానికి మించి ప్రేక్షకులను కూర్చోపెట్టడం ఈ రోజుల్లో కష్టమైన పని. అందులో మధ్య మధ్యలో సెల్‌ఫోన్లు చూసుకోవడాలు, మాట్లాడుకోవడాలు, టి కాఫీలు సేవించడాలు... మామూలుగా జరుగుతూనే ఉంటాయి. ఇక... చివర, మధ్య వరసలలో ఉన్నవారి మధ్య యోగక్షేమాలు, కుశల ప్రశ్నలు గుసగుసలు సర్వసాధారణ విషయమే!

ఇలాంటి వాతావరణానికి అలవాటుపడ్డ ప్రేక్షకలోకాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు... సుమారు పది గంటలు, అందులో ఓ సాహితీ కార్యక్రమంతో, కట్టి పడేయడం ఈ రోజుల్లో చాలా అరుదైన విషయం. సెల్‌ఫోన్లు కట్టి పడేసి, పక్కవారితో బాతాఖానీకి తావు లేకుండా, నిండిన హాల్లో వారంతా, వేదిక మీద మనసు లగ్నం చేసి, ఆ కార్యక్రమాన్ని ఆసాంతం ఆస్వాదించిన కార్యక్రమం "కథోత్సవం"! కథా రవళి అనే ఓ వాట్సాప్ సమూహం వారు విశాఖపట్నంలో జూలై 8వ తేదిన నిర్వహించిన ఈ సమావేశానికి నాలుగైదు రాష్ట్రాలలో నివసిస్తున్న తెలుగు కథా రచయితలు, రచయిత్రులు నూటయాభై మందికి పైగా హాజరయ్యారు. వాళ్ళల్లో పండిత పామరులు, డాక్టర్‌లు, యాక్టర్లు, ఆచార్యులు, రాసేవారు, ప్రముఖులు.. ఒకరేమిటి.. అందరూ ఉన్నారు. సమయపాలన పాటించే ప్రేక్షకులు, నిర్వాహకులు.. ఉంటే ఇక చెప్పేదేముంది. అదో ఆనంద విహారమే! ఆ కథోత్సవం.. అలా చాలా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ సాహితీ కార్యక్రమం జరగడం ఓ శుభపరిణామం అని చెప్పాలి! ఆ కార్యక్రమ నిర్వాహకులు డా.. డి.యన్.వి. రామశర్మ గారి సంకల్పబలం, నిబద్ధత మరో ఎత్తు అనే చెప్పాలి! వెరసి.. 8 జూలై కథారవళి ఆధ్వర్యంలో జరిగిన 'కథకుల ఆత్మీయ సమ్మేళనం' తెలుగు కథకు మరింత వెలుగునిచ్చిందనే చెప్పాలి.

ఇక.. ఉదయం జరిగిన సభలో.., కథా రచన – మెళకువలు, నవలా రచన, సాహితీ పత్రికలలో సాహిత్యం, ఆధునిక కథ – పోకడలు, హాస్య రచన – కథ కమామీషు...  వంటి అంశాల మీద సోదాహరణంగా ఉపన్యసించారు. మధ్యాహ్నం జరిగిన కథాగమన చర్చలు చాలా ఉపయుక్తంగా జరిగాయి. వేదిక అలంకరించిన ప్రముఖ రచయితలు. సభికులు కథా రచన మీద అడిగిన ఎన్నో ప్రశ్నలకు, సందేహాలకు అనుభవపూర్వకమైన సమాధానాలు చెప్పారు. భాష మీద పట్టుతో పాటు, ఎక్కువగా చదవవలసిన ఆవశ్యకతను వక్తలు మరోసారి గుర్తుచేశారు. వర్ధమాన రచయిత, రచయిత్రులందరూ కూడా ఈ చర్చల్లో పాల్గొనడం ఓ మంచి ఆరంభమే! 'కథని పోటీ కోసం వ్రాయకండి.. మనసు స్పందించినప్పుడు వ్రాయండి, మనసుపడి వ్రాయండి...' అనే పెద్దల మాటలు అక్కడ మరోసారి వినబడ్డాయి.

మరో విషయం ఏమిటంటే...  వేదిక మీద కాకపోయినా.. అక్కడ చేరిన కథకులలో ఓ చర్చ చాలా అబ్బుర పరిచింది. ఆ చర్చ ఏమిటంటే...

"తెలుగు కథ పుట్టి శతాబ్దం కంటే ఎక్కువ కాలం గడిచి, కొన్ని వేల కథకులు కొన్ని లక్షల కథలు వెదజల్లినా.. ఏడెనిమిది దశాబ్దాల క్రిందట వచ్చిన ఓ పది పదిహేను కథల గొప్పతనం గురించి ఇప్పటికీ చెప్పుకుంటున్నాం, చర్చించుకుంటున్నాం! నిజానికి అవి గొప్ప కథలే... ప్రపంచ కథ సాహిత్యంలో చెప్పుకోదగ్గ కథలే! కాని ఈ తర్వాత కాలంలో మంచి కథలు రాలేదా... ఆ కథల స్థాయిలో వ్రాసే కథకులు ఏ తరంలోను పుట్టలేదా?" ఈ ప్రశ్నలకి సమాధానాలు అక్కడే దొరికాయి. "మనుషుల

జీవనవిధానం మారిపోయింది. ఆలోచనా సరళి మారిపోయింది. రానురాను యంత్రం మనిషిని ఆక్రమిస్తోంది. అభిరుచులు, ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయి! ఈ పరిస్థితుల మధ్య కథ మరుగున పడిపోతోంది. ఆణిముత్యాలున్నా... అవి వెలుగులోకి రాలేకపోతున్నాయి!" ఈ జవాబుకి నూటికి నూరు మార్కులు వేయవలసిందే!

అయితే.. ఏం చెయ్యాలి!

ఈ అలోచనతోనే 'కథామంజరి' "కథాపరిచయం" ద్వారా కొన్ని ఆణిముత్యాలను వెలుగులోకి తీసుకొస్తోంది! అయితే ఒకరిద్దరి కృషి సరిపోదు. వీరితో పాటు, తెలుగు కథ గురించి ఆలోచించే వారి చేతులు, చేతలు కలవాలి! ముఖ్యంగా... ఆణిముత్యాలను ఏరి, ప్రపంచానికి పరిచయం చేయడానికి.. ముందు కథకులే నడుం కట్టుకుని ముందడుగు వెయ్యాలి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ అట్టాడ అప్పల్నాయుడు**

తన చుట్టూ కనబడుతున్న పరిస్థితుల్ని చూస్తూ.. 'మనకెందుకులే' అని తప్పుకునే వారు కొందరు, పట్టించుకోకుండా ఉండేవాళ్లు మరికొందరు, నిట్టూర్పులు విడిచి ఊరుకునేవారు కొందరు మనకి సమాజంలో నిత్యం ఎదురవుతూనే ఉంటారు! వీళ్లతో పాటు.. ఆ పరిస్థితుల్ని చూసి చలించి, గన్ పట్టుకునే వాళ్లూ, కలం సంధించి చైతన్యాన్ని కలిగించాలనే ఆలోచనతో సాహిత్యరంగ ప్రవేశం చేసిన వారు బహు తక్కువగా ఉంటారు. ఈ పరిస్థితులు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1965–75 మధ్య కాలంలో ఎక్కువగా కనబడేవి. ఆ రోజుల్లోనే దేశంలో ఉద్యమాలు ఎక్కువగా ఉండేవి. అవినీతి, అరాచకం, ప్రభుత్వ యంత్రాంగాల ఆధిపత్యం, రాజకీయ నిరంకుశత్వంతో ప్రజలలో అభద్రతా భావం ఎక్కువగా ఉండేది. అలాంటి క్లిష్ట పరిస్థితులలో కలం పట్టి ఉద్యమ బాట పట్టిన నిన్నటి తరం రచయితలలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ కథా, నవలా రచయిత శ్రీ అట్టాడ అప్పలనాయుడు గారు! దేశంలో ఎమర్జెన్సీ ఉన్న రోజుల్లో కళ్ళ ఎదుట కనబడే గుండె అలజడులను చూసి చలించి కలం పట్టిన శ్రీ అప్పలనాయుడు గారి మీద ఆనాటి గిరిజన ఉద్యమ ప్రభావం మెండుగా ఉంది. తన ఎదుట కనబడే జనజీవనం గురించి రాయాలనే తపనతో తన మొదటి కథతోనే ఉవ్వెత్తున లేచి, మెరిసిన యువ కెరటం శ్రీ అప్పల్నాయుడు గారు! ఆ కథలో కథానాయకుడు ఓ ఆదివాసి... తన మీద జరుగుతున్న అన్యాయం మీద తిరగబడ్డ వైనాన్ని అక్షరాలలో అద్భుతంగా ఆవిష్కరించారు.

1953లో విజయనగరం జిల్లాలో గుమడ అనే ఓ కుగ్రామంలో జన్మించిన శ్రీ అప్పల్నాయుడు గారు పదవ తరగతి చదువుతున్నప్పుడే శ్రీకాకుళ సాయుధ పోరాటం వైపు ఆకర్షితుడై, అటు అడుగులు వేసారు. అతని ఆలోచనలకు భయపడి, తల్లిదండ్రులు ఆ వాతావరణానికి దూరం చేయడానికి ఆతడ్ని విశాఖపట్నం పంపిస్తే, అక్కడ దిన కూలి, నైట్ వాచ్ మెన్ .. వంటి చిన్న ఉద్యోగాలు చేసి, తిరిగి తన ఊరికి చేరారు. కొన్నాళ్ళు "నాగావళి" పత్రికలో పనిచేసి, తర్వాత కాలంలో విశాఖ గ్రామీణ బ్యాంక్‌లో తాత్కాలిక ఉద్యోగిగా అడుగుపెట్టి, తర్వాత బి.ఎ. పాసై, బ్యాంకు ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగి, అక్కడే ఆఫీసరుగా పదవి విరమణ చేసారు. మరోవైపు ఆ రోజుల్లో శ్రీకాకుళ ఆయుధ పోరాట ఉద్యమ ప్రభావంతో, కొన్ని పోరాట సంఘటనలకు కథల రూపంలో అందించినా.., క్రమక్రమంగా సామాజిక విషయాల మీద కూడా పూర్తి అవగాహనతో కథా వస్తువులను ఎంచుకుని విప్లవ దృష్టితో రచనలు చేయడంతో... శ్రీ అప్పల్నాయుడుగారికి తెలుగు సాహిత్య రంగంలో మంచి


గుర్తింపు, ఉన్నతమైన స్థానం లభించాయి. ఆ రోజుల్లోనే... 'వివాహం కూడా తన జీవితంలోనే కాదు, రచనా వ్యాసంగంలో కూడా ప్రభావం చూపిందంటూ' భావించే శ్రీ అప్పల్నాయుడుగారు, ఓ నక్సలైటు కుమార్తెను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వివాహం తర్వాత కూడా తన సిద్ధాంతాలకి నూటికి నూరు శాతం ప్రోత్సాహం లభించింది. అనతికాలంలోనే ఉత్తరాంధ్ర కథకులలో మంచి పేరు తెచ్చుకున్న శ్రీ అప్పల్నాయుడు గారు వందకు పైగా కథలు, నాలుగు నవలలు, కొన్ని నాటికలు వ్రాసారు. ఎక్కువగా ఉత్తరాంధ్రా మాండలికం కనబడే వీరి రచనలు సహజసిద్ధమైన వాతావరణంలో ఉంటాయి. నిత్యం మనకి కనబడే సంఘటనలే కనబడతాయి. ఊరి చెరువు, కొలతలు, జ్ఞానోదయం, ప్రజా కోర్టు, బారికోడు, భోషాణం, వల్మీకం, బెల్లం, మమకారం, పువ్వుల కొరడా, పోడు పోరు.. వంటి వీరి కథలు బహుళ ప్రజాదరణ పొందాయి. అట్టాడ అప్పల్నాయుడు సాహిత్యం, పోడు–పోరు, ప్రత్యామ్నాయం, ఒక పొట్టివాడు.. కొందరు పొడవువాళ్లు, చిటికెన వేలు కథలు.. వంటి కథా సంపుటాలు వెలువడ్డాయి. పునరావాసం, ఉత్కళం, అనగనగా ఒక రాజద్రోహం, నూకలిస్తాను, బహుళ.. వంటి వీరి నవలలు పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. నాలుగు దశాబ్దాలుగా రచనలు చేస్తున్న శ్రీ అప్పల్నాయుడు గారు ఏ రోజూ నిరాశాపూరితమైన రచనలు చేయలేదు. తన పోరాట పటిమా శక్తిని వీడలేదు. అన్యాయాలను ఎండగట్టి, ప్రజల్ని చైతన్యం చేయడానికే శ్రమించారు.. శ్రమిస్తున్నారు కూడా! నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీ పడకుండా, నిరంతరం శ్రమిస్తూ రచనలు అందిస్తున్న వీరికి... జ్యేష్ఠ లిటరరీ అవార్డు, రాచకొండ రచనా పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కారం, పతంజలి స్మారక అవార్డు... వంటి ఎన్నో అవార్డులతో పాటు ఇటీవల కీ.శే. చిలుకూరి దేవపుత్ర స్మారక అవార్డు, బలివాడ కాంతారావు జీవన సాఫల్య అవార్డులు లభించాయి.

సాహిత్య సృజనని కాలక్షేపం కోసమో లేదా పేరు కోసమో కాకుండా... సామాజిక బాధ్యతగా భావించి, నిబద్ధతతో రచనలు అందిస్తున్న శ్రీ అప్పల్నాయుడుగారికి 2014 లో సతీ వియోగం సంభవించి, తీవ్ర విషాదానికి గురయ్యారు. వీరికి ఓ అబ్బాయి, ఓ అమ్మాయి. వీరికి స్ఫూర్తి నిచ్చిన రచయిత కీ.శే. కాళీపట్నం రామారావు మాష్టారు. శ్రీకాకుళంలో స్థిర నివాసం ఉంటున్న వీరు, అక్కడ కారా మాష్టారి "కథానిలయం" ట్రస్ట్ బోర్డు సభ్యులుగా సేవలు అందచేస్తున్నారు.

కథామంజరి అడిగిన వెంటనే కాదనకుండా, ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, అలుపెరగని ఈ అక్షరశిల్పి కలం నుంచి, మరెన్నో ఆణిముత్యాలు రాలి, అటు ప్రజలని చైతన్యవంతులుగా చేస్తూ, ఇటు వర్ధమాన రచయితలకు మార్గదర్శకులుగా చరిత్రలో నిలవగలరని ఆశిస్తున్నాం!

***కథామంజరి బృందం.***

# కథా మార్గదర్శి



కీ.శే. మల్లాది రామకృష్ణశాస్త్రి

ఆధునిక సాహిత్యం అడుగుపెట్టిన రోజుల్లో... తెలుగు సాహితీ లోకంలో పేరు ప్రఖ్యాతుల కోసం కాకుండా... సమాజం కోసం, భాషా వికాసం కోసం, అక్షర సేద్యం చేసిన ఎందరో మహానుభావులు తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారు. అలాగే వారు ఏదో ఒక ప్రక్రియకే పరిమితమై సాహిత్యాన్ని అందించలేదు. పాట, పద్యం, గద్యం, కథ, కవిత, నాటిక, నాటకం.. ఒకటేమిటి అన్ని ప్రక్రియలలో అజరామరంగా నిలిచిపోయిన సాహిత్యాన్ని అందించారు. అంతే కాదు... ఆ అక్షరసృష్టికి ఎవరికివారు, తమదైన ముద్రని శాశ్వతంగా వేసుకున్నారు. ఎన్ని యుగాలు గడిచినా.. తెలుగువారు గర్వంగా చెప్పుకునే సాహిత్యాన్ని అందించిన అలాంటి, ఎందరో మహానుభావులలో మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ఒకరు. తెలుగువారికి పరిచయం అక్కర్లేని సాహితీ తేజం రామకృష్ణశాస్త్రిగారు. ఆంధ్ర సాహిత్యానికి నన్నయ్య, తిక్కన, ఎర్రన లాగే, తెలుగు చలనచిత్ర సాహిత్యానికి కవిత్రయం సముద్రాల, పింగళి, మల్లాది.. అని నాటికి నేటికి సాహితీలోకం ఒప్పుకు తీరుతుంది. ప్రత్యేకంగా కథా సాహిత్యంలో మల్లాదివారికి ప్రత్యేక స్థానం ఉంది! మరో వంద సంవత్సరాల తర్వాత కూడా గుబాళించ గలిగే కథలను మల్లాదివారు అందించారు.

పదిహేనేళ్ల వయసులో మల్లాది వారు వ్రాసిన మొట్టమొదటి కథ "భారతి" లో ప్రచురింపబడింది. రెండు వందలకు పైగా కథలు వ్రాసిన వారి కథలలో "డు.ము.వు.లు." పదిహేను భాషలలోకి అనువదింపబడిందంటే.. ఆ కథ గొప్పతనం గురించి వేరే చెప్పనవసరం లేదు. శిలువ, సర్వమంగళ, కూత ఘనం, ఆనందవల్లి, వంటి ఎన్నో ఆయన కథలు తెలుగు సాహితీ ప్రపంచంలో చిరంజీవులుగానే ఉంటాయి. కృష్ణానదీ తీర నేపథ్యంలో వ్రాసిన మల్లాది వారి కథలలో కథాగమనం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. పాఠకుడ్ని తన వైపుకు తిప్పుకుని ఓ విధమైన మత్తులోకి లాక్కుపోతుంది. ఆలోచనల్లోకి దింపి పడేస్తుంది! కారణం... ఆయన కథల్లోని పాత్రలు అన్నీ మన ముందు కనబడేవే! మరో గొప్ప విషయం ఏమిటంటే... మల్లాది వారి వ్యక్తిత్వపు ఛాయల్ని చూడాలంటే.. ఆయన వ్రాసిన "కృష్ణా తీరం" చదవవలసిందే. మల్లాది వారి మాటల్లో చతురత, విశాల హృదయం, అభ్యుదయ భావాలు, మానవీయ దృక్పథం.. వంటి వారి గుణగణాలను ఆ గ్రంథంలోని 'అప్పన్న' పాత్రలో చూడవచ్చు. భార్యాభర్తల సంబంధాలు, పిల్లలకి తల్లిదండ్రుల ఎడల ఉండవలసిన బాధ్యతలు.. వంటి విషయాలను హృద్యంగా కథలలో అందించిన మల్లాది వారు... కులతత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించేవారు.

1905 జూన్ 17 వ తేదిన ఓ సాధారణ మధ్యతరగతి పండిత కుటుంబంలో జన్మించిన మల్లాది వారికి చిన్నతనంలోనే వివాహం జరిగిపోయింది. చదివింది ఎమ్ఎ. మరోవైపు... సంస్కృతం, జర్మన్, సింహళ, గ్రీకు వంటి ఎన్నో భాషలలో పట్టు సాధించారు. ఏకసంతాగ్రాహిగా గుర్తింపబడిన మల్లాదివారికి, చదువుతున్న రోజుల్లోనే "విద్యాభూషణ" అనే బిరుదు ఇచ్చారు. ఖగోళ, జ్యోతిష్య శాస్త్రాలను కూడా అధ్యయనం చేసిన వీరికి సంగీతం, చిత్రలేఖనం, నాట్యం.. వంటి కళలలో కూడా పూర్తి ప్రావీణ్యత ఉంది. ఇంకా ఎన్నో నేర్చుకోవాలనీ ఉన్నా, వీరిని పేదరికం వెంటాడుతూ ఉండేది. ఉద్యోగ అన్వేషణలో పడి, 'దేశాభిమాని' అనే పత్రికలో ఉపసంపాదకుడుగా పని చేసి, తర్వాత 'కృష్ణాపత్రిక' లో చేరారు.

తర్వాత కాలంలో, పల్నాటియుద్ధం చిత్రరచన విషయంలో సలహాలు తీసుకోవడానికి ప్రఖ్యాత దర్శకులు గూడవల్లి రామబ్రహ్మంగారు, మల్లాది వారిని మద్రాసుకు ఆహ్వానించారు. అనతికాలంలోనే సినిమావాళ్ళతో పరిచయాలు పెంచుకుని, సినిమా రచనలు చేయడం మొదలెట్టారు. ఆ రోజుల్లోనే శ్రీ సముద్రాల వారితో పరిచయం అయ్యాక వారి దగ్గరే ఉండేవారు. ఉదర పోషణార్థం మల్లాదివారు ఘోస్ట్ రైటర్‌గా కూడా పనిచేసేవారుట. అలా ఎవరికో వ్రాస్తే 'నీకు పేరు ఎలా వస్తుంది' అని శ్రేయోభిలాషులు అడిగినా 'నేను పేరు ప్రఖ్యాతుల కోసం వ్రాయడం లేదు, నా తృప్తి కోసం, అవసరం కోసం వ్రాస్తున్నాను. అలాగైనా మంచి సాహిత్యం వెలుగులోకి వస్తే, అంతకంటే ఆనందం ఇంకేముంటుందని' మల్లాదివారు అనేవారుట. తమ పేరుతో కాకుండా కలం పేరుతో వ్రాసేవారికి, తనకు తేడా లేదని చమత్కరించేవారు కూడా! అలా సినిమా రంగప్రవేశం చేసిన మల్లాది వారు.. దేవదాసు, దొంగరాముడు, సువర్ణసుందరి, రాజనందిని, బాలరాజు, పల్నాటియుద్ధం, జయభేరి, రహస్యం, చిరంజీవులు.. వంటి ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు అందించారు. ఇప్పటికీ తెలుగు శ్రోతలు నిత్యం వినే ఆ పాత మధురాలలో ఎక్కువగా వినబడేవి మల్లాదివారివే. తెలుగు జాతీయాలను సందర్భానుసారంగా తన రచనలలో ఉపయోగించుకునే మల్లాది వారి ఏ రచనలైన రసగుళికలే! ఆ రసగుళికల సుగంధ పరిమళం నలుదిశలా వ్యాపింప చేసి, 12.9.1965 తేదీన కనుమూసిన కథామేస్త్రి మల్లాది రామకృష్ణశాస్త్రి గారి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఓ గౌరవప్రదమైన బాధ్యత గా భావిస్తూ, కథామంజరి వారికి అంజలి ఘటిస్తోంది.

**కథామంజరి బృందం.**

## దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారి కథ "దేవుణ్ణి చూసినవాడు"

బాలగంగాధర తిలక్ అనగానే చాలామందికి జ్ఞాపకానికి వచ్చేది అమృతం కురిసిన రాత్రి, 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని అతి రమ్యంగా చెప్పిన మాటలు. అయితే ఆయన రాసిన కథలు కూడా అంత రమ్యంగానూ, అంత పదునుగానూ ఉంటాయి. ఆయన కథలలో ప్రాముఖ్యం పొందినవి ఊరి చివరి ఇల్లు, సుందరీ సుబ్బారావు, ఆశాకిరణం, నల్లజర్ల రోడ్డు, దేవుణ్ణి చూసినవాడు, ఇలా చాలా ఉన్నాయి. కవిగానే కాక కథకుడుగా కూడా మంచి సాహిత్యం అందించిన తిలక్ చిరకాలం సాహిత్య చరిత్రలో నిలిచిపోతాడు. ఈమధ్య కథాసాహితి వారు ఏటేటా ప్రచురిస్తున్న పుస్తకం 'కథ 2019' (1990-2019 మధ్యలో వచ్చిన ఉత్తమ కథల సంకలనం) చివరలో తిలక్ రాసిన 'దేవుణ్ణి చూసినవాడు' కథను కూడా జత చేశారు. అయితే బహుశా ఇలాంటి క్లాసిక్ కథలకు పరిచయాలక్కరలేదేమో, కాని, అప్పుడప్పుడు ఈ కథలను మననం చేసుకోవడం కూడా అవసరమేమో అనిపిస్తుంది. "కథ ఎలా చెప్పాలి? ఎవరు చెప్పాలి? పాత్రలను ఎలా మలచాలి? ఎటువంటి నేపథ్యంలో చెప్పాలి? ఎటువంటి కంఠస్వరం ఉపయోగించాలి? ఎల్లాంటి దృష్టికోణంలో చెప్పాలి?" అన్నది ఎప్పటికీ నేర్చుకోవాల్సిందే.

తిలక్‌గారు రాసిన 'దేవుణ్ణి చూసినవాడు' కథ 1965 జ్యోతి మాసపత్రిక దీపావళి సంచికలో ప్రచురించబడింది.

గవరయ్య పెళ్ళాం లేచిపోయింది. ఊరు ఊరంతా గుప్పుమంది. ఎక్కడ విన్నా, ఎవరి నోటి వెంట అయినా అదే మాట. ఆ ఊళ్ళో గవరయ్య అంటే అంత సద్భావం ఉన్నవాళ్ళెవరూ లేరు మరి. ఊరి పెద్దలు, ధర్మకర్త అవధాని, మునసబు చలపతి, కరణం నరసింహం ఒక నిర్ణయానికి వచ్చేసారు. గవరయ్య ఒక్క ధర్మకార్యం కూడా చేయలేదట. పుణ్యకార్యాలకు ఒక్క పైసా కూడా రాల్చడట.

గవరయ్య ఇరవై ఏళ్ళ క్రితం ఆ ఊరు వచ్చాడు మేనత్త ఇంట్లో ఆశ్రయం తీసుకుని. తాగుబోతు తండ్రి, అనారోగ్యంతో త్వరలోనే కాలం చేసిన తల్లి, చిన్నప్పుడే అస్తవ్యస్తమైన జీవితం అతనిది. తను చెయ్యని నేరానికి జైలుకి పోతూ తండ్రి చెప్పిన 'ఎవరిని నమ్మద్దు' అన్న మాటలు మాత్రం జీవితాంతం నిలిచిపోయాయి. తండ్రికి ఇలాకా ఉన్న ఒకామె గవరయ్యను చేరదీసి ఒక ఆసరా ఇస్తుంది. మేనత్త దగ్గరకొచ్చిన తరువాత పట్నంలో చర్మ (తోళ్ల) వ్యాపారం మొదలు పెట్టి బాగానే గడించాడు. ఊరి పెద్దలకు గిట్టనిదల్లా అంత సంపాదించిన మనిషి తమకు ఒక్క పైసా అన్నా రాల్చడే అని.

ఊరికి వచ్చిన ఏడెనిమిదేళ్లకి మొదటి భార్య పోవడం అందరికి తెలిసిందే. అది విన్న తర్వాత గవరయ్యంటే అసహ్యం మరింత గట్టి పడింది. 'తండ్రి దుర్మార్గుడు, హంతకుడు. వీడు చిన్నతనం నుండి పిల్లులతో, కుక్కలతో కలిసి జంతు లక్షణాలు అలవరచుకున్నాడు. పైగా వీడి పెంపకం ఒక చెడిన స్త్రీ చేత'. అంతకంటే ఇంకేం కావాలి? అయినా ఊరి పెద్దలకి గవరయ్య మీద ఆశ పోలేదు. ఎంతైనా డబ్బున్నవాడు. మొదటి భార్య కాలుజారి నూతిలో పడినప్పుడు పెద్దలు హెచ్చరించారు. గవరయ్య ఖాతరు చెయ్యలేదు. ఓ ఏడాదిలో తనకంటే పదిహేనేళ్లు చిన్నదైన పిల్లను పెళ్లిచేసుకున్నాడు. ఆ పిల్ల ఇంట్లోంచి బయటకు వచ్చేది కాదు. అలాంటి పిల్ల ఇప్పుడు ఎదురింటి అరుగు మీద ఉన్న మిషన్ కుట్టువాడితో లేచిపోయింది.

ఊరి పెద్దలకి ఇదో మంచి అవకాశంగా కనబడింది. మహానంద పద్దారు. అందరూ గవరయ్య ఇంటికి వెళ్లి భగవంతుడికి ప్రార్థన ఎంత ముఖ్యమో, గుళ్ళు, గోపురాలకి ఎందుకీ కష్టసమయాల్లో వెళ్ళాలో, బోధపరిచారు. అన్నింటిని మౌనంగా

వింటూ కూర్చున్నాడు గవరయ్య. వాళ్లతో పాటు గుడికి, హరికథలకి తీసుకెళ్లేవారు. గవరయ్య మాత్రం మాట్లాడేవాడు కాదు. తనకిష్టంలేనప్పుడు లేచి వెనక్కొచ్చే వాడు.

రోజులు గడిచిపోతున్నాయి. ఓ ఏడాదయింది. అందరు చెప్పేంది వింటున్నాడు తోళ్ల వ్యాపారంతో పాటు నూనె మిల్లులో ముప్పాతిక వాటా కూడా కొన్నాడు. మళ్ళీ పెద్దలందరూ గవరయ్య దగ్గరకెళ్ళి అతనికొచ్చే సంపదకు భగవంతుడే కారణమని, పడిపోతున్న వేణుగోపాలస్వామి గుడి ప్రాకారం పూర్తిగా పడిపోయేటట్లుందని అతని సహాయం కోసం కోరుతూ చెప్పేవారు. అన్నిటికి మౌనమే గవరయ్య సమాధానం. అతని పేరు మీదుగా రోజు పూజా పునస్కారాలు జరిపిస్తామన్నా, గవరయ్య కరగలేదు. "అసలు దేవుడికి గుడెందుకు? ఆ గుడి చుట్టూ గోడలెందుకు" అని అడిగాడు గవరయ్య చుట్ట చివరని నోట్లో నములుతూ! చివరకు తనకు పనుందని, టౌనుకెళ్లాలని, చెప్పి పంపించేశాడు. దేవుడి ప్రాకారంతో పాటు తమ ఇంటి ప్రహరీ గోడలు కూడా లేస్తాయనే నమ్మకంతో వచ్చిన అందరికి చుక్కెదురైంది.

ఈలోపల పిడుగులాంటి వార్త. మళ్ళీ ఊరంతా గగ్గోలుమంది. గవరయ్య పెళ్ళాం అంతకు ముందు రాత్రి తిరిగి వచ్చిందని, నెలలు నిండినట్లుంది. ఉర్లోకొచ్చి, కడుపుతో ఉండి నడవలేక నడవలేక వెళ్లి గవరయ్య ఇంటి వెనకాల ఉన్న పాకలో పడుకుందని...! అలా చెడిపోయి తిరిగొచ్చిన దాన్ని గవరయ్య తరిమేస్తాడో, లేక తానే ఊరినించి వెళ్ళిపోతాడో!

ఆరోజు సాయంత్రం గవరయ్య ఇంటికొచ్చేటప్పటికీ అవధాని, మునసబు, కరణం కనిపించారు. అవధాని అంతా చెప్పాడు. గవరయ్య "చంపేస్తాను తప్పుడుముండని" అని అరిచాడు. "అంతక్కరలేదు ఇంట్లోంచి తొలిసెయ్యి చాలు." అన్నాడు అవధాని. అందరూ అప్పటికి అక్కడ నుంచి జారుకున్నారు. గవరయ్య వెనక పాకలోకి వెళ్లి చూసాడు. వెల్లకిలా నేలమీద ఓపక్క పడుకున్న పెళ్ళాన్ని చూసాడు. ఒక్కసారిగా గునపం ఎత్తాడు. అనుమానం వచ్చింది. చచ్చిందా, బతికే ఉందా అని. దీనంగా అట్టలు కట్టిన జుట్టుతో నీరసంగా పడుకున్న భార్యని చూసాడు. కుదిపి లేపాడు. దణ్ణం పెడుతూ "నన్నేం చేయకు నేను వెళ్ళిపోతాను" అంటుంది. తన తల్లి చచ్చిపోయే ముందు తన తండ్రికి చేతులెత్తి దణ్ణం పెడుతూ దీనంగా చూసిన చూపు జ్ఞాపకం వచ్చింది. గబగబా ఇంట్లోకెళ్ళి కొంచెం అన్నం, నీళ్లు తెచ్చి ఇచ్చాడు. మర్నాటికల్లా వెళ్లిపోవాలని చెప్పాడు.

ఆ రాత్రి గవరయ్యకి అన్నం సహించలేదు. నిద్రలో భయంకరమైన కల... తన తల్లిని, తండ్రిని ఒక స్తంభానికి కట్టి మంటలు పెట్టారు. మంటలు పెట్టిన వాళ్ళు అవధాని, మునసబు, కరణంలా కనబడ్డారు. తల్లి, తండ్రి మాడి మసైపోయారు. ఆ బూడిదలోంచి ఒక వ్యక్తి, బయటకు వచ్చాడు. శంఖచక్రాలు ధరించి గుళ్లో తాను చూసిన వేణుగోపాలస్వామిలా ఉన్నాడు! పాకలోకి వెళ్ళాడు. దేవుడేడుస్తూ చిట్టికి పుట్టిన పిల్లవాణ్ణి చేతుల్లోకి తీసుకుని 'నేనున్నానుగా' అని ఓదారుస్తున్నారు. ఇంతలో జనం పక్కకు నిప్పంటించి హాహాకారాలు చేస్తున్నారు. దేవుడు, చిట్టి, పిల్లాడు మంటల్లో కాలిపోతున్నారు.

ఉలిక్కిపడి లేచాడు గవరయ్య. గుడిసెలోకి వెళ్ళాడు. బయటంతా వానలో కలిసిన చీకటి. ఒక మెరుపు మెరిసింది. 'బాబోయ్' అంటూ చిట్టి విలవిలలాడింది. 'కేర్ కేర్' మంటూ ఏడుపు. గబగబా వెళ్లి మంత్రసానిని పిల్చుకొచ్చాడు. పొద్దున్నే ఎనిమిది గంటలకల్లా పెద్దలందరూ వచ్చారింటికి. గవరయ్య ఇంట్లోకొచ్చాడు కాసేపటికి. 'నువ్వింత పని చేస్తావనుకోలేదు. పాపం, మహాపాపం, ఘోరపాపం చేసావు. నిన్ను దేవుడు కూడా క్షమించడు' అన్నాడు అవధాని. బొడ్లోంచి పుగాకు కాడ తీసి చుడుతూ తాపీగా "నాకు దేవుడే చెప్పాడు" అన్నాడు. దాన్ని, ఆ పిల్లాణ్ణి పంపించకపోతే నిన్ను, గుడి ఛాయలకు కూడా రానివ్వమన్నారు. నిన్ను వెలేస్తున్నామన్నారు. "పోండయ్యా పెద్దమనుషులూ! ఇలాంటి ఎదవ్వాళ్ళో ఉండమన్నా ఉండను. నా పిల్లాణ్ణి ఈ యదవల మధ్య తిరగనివ్వను" అన్నాడు గవరయ్య. వారం రోజులు తిరిగేసరికి గవరయ్య ఇల్లు తాళం వేసి ఉంది. టౌనులో ఇల్లు కొన్నాడని, ఇక్కడ ఊళ్ళో ఇల్లూ, పొలమూ అమ్మకానికి పెట్టేడని తెలిసింది.


ఇదీ కథ సూక్ష్మంగా.

"గవరయ్య పెళ్ళాం లేచిపోయిందన్న వార్త ఊరు ఊరంతా ఉత్సాహంగా వ్యాపించింది." అన్న వాక్యంతో మొదలౌతుంది కథ. కథలోకి పాఠకులకు తీసుకెళ్ళేముందు వేసే ఎర ఇది. ఉత్సాహం ఊరందరికే కాదు, ఏ ఆడదైనా లేచిపోయిందన్న వార్త విన్న ఏ పాఠకునికైనా వర్తిస్తుంది. అది మనుషుల స్వభావం. ఆ వాక్యం తిలక్ కథలో చూపించే మానసిక విశ్లేషణకు నాంది. గవరయ్య ఎంతమందికి అసహ్యకరంగా కనబడ్డా గవరయ్య వ్యక్తిత్వాన్ని ఎక్కడా తక్కువ చెయ్యలేదు. గవరయ్య అనుభవించిన చిన్నతనం రచయిత వివరించాల్సిన ఉందా? తాగుబోతు, జూదరి అయినా తండ్రి, అనారోగ్యంతో బాధపడే తల్లి, తనని చూసేవారు లేనప్పుడు పిల్లి, కుక్కలే దోస్తీలయినప్పుడు, ఉన్న తల్లి కూడా పోయి, తండ్రి జైలు పాలైనప్పుడు, తిండిలేక ఆ పద్నాలుగేళ్ల చిన్నతనం ఎంత సంక్షోభానికి లోనైందో, దాని ఫలితం పెరిగి పెద్దయిన తర్వాత ఉండదూ? ఇది రచయిత ఆ పాత్రను సృష్టించడంలో చూపిన ప్రత్యేకత. ఊరి పెద్దల్లా కపటం నేర్చుకోలేదు. అభద్రతా భావంతో దేవుడిని కొలవలేదు, దేవుడికి భయపడలేదు. చిట్టి వెనక్కి వచ్చినప్పుడు గవరయ్య తనలో తాను పడిన సంఘర్షణ ఒక భీకరమైన కల రూపంలో రచయిత పాఠకుల ముందుంచుతారు. ఇదొక సింబాలిజం. ఆ కలలోని సంఘర్షణలో తన తల్లితండ్రులు, గ్రామ పెద్దలు, ఊరి గుడిలోని వేణుగోపాలస్వామి, చిట్టి, అప్పుడే పుట్టిన పిల్లవాడు, అందరూ పాత్రలే. చివరికి గవరయ్య తీసుకున్న నిర్ణయం, దాన్ని చురుకుగా అమలు పరిచిన విధానం గవరయ్య వ్యక్తిత్వానికి ప్రతిబింబాలు.

ఎవరైనా ఆడది లేచిపోయిందన్న మాట వింటే ఎంత ఉత్సాహాన్నిస్తుందో రచయిత హాస్యంగా చెప్పించిన మాటలు "వాడిలో ఏం చూసి లేచిపోయిందత్తా" అని మూడోసారి అడిగిన కోడలికి "పోనీ నువ్వే వాడితో లేచిపోకపోయావూ నీకు తెలిసొచ్చును" అన్న అత్తగారి విసుగు ఒక ఉదాహరణ. తాపీగా పుగాకు చుడుతూ గవరయ్య చెప్పే సమాధానాలు ఒక స్థిరమనస్కుడికి, 'నా మాట నాదే' అన్నధీమా చూపిస్తుంది. జరుగుతున్న సంఘటనలకు నేపథ్యంలో రచయిత ప్రకృతి వర్ణన కూడా అదే ప్రతిబింబిస్తున్నట్లు వర్ణించడం మరొక సంకేతం.

గవరయ్య దేవుణ్ణి చూసాడు. తిలక్ పాఠకులకు గవరయ్యలో దేవుణ్ణి చూపించాడు.

*పరిచయకర్త – శాయి రాచకొండ, హ్యూస్టన్*




## కథాకృష్ణం

1938 నుంచి 1975 వరకు వివిధపత్రికలలో ప్రచురింపబడిన నాటి మేటి రచయిత కీ.శే. అంగర వెంకటకృష్ణారావుగారి 48 చిన్న కథలను ఏరి, ఆయన మరణించిన నలభై సంవత్సరాల తర్వాత 'విశాఖ ప్రియమైన రచయితల సాహిత్య సంక్షేమ సంఘం' ప్రచురించిన కథల పుస్తకం ఇది. అరుదైన రచయితగా అభివర్ణింపబడిన అంగరవారి ఈ కథాసంకలనం డిసెంబరు 2021 లో ప్రథమ ముద్రణ జరిగింది.

**ప్రతులకు**

*విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్*
*33-22-2, చంద్రం బిల్డింగ్స్,*
*తుట్టుగుంట*
***విజయవాడ – 520 004***
*ఫోన్: 0866-2430302*
*9052101320*


*నవ చేతన పబ్లిషింగ్ హౌస్,*
*12-1-493/BA,*
*గిరిప్రసాద్ భవన్, జి.యస్.ఐ.రోడ్,*
*మండ్లగూడ, నాగోలు,*
***హైదరాబాదు – 500 068***
ఫోన్: 040 – 24224454/53


## *తెలుగు కథానిక 2017*

రమ్య సాహితి, పెనుగొండ వారు 2014 నుంచి ప్రతీ సంవత్సరం ఆ సంవత్సరంలో వివిధ పత్రికలో ప్రచురింపబడిన ప్రముఖ కథా రచయితల కథలతో ఓ సంకలనాలు ప్రచురిస్తున్నారు. విహారి, సింహప్రసాద్, ద్విభాష్యం వంటి పదకొండుమంది ప్రముఖుల కథలతో అక్టోబర్2018 విడుదలైన ఈ "తెలుగు కథానిక -2017" ఖరీదు ₹100/-.

**ప్రతులకు**

*ఎమ్. రాజేశ్వరి*
*సెక్రటరీ, రమ్య సాహితీ సమితి*
*జే.వి.యల్. రావు నగర్,*
***పెనుకొండ – 534 320***
*ఫోన్: 9848663735*






## నల్ల సూరీడు

మొదటి పేజీ చూస్తే చాలు.. కథలన్నీ చదివించే సహజసిద్ధమైన సంఘటనలు, నిజ జీవితాలు కనబడే ఇరవై ఒక్క కథల సమాహారం "నల్ల సూరీడు" కథల సంపుటి. ప్రముఖ కథా రచయిత్రి శ్రీమతి రోహిణి వంజారి గారి ఈ కథా సంపుటి మార్చి 2023 న విడుదల అయింది.

---

నవోదయ బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలలో
దొరికే ఈ కథా సంపుటి ధర రూ. 200 /.

---


## నిర్హేతుకం

శ్రీనవులూరి వెంకటేశ్వరరావుగారు రచించిన ఈ అర్థవంతమైన ముప్పైరెండు కథలు, ఓ నవలిక కూడా గంభీరమైన పాఠకుడు నుంచి, సాధారణ చదువరి వరకు చదివించగలిగేలా ఉంటాయి. రూ.200/- ధరకు లభించే ఈ పుస్తక ప్రతుల కోసం ఈ క్రింది వారిని సంప్రదించగలరు.

---

శ్రీ నవులూరి వెంకటేశ్వరరావు,
39-8-39/1, మురళీనగర్ (ఉత్తరం),
**విశాఖపట్నం - 530 007**
ఫోన్ 9966340014

---






జులై 2020 సంచికతో మొదలైన కథామంజరి ఇప్పటికి మూడు వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యాన్ని ముఖచిత్రంగా అలదుకొని వెలువడింది నాలుగవ సంవత్సరపు మొదటి సంచిక. అదీనూ సినీరంగ మార్తాండ కథల పోటీలో నెగ్గిన కథలతో! పేరుకు తగ్గట్టుగానే సినీమాతో ముడిపడి ఉన్న అంశాలతో ఉన్న పది కథలతో సంచిక ఆసక్తికరంగా ఉంది. కథామార్గదర్శిగా రమణ, విశిష్ట అతిథిగా కలికాలం, సూరిగాడు సినీమా కథల రచయిత శ్రీ రాజ్ గార్లతో... సహజంగానే సినీమా సంబంధీకులతో ఉంటుందనేది ఊహాతీతం కాదు.

ఈ నెల శాయిగారు ఏ కథ పరిచయం చేస్తారా అని ఉత్సుకతతో చూశాను. అది కూడా సినీమాకు సంబంధించి ఉంటుందేమో అని! వారు పరిచయం చేసిన జన్నాభట్ల పాణిని గారి 'మరో కురు క్షేత్రం' కథ ఐడియా సూపర్బ్! చివరి వాక్యం ఇంకా ఐరనీ!! శాయిగారు పరిచయం చేసే కథలు పూర్తిగా చదవాలంటే దొరుకుతాయా? సోర్స్ ఇచ్చే వీలు ఉందా?

మొదటి బహుమతి కథ 'మీరు నాకు వద్దు మాస్టారు!' సరోజ హరనాథ్‌గారి కథ. ఇప్పటి సినీమా తీరుతెన్నులను గుది గుచ్చుతూ సాగిన కథ. వీరి నుండి ఇంకా మంచి కథలు ఆశించవచ్చు. రత్నాకర్‌గారి 'జమదగ్ని' రెండవ బహుమతి కథ. అగ్నిపర్వతం సినిమాలో కృష్ణ పాత్ర పేరు జమదగ్నిని తన పేరుగా పెట్టబడి, సినిమాల్లో చేరాలని తపించిన మనిషి కొడుకు ఎక్కడ సినీమా పట్ల ఆకర్షితుడవుతాడో అని కేబుల్ కనెక్షన్ పీకేస్తాడు. అదీ కథ. వీరి శైలి సరళంగా పసందుగా సాగుతుంది.

మూడవ కథ ఇరిగినేని హనుమంతరావుగారి కథ 'రవి గాంచని చోట..' కొత్త ప్రయోగం చేసిన కథ. మంచి ఎత్తుగడతో ప్రారంభమై... నిజం నిశ్చలంగా ఏమీ ఉండదు. కాలం గడిచే కొద్దీ కొత్త అభిప్రాయాలు, కొత్త అనుభవాలు నిజం యొక్క స్వరూపాన్ని మార్చి వేస్తాయి. మనిషి జీవితం శాస్త్రీయ నిర్వచనానికి లోబడేదేమీ కాదు... ఇలా లోతైన వాక్యాలతో కథ ఆద్యంతం ఆర్ధం అయ్యీ, కానట్టు పరుగు పెడుతుంది. చివరికి వచ్చేసరికి అంతా విడిపోయి అవగాహనకు వస్తుంది. పైగా ఈ మధ్య చాప్టర్స్ లాగా వస్తున్న సినిమాల పోకడలో... కథలో కూడా అలాగే.... కొత్త ప్రయోగం.

'నానాటి బ్రతుకు' సుగుణరావు గారి కథ. నటుడిగా చివరి సీన్‌ని జీవితం చివరిలో దృశ్యంగా మారిన వైచిత్రి.

'తెర వెనుక బొమ్మ' ప్రమీలాశర్మ గారి కథ. ఈ కథ చదువుతున్నప్పుడు సినీనటి రేఖ బయోగ్రఫీ 'రేఖ ది అన్ టోల్డ్ స్టోరీ' పుస్తకంలో రాయబడినదిగా వైరల్ అయిన సంఘటన గుర్తుకు వచ్చింది. అంజానా సఫర్ మూవీ షూటింగ్ సమయంలోనిది. అప్పటికి రేఖ వయసు 15 సంవత్సరాలు. డైరెక్టర్ కుల్జిత్ పాల్, నటుడు బిశ్వజిత్ ఆమెకు ముందు చెప్పకుండా తీసిన ముద్దు సీన్. ఆమె ఇబ్బందిని కూడా పట్టించుకోకుండా కనీసం కట్ కూడా చెప్పకుండా.... ఇప్పటికీ తనకు ఆ క్షణాలు గుర్తు ఉన్నాయంటూ రేఖ చెప్పినట్టుగా, ఆ పుస్తకంలో రాయబడింది. సెన్సార్ గొడవలతో 1969లో పూర్తయిన సినిమా, పదేళ్ళ తరువాత మరో పేరుతో 1979లో విడుదలైందట. ప్రమీలగారి కథలో శైలేంద్ర మాలక్ష్మితో ప్రవర్తించిన విధం అలాగే అనిపించింది. ఎంత అద్భుతమైన నటులు, ప్రతిభావంతులు అనుకున్న వారు నిజజీవితంలో పడిన ఇబ్బందులు, జీవితాలనుండే నిష్క్రమించిన వారు, తెరజీవితంలో ఆ హీరోలు, వాస్తవ జీవితంలో విలన్లుగా చూసిన ఘటనలు... ఇలా సినీమా(య)రంగంలో ఒక పార్శ్వాన్ని కథగా మలిచారు రచయిత్రి! ఇలా ఏ కథకు ఆ కథ విభిన్నంగా సాగాయి.

అత్తలూరి విజయలక్ష్మిగారి 'సాలెపురుగు గూడు వదిలింది' కథ. చివరలో వాక్యాలు... 'సాలెగూడులో చిక్కుకు పోయిన సాలెపురుగు. ఇప్పుడు గూడు వదిలింది, స్వేచ్ఛగా ఎగురుతుంది ఇక.' పోలిక కోసం అనుకున్నా గానీ.. సాలె పురుగు

ఎగురుతుందా??

శ్రీరాజ్ గారి కథ 'జపాన్' వ్యవస్థను వేలెత్తి చూపిన కథ. ముళ్ళపూడి గారి 'కానుక' పాఠకులకు కానుకే!!

అన్నట్టు సంచిక ముగింపు పుటలో ఇచ్చిన చిత్రం, రాసిన మాటలు ఎంత ముచ్చటగా ఉన్నాయో!!

***...రాంబో***

కథామంజరి మాసపత్రిక నిర్వహించిన సినీరంగ మార్తాండ సినిమా కథల పోటీలో ఎంపికైన కథలపై నా అభిప్రాయం

పున్నమరాజు సరోజహరనాధ్‌గారి కథ "మీరు నాకు వద్దు మాష్టారు" లో రచయిత్రి నేటి సినిమా చిత్ర నిర్మాణానికి అద్దం పట్టే కథ. నాటి దర్శకులు నేటి సభ్య సమాజ అభిరుచికి తగ్గట్లుగా సినిమాని తియ్యలేరన్న విషయాన్ని చెప్పకనే చెబుతూ... కథ ముగింపులో మాకు సినిమా వారం రోజులు ఆడితే చాలన్న భావాన్ని వ్యక్తపరచింది.

శ్రీ రత్నాకర్ పెనుమాక గారి 'జమదగ్ని' కథలో జమదగ్ని సినిమాలో నటించాలని వెళ్ళి అవకాశాలు రాక తనతో తెచ్చుకున్న డబ్బులై పోయిన తర్వాత విసిగిపోయిన జమదగ్ని బట్టలుతుకుతూ ఊళ్ళో కనబడితే సినిమాలో నటించడానికి పోయి వెనక్కు తెరిగొచ్చేవేమి?" అని అడిగితే వాళ్ళతో అది 'సినిమా' ఇది 'జీవితం' అన్న నగ్న సత్యాన్ని చెబుతాడు. అటు తర్వాత తన కొడుకు తనలా పాడవకూడదని టి.వి. కేబుల్ పీకేస్తాడు తండ్రైన వాడు.

శ్రీ ఇరిగినేని హనుమంతరావుగారి 'రవి గాంచని చోట' కథలో నిజం, ఓకే, కుట్ర, రాపో, హిట్, శూన్యం, డబ్బు మరియు చెత్త అన్న సబ్ హెడ్డింగ్‌లతో కథను నడిపిన తీరు అభినందనీయం. కథ చివర్లో వ్యక్తిగత జీవితంలో నువ్వు పాటించిన గోప్యతను గౌరవిస్తూ సినిమాను ఆపేస్తున్నాను" అని నవ్వుతూ చెప్పడంతో కథని ముగించాడు రచయిత.

డా.. సుగుణరావు గారి 'నానాటి బ్రతుకు" కథను చదువుతున్నపుడు నాకు నటకిరీటి రాజేంద్ర ప్రసాద్‌గారు నటించిన 'ఆ నలుగురు' సినిమా జ్ఞాపకానికొచ్చింది. అదెంత మాత్రం కరెక్టో నాకు తెలీదు. అనంతరం కథలో కథానాయకుడైన వేదనాయకం సినిమా షూటింగులతో క్షణం తీరిక లేకుండా వుంటున్నప్పుడు... భార్య, పిల్లలు, తమ్ముడు ఎవరూ ఆయనని పట్టించుకునేవారు కాదు. పైగా ఆయనంటే ఇంట్లో అందరికీ భయమే. అదే వేదనాయకం తండ్రికి 82 ఏళ్ళు పూర్తైన సందర్భంగా, వెయ్యి పున్నముల నోమును తన ఫాం హౌస్‌లోనే జరపడంతో తన అమ్మ, నాన్నలను, భార్య పిల్లలను తన దగ్గర వుంచుకొనడంతో సినిమాలో రీషూట్ చేసిన సన్నివేశాన్ని రక్తికట్టించాడు.

శ్రీ దత్తశర్మ పాణ్యంగారి 'దోచుకునే కళ' కథలో నాటి సినిమాలతో అంటే టూరింగ్ టాకీస్‌లలో వేసే సినిమాలను చూసినపుడు జరిగే సంఘటనలను దృశ్యమానం చేశారు. దీంతో పల్లెటూర్లో టూరింగ్ టాకీస్‌లో సినిమా చూసిన వైనాన్ని జ్ఞప్తికి తెచ్చారు. అప్పటి సినిమాలతో ఇప్పటి సినిమాలను పోలుస్తూ వ్రాసిన కథ. కథ వాస్తవికతకు అతి దగ్గరగా ఉన్నది. ఆద్యంతం చదివింపజేసింది. కళ ద్వారా డబ్బును దోచుకుంటున్నారని చెబుతూ సినిమా అంటే కళ్ళు, చెవులు, గుండె అన్నింటినీ పండించాలి. అట్లాంటి సినిమాలెక్కడుంటున్నాయి? అని చురకంటించారు తన కథ ద్వారా. ఇలాంటి కథ వ్రాసిన శ్రీ దత్తశర్మ గారు అభినందనీయులు.

శ్రీమతి వేలూరి ప్రమీలాశర్మ గారి 'తెర వెనుక బొమ్మ' కథలో ఒక ఆడపిల్లని సినిమా హీరోయిన్‌ని చేస్తానని చెప్పి ఎన్ని

కుట్రలు, కుతంత్రాలు, మోసగించడాలన్నవి జరుగుతాయో తెలియచెప్పిన కథ.

శ్రీమతి ఉగాది వసంత పూడిపెద్ది గారి 'సినీమా(య)' కథలో సినిమా ఒక మాయా ప్రపంచమని, అదే ఓ నాటకంలో మీ నటనని బాగా వెలికి తీయవచ్చని, తన తండ్రికి నాటకాలంటే ఇష్టమని తెలుసుకుని కొడుకు, తండ్రి చేత ఓ నాటకాన్ని ప్రదర్శింపజేయడంతో తండ్రి పదుగురిచేత ఓ నటుడిగా గుర్తింపు పొందుతాడు.

మొత్తమ్మీద రంగ మార్తాండ సినిమా కథల పోటీలో బహుమతికి మరియు సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన కథల విషయంలో కథామంజరి సంపాదకవర్గం మరియు న్యాయనిర్ణేతలు కృతకృత్యులయ్యారనిపిస్తున్నది.

**సి. హెచ్. నాగార్జున శర్మ, తిరుపతి.**

జూన్ నెల కథామంజరి సంచికలో అన్ని కథలు బాగున్నాయి. అందులో మెడికో శ్యామ్ రచించిన "ఛీ" అనే కథ ఒక ఆణిముత్యమే. నిజం చెప్పాలంటే మీరు కథారచయిత పేరు వేయకున్నా, ఆ కథారచయిత మెడికో శ్యామ్ అని నేను కనుగొనేవాడ్ని. ఎందుకనగా మెడికో శ్యామ్ విలక్షణ కథారచయిత. అతడు ఒక అక్షరం టైటిల్తో కథను రాయగలడు. "రెణ్నిమిషాలు" అంటూ కథ రాయగలడు. రెండు నిమిషాలలో కథను రాయగలడు. రెండు వాక్యాలతో కూడా కథను ముగించగలడు. అతడు మాటల మాంత్రికుడు. అక్షరాలతో సృష్టి లేనిచోట సృష్టిని సృష్టించగలడు. బ్రహ్మ సృష్టించిన సృష్టికి ప్రతి సృష్టి సృష్టించగల మేధావి. అతడి మాటలతోనే "కథలు రాయడం ఎలా?". దానికి జవాబు "ఎలా బడితే అలా!' అలాంటి కథా రచయిత కలం నుంచి జాలువారిన కథ "ఛీ". మొత్తం కథలో ఎరగని పదాలు ఎన్నో వచ్చాయి.

"సుజాత ఆసుందరాంగి కాదు."

"డిస్టర్బ్డ్ తలపుల తెరవ"

"ఇంత రణానికి, దారుణానికి కారణం సంపాదక మహాశయుడు."


ఇలాంటి పదాలతో వాక్యాలతో కథను రక్తి కట్టించడం మెడికో శ్యాంకే చెల్లింది.

**కె. యల్. యస్. కుమార్**

మీరు ప్రచురించిన కథలన్నీ చదివాను. కథా ప్రమాణాలు అంత ఉన్నత స్థాయిలో లేవనే అన్పించాయి. మొదటి బహుమతి గెల్చుకున్న కథ మాత్రం బాగుంది. క్షీణిస్తున్న విలువలు, దిగజారుతున్న నేటి సినీ ప్రమాణాలు, (సోకాల్డ్ 24 క్రాఫ్ట్స్‌లో), పాత్రల ద్వారా వ్యక్తీకరించారు. ఈ మాయా చట్రం లో ఇరుక్కుపోయి, ఇంకా ప్రమాణాలు పాటించాలనే మధుసూదన్ లాంటి వారు ఎలా సతమతమవుతున్నారో అన్న విషయం స్పష్టంగా వ్యక్తీకరించారు. ఆయనకు సహాయం అందించిన పాత్ర సినీ పతనావస్థను ఘాటుగా చివర్లో వివరించడం బాగుంది. నేడు కళాతపస్వులు కాదు కాసులు రాల్చే మాయాజాల మాంత్రికులు కావాలి అన్న విషయం కుండ బద్దలుకొట్టి మరీ చెప్పారు. నిజంగా రెండో బహుమతికి అర్హమైన కథ నానాటికి బ్రతుకు అనిపించింది. కథ ఆద్యంతము, వేదనాయకం చుట్టూ తిరుగుతూనే జీవన సాఫల్యపాత్రలో తాను మరణించి

జీవించాడా అనిపించింది. ఈ సందర్భంలో నేను చూసిన 'ఇద్దరూ అసాధ్యులే ' చిత్ర షూటింగులో షావుకారు జానకి గారు నటుడు జగ్గారావు తో ఇలా అన్నారు. నువ్వు శవం లాగ పడిఉండి నటనలో అలాగే శవంలాగానే ప్రేక్షకులకు కనిపించాలి, అదే ఆ పాత్రలో జీవించడం అని అన్నారు. ఇది సారథీ స్టూడియోలో 1966 ప్రాంతాల్లో జరిగింది. ఇది నేను ప్రత్యక్షంగా విన్నాను. అది గుర్తుకొచ్చింది. మిగతా కథలు అంతంత మాత్రంగా ఉన్నాయి. జమదగ్ని కథ పర్వాలేదు. కాని సత్యదూరంగా ఉంది. ఆ పద్మవ్యూహంలోకి వెళ్లినవారు తిరిగిరాలేరు. సినిమా(య) కథలో రామారావు పాత్ర సహజం గా ఉంది. ఇలాంటివారు మనకు తరచూ తగులుతూనే ఉంటారు. చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ ఎదుగు బొదుగు లేకుండా. రిటైర్ అయ్యాక కాలక్షేపం కోసం. కళాతృష్ణ, కళాసేవ వట్టిమాటలు. మిగతా కథలపై నో కామెంట్స్.

**రామలింగేశ్వర రావు**



9394738805

# నట నక్షత్రాలు!

వి. రాజా రామమోహనరావు

**సినీరంగ మార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***పేరు, గ్లామర్, డబ్బు దక్కలేదని కాదు, తనలో ఉన్న నటనకి గుర్తింపు, పేరు పెరగడం లేదన్నదే గట్టి దుఃఖం. తనే కాదు, తనలాంటి చాలామందిలాగే రోజురోజుకీ అవకాశాలు లేక నటిగా చచ్చిపోతుంది... ప్రతిరోజూ బ్రతుకుతోంది!***

ప్రఖ్యాత సినీహీరో కృష్ణమోహన్ జీవితంలో ఎన్నో అద్భుతమైన రోజులు ఉన్నాయి. వాటన్నింటికన్నా, ఆ రోజు ఇంకా బావుందనిపించింది. ఒక్కగానొక్క కూతురు కథానాయకిగా నటించిన తొలి చిత్రం విడుదలై, సూపర్ హిట్ అయింది. తన విజయాల కన్నా, తన కూతురి విజయం ఎంతో గొప్పగా ఉంది.

ఆ సంతోషంలో పెద్ద పార్టీ ఏర్పాటు చేశాడు. ఆ పార్టీలోనే ఇద్దరు నిర్మాతలు కృష్ణమోహన్ కూతురు శిరీషని తమ చిత్రాలలో కథానాయకిగా తీసుకున్నారు. అడ్వాన్స్ కూడా ఇచ్చారు.

ఆ రెండు సినిమాలు వారంలోపే షూటింగు ఆరంభించారు. ఆ రెండు సినిమాలు ఏడాది లోపు రిలీజ్ అయి, ఓ మాదిరిగా ఆడాయి. దురదృష్టం... కృష్ణమోహన్ అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయాడు. అది శిరీషకి అన్ని రకాలుగా పెద్ద దెబ్బ!

ఆరు నెలలు చాలా స్తబ్ధుగా గడిచాయి. తండ్రి ఉన్నప్పటికి, పోయిన తర్వాతకి... తేడా స్పష్టంగా తెలుస్తోంది శిరీషకి. తమ ఇంటికి వచ్చేవాళ్ల సంఖ్య బాగా తగ్గిపోయింది.

కృష్ణమోహన్ పెద్ద హీరోగానే కాదు, చాలా మంచిమనిషిగా ఎంతో పేరు వచ్చింది. అయినా మనిషిపోయాక పూలు తప్పవు!

అందులో మిగిలిన రంగాల కన్నా, సినీరంగం తీరు మరీ వేరు! ఎవరి స్వార్థం, ఎవరు పనులు వాళ్లకి ముఖ్యం. మంచిచెడ్డలు పట్టించుకునేవారు, గుర్తుంచుకునేవారు చాలా తక్కువ. తండ్రి పోయాక మళ్లీ ఏ అవకాశం రాలేదు.

అంతవరకూ శిరీష నటించిన సినిమాల ద్వారా మంచి అందగత్తె అనే కాకుండా, చాలా మంచి నటి అన్న పేరు కూడా వచ్చింది. అలా... చాలా మంచి నటిగా పేరు పెంచుకోవాలన్నది శిరీష ముఖ్య ఉద్దేశ్యం!

కృష్ణమోహన్‌కి నిర్మాతల హీరో అని పేరు ఉండేది! వాళ్ల కష్టసుఖాలు బాగా పట్టించుకుని, అన్ని రకాలుగా సాయం చేసేవాడు. అయినా ఆ విశ్వాసంతో ఏ నిర్మాత శిరీషకి అవకాశాలు ఇద్దామని ముందుకి రాలేదు. అదే ఎంతో ఆశ్చర్యం అనిపించింది శిరీషకి. అలా అని తనంతగా తను వెళ్లి ఎవర్ని 'దేహీ' అనడానికి ఆత్మాభిమానాన్ని చంపుకోలేదు. అయినా నటిగా తను పైకి రాలేకపోతున్నాననే దిగులు ఉంది! అవకాశాల కోసం ఓపిగ్గా నిరీక్షిస్తోంది.

చివరికి మరో నాలుగు నెలలకి ఓ నిర్మాత వచ్చాడు. తన సినిమాలో హీరోయిన్‌గా చేయమన్నాడు. వెంటనే ఒప్పుకుంది శిరీష. మర్నాడు తన ఆఫీసుకి వస్తే, అగ్రిమెంట్ చేసుకుని అడ్వాన్స్ ఇస్తానన్నాడు. అలాగే అన్నది.

అన్నట్టుగానే మర్నాడు వాళ్ళ ఆఫీస్‌కి వెళ్ళింది. ఆ మాట, ఈ మాట మాట్లాడి అడ్వాన్స్‌గా చెక్ వ్రాయబోతూ... "మరి ఈ రాత్రికి నాతో గడపాలి!" అన్నాడు.

కమిట్మెంట్ అడుగుతున్నాడు. షాక్ అయింది శిరీష. తండ్రి ఉండగా ఎవరూ తనతో ఇలా ప్రవర్తించలేదు సరికదా, తప్పు దృష్టితో చూసిన వాళ్లు కూడా లేరు. ఆయన పోయి ఏడాది కానే లేదు, వీళ్ళ దృష్టిలో ఎంత తేడా!

తను అలాంటి పనులకి ఎప్పటికీ ఒప్పుకోనని చెప్పేసింది.

"అయితే సినిమా ఉండదు. వేరే హీరోయిన్‌ని చూసుకుంటాను." అన్నాడు.



తనకి ఆ సినిమా అక్కర్లేదని చెప్పి, వెనక్కి వచ్చేసింది. సినిమా అవకాశం పోయినందుకు, అందులో రాకరాక వచ్చిన సినిమా... బాధ కలిగినా, తన తండ్రి అన్నేళ్ల మంచితనాన్ని లెక్కచేయకుండా, ఆ నిర్మాత అలా ప్రవర్తించినందుకు శిరీషకి చాలా బాధ అనిపించింది.

సినిమారంగంలో మనుషుల విలువ ఇంత అల్పమా, అని మొత్తం ఆ రంగం మీదే ఎంతో దుఃఖం కలిగింది. పై స్థితిలో ఉన్న తననే ఇంత చులకన చేస్తే, ఏ అండదండలు లేని పేద అమ్మాయిలని ఇంకెంత నీచంగా చూసి బాధలు పెడుతున్నారో అన్న దిగులు కమ్ముకుంది. సినిమారంగంలో ఎన్ని వేలమంది మగాళ్ళ అభిమానాలు, ఎన్ని లక్షల మంది ఆడవాళ్ళ మానాలు ఆహుతి అవుతున్నాయో అనుకునేటప్పటికి తన బాధే కాదు, వాళ్లందరి బాధ తనకే కలిగినట్టు విలవిల్లాడింది.

ఆ రకం చేదు అనుభవం, తన నటన విలువకి అవకాశం రాకపోవడం, రోజురోజుకీ శిరీషని క్రుంగదీయసాగింది. ఆమెలో నిరాశ, నిస్పృహ కమ్ముకున్నాయి.

ఆ తర్వాత ఏడాదిలో ఓ రెండు చిన్న సినిమాల్లో చేసింది. అతికష్టం మీద అవి ఓటీటీలో రిలీజ్ అయ్యాయి కానీ, ఎక్కువ ప్రాచుర్యం రాలేదు.

నటన బావుంది, చాలా మంచి నటి, మహానటి సావిత్రంత టాలెంట్ ఉందన్నారు. అదే ఎంతో తృప్తిగా సరిపెట్టుకుంది.

కొత్త అవకాశాలు రావడం లేదు. అప్పుడొకటి, అప్పుడొకటి చిన్న అవకాశాలు వస్తున్నాయి. తాను దిగజారి వాళ్లన్నట్టు

వింటే, చాలా అవకాశాలు, పేరు డబ్బు వస్తాయి. అయినా అది ఎంత మాత్రం ఇష్టం అనిపించలేదు శిరీషకి. తన వ్యక్తిత్వాన్ని దిగజార్చి, నీచస్థితికి సిద్ధపడలేదు. సంసారిగానే స్థిరపడాలన్న నిశ్చయాన్ని సడలనివ్వలేదు.

ఏళ్ళు ఏళ్ళు గడుస్తున్నాయి. అయినా శిరీష పరిస్థితి అలాగే ఉంది. మార్పు లేదు.

పేరు, గ్లామర్, డబ్బు దక్కలేదని కాదు, తనలో ఉన్న నటనకి గుర్తింపు, పేరు పెరగడం లేదన్నదే గట్టి దుఃఖం. తనే కాదు, తనలాంటి చాలామందిలాగే రోజురోజుకీ అవకాశాలు లేక నటిగా చచ్చిపోతుంది... ప్రతిరోజూ బ్రతుకుతోంది!

దుర్మార్గాలకి బలి అయి, నశించిపోతున్న నట నక్షత్రాలలో శిరీష జమయిపోవడం ఎంతో దురదృష్టం. చెప్పుకోలేనంత దుఃఖం. మనిషి పోవడం కన్నా, నటజీవితం మరణించటం మరి మరి బాధ.

ఇలా మరుగునే ఉండిపోతున్న నక్షత్రాలు ఎన్నో!

# ప్రేమా నీ చిరునామా ఏమిటి?

సింహప్రసాద్



98490616688

**సినీరంగ మార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***ప్రేమించానంటే చాలదు. ప్రేమించాననుకున్నా చాలదు.***
***దాన్ని మాటలతో గాక చేష్టలతో వ్యక్తపరచాలి.***
***కాలానుగుణంగా మారేది కాదు, కాలాతీతంగా నిలిచేదే నిజమైన ప్రేమ!***
***ప్రేమే అమృతం. అది బతికిస్తుంది. బతుకునిస్తుంది. బతుకుల్ని పండిస్తుంది!***

“హాయ్ మిత్రా!

ఆగాగు. నీ కాంటాక్ట్స్ లిస్టులో లేనని, అపరిచితనని డిలీట్ చేసేయకు. నువ్వు నన్ను గమనించకపోయినా, నువ్వు నాకు బాగా తెలుసు. నేనెప్పుడూ నీలోనే వున్నాను. నీతోనే తిరుగుతున్నాను. నిజం చెప్పాలంటే నువ్వు ఉండేది నా ఛాయలోనే!

ఎందుకో నీకో కథ చెప్పాలనిపిస్తోంది. ఎవరిదో కాదులే, నీ ప్రేమ కథే! నీ ప్రేమ భిన్నమైంది. విచిత్రమైంది. అదంతా ఒకసారి నెమరువేసుకోవడం, సింహావలోకనం చేసుకోవడం అవసరం అనిపిస్తోంది. భవిష్యత్తుకి పునాది... గతమే కదా!

మొదటిసారిగా నివాస్‌ని ఎప్పుడు చూసావో నీకు గుర్తుందా? మరిచిపోయి ఉంటావులే. ఫరవాలేదు, గుర్తు చేస్తాను! అతడు చిన్న బ్యాగ్, బకెట్, అందులో కొన్ని వంట పాత్రలు పెట్టుకుని కృష్ణానగర్‌లోని మీ ఇంటి బెల్ నొక్కగా, నువ్వు వచ్చి తలుపు తీసావు. బాత్రూం కడగడానికి వచ్చాడేమో అనుకున్నావు. డిస్ట్రబ్ చేసినందుకు నుదురు చిట్లించి విసుగ్గా చూసావు. అతడు కంగారు పడ్డాడు. వినయంగా నిలబడి, “మీ ఇంటి ముందు ‘టు లెట్’ బోర్డు చూసి...” అన్నాడు.

“అయితే ఏంటి?”

“రెంట్ ఎంతండి?”

అతన్ని ఎగాదిగా చూసి, “ఒక గదే. ఏడువందలు” అని చెప్పి తలుపు వేసుకోబోతే, “చూపిస్తారా ప్లీజ్...” అన్నాడు.

‘ఒకసారి చూడటానికే అతడు కంపరంగా ఉన్నాడు. వీడు నైబర్ అయితే రోజూ ఇతగాడి ముఖం చూడాల్సి వస్తుంది కర్మ’ అనుకున్నావు. “నీకు ఇవ్వం” అని చెప్పబోతుంటే, మీ నాన్న వచ్చాడు. విషయం కనుక్కోవడం, నివాస్‌కి గది నచ్చడం, అడ్వాన్స్ ఇచ్చి ప్రవేశించడం ఐదు నిమిషాల్లో జరిగిపోయాయి. అతడు సినిమా వేషాలు కోసం వచ్చాడని తెలిసి, అతన్నీ అతడి కోతి ముఖాన్నీ, తింగరి వాలకాన్నీ వెక్కిరిస్తూ ఫ్రెండ్స్ దగ్గర ఎన్నో కామెంట్లు చేశావు. “మన కర్మ కాలి హీరో అయ్యాడా, హాలంతా డోకులే డోకులు!” అని హేళనగా నవ్విన సందర్భాలూ చాలానే ఉన్నాయి!

చిత్రం ఏమిటంటే, నువ్వతడ్ని గొంగళి పురుగులా చూసినా, అతడు నిన్ను దేవతాస్త్రీగా అపురూపంగా చూసేవాడు. ఆ

చూపుల్లో ఆరాధన ఉండేది. ఆ సంగతి నువ్వు గ్రహించడమే కాదు, గర్వంగానూ ఫీలయ్యావు!

అతడు మీ ఇంట్లోవాళ్ళతో ఎంతో చక్కగా కలిసిపోయాడు. మీ అమ్మ సినిమా కబుర్లు అడిగి మరీ చెప్పించుకునేది. ఒకసారి షూటింగుకీ తీసుకెళ్లాడు.

అతడి ముఖం ప్రత్యేకంగా నవ్వొచ్చేలా ఉంటుంది. మాటా చేష్టా హాస్యంగా ఉంటాయి. అవే అతడి మిత్రులచేత సినిమాల్లో ట్రై చేయమని ప్రోత్సహించాయి. 'హీరో పక్కన నీలాంటి వాళ్లే ఉపగ్రహాల్లా ఉంటారు, నీకు కమెడియన్‌గా మంచి అవకాశాలు ఉంటాయి' అని చెప్పి ట్రైన్ ఎక్కించారు.

అక్కాబావల దగ్గర తిట్లూ విసుగుళ్ళూ మధ్య పెరిగిన అతడు, అదృష్టాన్ని వెదుక్కుంటూ, గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కి వచ్చేశాడు.

మొదట చిన్న చిల్లర వేషాలు వేసినా తర్వాత ఒక సినిమాలో హీరోగా బుక్కయ్యాడు.



అతడు నిజ జీవితంలో ఎలా ఉంటాడో అలాంటి పాత్రే! ధనిక అమ్మాయికీ, అమాయక చక్రవర్తికీ మధ్య ప్రేమ కథ. ఎలాంటి ఎక్స్‌పెక్టేషన్స్ లేకుండా విడుదలైన ఆ సినిమా అద్భుత విజయం సాధించింది. 'అతడు నటించలేదు, జీవించాడు' అన్నారు.

బుకింగ్స్ పెరిగాయి. వచ్చి పోయే సినీజనం ఎక్కువయ్యారు. పెద్దింటికి మారాడు. మీ అందర్నీ వదిలి వెళ్ళలేక వెళ్ళాడు .

"మనమ్మాయి అంటే అతడికి చచ్చేంత ఇష్టం. పైగా బరువు బాధ్యతలూ, అనవసర లగేజీలూ లేవు. అల్లుడిగా చేసుకుందాం!" అంది మీ అమ్మ. ఆలోచనలో పడ్డాడు మీ నాన్న!

తల్లీ తండ్రీ లేరు. అక్క దగ్గర పెరిగాడు. అందర్నీ గౌరవించడమే తప్ప నొప్పించడం తెలీదు. ఆ లక్షణం వారికి బాగా నచ్చింది. సంపాదన ఇంకా బాగా ఆకర్షించింది. ఇంతకంటే మంచి సంబంధం తేలేమనుకున్నారు. అతడి అవకాశాలు అంచనా వేసి పెన్నిధి దొరికినట్టు మురిసిపోయారు.

అతడితో పెళ్లి అనగానే, మొదట తల అడ్డంగా ఊపబోయి ఆగిపోయావు. అతడి కన్నా, అతడి చుట్టూ వున్న గ్లామర్ వరల్డ్, ఆపైన వచ్చిపడే విలాసవంతమైన జీవితం చాలా బాగా నచ్చాయి. అతడి గురించి, కష్టపడి పైకి రావడం గురించి నీ మిత్రులు చేస్తోన్న ప్రశంసలూ గుర్తొచ్చాయి. "ఐ లవ్ హిమ్" అనేసి మీ వాళ్ళని ఆశ్చర్యంలో ముంచేసావు!

మీ వాళ్ళెళ్ళి పెళ్లి ఊసెత్తారు! నివాస్ ఆలోచనలో పడ్డాడు. నువ్వు అతన్ని ప్రేమిస్తున్నావని చెప్పడం ఆలస్యం... ఒక్క క్షణం

ఆలస్యం చేయలేదు. అంగీకరించేసాడు!

మీ పెళ్లి అయింది. నిన్ను అపురూప వజ్రంలా చూసుకో సాగాడు. నువ్వు తనని మనస్ఫూర్తిగా ప్రేమించ లేకపోయేదానివి. కానీ అతడు షూటింగ్‌కి ఎక్కడికెళ్ళినా ఎన్నో బహుమతులు తెచ్చేవాడు. నగలు, చీరలు, ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన పిండి వంటలు!

నగలు నచ్చేవి కానీ, చీరల రంగు, డిజైన్ ఓల్డ్ ఫ్యాషన్ అనే దానివి! నీకేం తెలీదని ఈసడించేదానివి. అయినా ఫీలయ్యేవాడు కాదు. నిన్ను షాపింగ్‌కి తీసుకెళ్ళి నీకు నచ్చిన చీరలు కొని పెట్టేవాడు.

అతడిలో ఒకే ఒక బలహీనత ఉంది. ఎవరైనా కష్టాల్లో ఉంటే చూడలేకపోయేవాడు. లేదనకుండా డబ్బు ఇచ్చేసేవాడు. అది ఎంత, మళ్ళీ వెనక్కి వస్తుందా లేదా అని ఆలోచించే వాడే కాదు!

అది నీకు నచ్చేది కాదు. అరిచేసే దానివి. తిట్టే దానివి. ఇక అలా చెయ్యననేవాడు. మళ్లీ మామూలే. మీ వాళ్లకు చెప్పావు. "ఇలా అయితే కొండలైనా కరిగిపోతాయి. ఇక పిల్లలకేం మిగులుతుంది, మట్టీ మశానం!" అంటూ 'నట్లు బిగించమని' సలహా ఇచ్చింది మీ అమ్మ.

అక్షరాలా అమలు చేసేసావు! అతడు గిలగిల్లాడాడు. డబ్బు పెత్తనం నీ చేతుల్లోకి తీసుకున్నావు. అతడు నొచ్చుకోలేదు. పైగా, "నీకన్నీ తెలుసు. వ్యవహార జ్ఞానం ఎక్కువ" అని పొగిడేవాడు. ఏనుగు అంబారీ ఎక్కేదానివి.

నువ్వు చెప్పిన ప్రదేశాలకే హనీమూన్‌కి వెళ్ళారు. బాగా ఎంజాయ్ చేశారు. "నువ్వంటే నాకెంతో ఇష్టం. నేను నీ భార్యని కావడం నా అదృష్టం" అన్నావో రోజున. ఇప్పుడు మర్చిపోయి ఉంటావులే. అప్పుడతడు నీకు ఎన్ని ముద్దులు పెట్టాడో పోనీ అదైనా గుర్తొస్తుందేమో జ్ఞాపకాల పొరలు తవ్విచూడు!

నివాస్ మాత్రం ఆ మాటలు మర్చిపోలేదు. ఇప్పటికీ రోజూ గుర్తు చేసుకుంటూనే ఉంటాడు. పరమానంద పడుతూ గంతులేస్తూనే ఉంటాడు!

అనతికాలంలోనే నీకు నెల తప్పింది. నివాస్ ఎంత పొంగిపోయాడో నీకు బాగా తెలుసు. కొత్త మోడల్ డైమండ్ హారం కొని, బహూకరించాడు. ఫ్రెండ్స్‌కి పార్టీ ఇచ్చాడు. నీ పేరున ఫిల్మ్‌నగర్‌లో పెద్ద ఇల్లు కొన్నాడు.

'నాకు బిడ్డ పుట్టబోతున్నాడు. నాకూ కుటుంబం ఏర్పడుతుంది. ఇక నా వాళ్ళు ఉంటారు' అని అర్ధరాత్రివేళ లేచి మరీ బిగ్గరగా అరిచి చెప్పేవాడు. నువ్వతడినో పిచ్చోడిలా చూసి మురిపెంగా మందలించే దానివి!

'నా వాళ్ళు' అన్న మాట అతడికి కిక్ ఇచ్చేది. అయిన వాళ్ళ ప్రేమ, ఆదరణ, ఆప్యాయతలు చవి చూడలేదు గనుక అతడికి వాటి విలువ బాగా తెలుసు!

మగపిల్లాడు పుట్టాడు. మీ ఇద్దరి ఆనందానికీ అవధులు చెరిగిపోయాయి. బాబుకి నీ పోలికలు వచ్చినందుకు నివాస్ ఎంతో పొంగిపోయాడు. 'యువరాజు' అని పేరు పెట్టారు! అక్షరాలా అలాగే పెంచారు.

మెల్లగా అతడి సినిమాలు ఫ్లాపవసాగాయి. అయినా అతడు కృంగిపోలేదు. కానీ నువ్వు అదంతా అతడి తప్పేనని నిందించేదానివి. పాత్రల సెలక్షన్ సరిగ్గా చేసుకోమని పదేపదే హెచ్చరించేదానివి.

అతడు మిత్రులకు చాటుగా డబ్బు సాయం చేస్తున్నాడని తెలిసి అగ్గి మీద గుగ్గిలం అయ్యావు! బ్రతిమాలినా కళ్ళనీళ్లు పెట్టుకున్నా శాంతించలేదు. ఇంకెప్పుడూ నీ అనుమతి లేకుండా ఎవరికీ ఎలాంటి సాయమూ చేయనని బిడ్డ మీద ఒట్టు పెట్టుకున్నాక గాని నువ్వు దిగిరాలేదు.

యువరాజు ఎందుచేతో మందకొడిగా ఉండేవాడు. అన్నిటికీ సరిగ్గా స్పందించేవాడు కాదు. నివాస్ బెంబేలు పడేవాడు. హాస్పిటల్‌కి తీసుకెళ్లి చూపిస్తానంటే నువ్వు ఒప్పుకునే దానివి కాదు. ‘అతడిదంతా విడ్డూరం’ అనేదానివి. ‘కొందరు పిల్లలు ఇలాగే ఉంటారని’ మీ అమ్మ చెప్పిన మాటలే నీకు వేదవాక్కులయ్యాయి. కానీ మిత్రులు కూడా ప్రవర్తన, ప్రతిస్పందన తేడాగానే ఉందని చెప్పేసరికి, అప్పుడు డాక్టర్ దగ్గరికి పరిగెత్తారు.

‘ఆటిజం’ అన్నారు. నివాస్ బావురుమన్నాడు!

“మీ వాళ్ళలో మందమతులు ఉండి ఉంటారు. వారి లక్షణాలే వీడికి వచ్చాయి!” అని దెప్పిపొడవడం, అతడి జీన్స్ లోపమే కారణమని నిందించడం... చేసేదానివి. బిడ్డలో నీ జీన్సూ ఉన్నాయని మరచిపోయావు. ఒక్కోసారి బిడ్డ కడుపులో ఉండగానో, లేక తర్వాతో ఘోరఘటనలు చూస్తేనో, షాక్ అయితేనో కూడా అలా జరగవచ్చు అని డాక్టర్ వివరించినా నువ్వు విశ్వసించేదానివి కాదు.

బిడ్డ అలా కావడానికి ముమ్మాటికీ అతడే కారణమనేదానివి. దోషిగా నిలబెట్టేదానివి. మొదట నమ్మకపోయినా, నువ్వు పదే పదే చెబుతూ ఉంటే, ‘నిజమే కాబోలు’ అనుకునే స్థితికి వెళ్ళాడు నివాస్. తనని తాను ద్వేషించుకోవడం మొదలుపెట్టాడు.

ఆ బాధ మరిచిపోడానికి మెల్లగా ‘మందు’ వైపు మళ్ళాడు .

హీరోల వేషాల కోసమే ఎదురు చూడకుండా ఏ వేషం వస్తే దానికి సిద్ధపడ్డాడు. బుకింగ్స్ పెరిగాయి! చక్కని క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎదిగాడు. తమిళంలో చేసిన ఓ పాత్రకి జాతీయస్థాయిలో సహాయ నటుడి అవార్డు వరించింది.

అప్పుడు నువ్వు ఇచ్చిన సలహా గుర్తుందా మైత్రీ? బహుభాషా నటుడయ్యాడు గనుక రేటు పెంచమనీ, నిర్మాతల దగ్గర నిక్కచ్చిగా వసూలు చేయమనీ చెప్పావు!

నిర్మాతలకు అందుబాటులో ఉన్నందునే అన్ని రకాల పాత్రలూ వస్తున్నాయని అతడి నమ్మకం. అందుకే రేటు పెంచడం ఇష్టంగాలేదు. అదీగాక ఊహల్ని మించి సంపాదించానన్న సంతృప్తీ వుంది. కానీ నువ్వు ఎగదోశావు. ఇంకా ఇంకా సంపాదించాలంటూ ఇతర నటులతో పోలుస్తూ చెప్పావు. అతడు ఎదురు చెప్పలేదు. చెబితే నువ్వెక్కడ బాధపడతావోనని భావించాడు. కీర్తితోబాటు ఆదాయమూ పెరిగింది. అదంతా నీ గొప్పేనంటూ ఆ క్రెడిట్ నీకే ఇచ్చేవాడు.

యువరాజుని ముంబై హాస్పిటల్‌కి తీసుకెళ్ళి స్పెషలిస్ట్‌కి చూపించాడు! అక్కడ ఖరీదైన వైద్యం చేయిస్తుంటే నువ్వేమో , “డబ్బును మంచి నీళ్లలా తగలేస్తున్నావు” అని గొడవ పెట్టేదానివి.

“ఇది ఒక్కసారిగా తగ్గే జబ్బు కాదు. మెల్లమెల్లగా మార్పు వస్తుంది. టైం పడుతుంది” అన్నాడు డాక్టర్.

“ఇంకప్పుడు మా సిటీయే బెటర్’ అని హైదరాబాద్ తీసుకొచ్చేసావు.

“డబ్బు కన్నా పిల్లాడి భవిష్యత్తు ముఖ్యం” అని నివాస్ నచ్చచెప్పాలని చూసినా, ససేమిరా వీల్లేదన్నావు. నిన్ను మీ అమ్మ బలపరచడంతో రెచ్చిపోయావు.

నివాస్ తాగుడు ఎక్కువయింది. అశాంతితో కొట్టుకునేవాడు. నువ్వు కనీస సానుభూతి చూపేదానివి కాదు. అప్పుడు జరిగిన ఓ ఘటన మీ కథని మరో మలుపు తిప్పింది!

నివాస్ బెంగళూరు షూటింగ్లో ఉండగా, ఆ సినిమా సైడ్ హీరోయిన్‌తో కలిసి రెస్టారెంట్లో డిన్నర్‌కి వెళ్ళాడు. దాన్ని ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు.

'ఎందుకెళ్ళేవని' నువ్వు అడగలేదు. నిజానిజాలు తెలుసుకోలేదు. "నీ ముఖానికి నేను సరిపోనా? దిష్టిబొమ్మలాంటి నీకు ఇంకో బొమ్మ కావాలా? దానితోనే ఊరేగు!" అంటూ బిడ్డను తీసుకుని పుట్టింటికి వెళ్లి పోయావు.

ఆగాగు మైత్రీ! తొందరపడి నీ అభిప్రాయం చెప్పకు. నువ్వు నాకేదో చెప్పడం, నిన్ను నువ్వు సమర్థించుకోవడం ముఖ్యం కాదు. దానికోసం ఇదంతా చెప్పుకురావడం లేదు. నువ్వు ఆలోచించడమే, పునర్విచారణ చేసుకోవడమే నాకు ప్రధానం!

ఆ దెబ్బ నివాస్ తట్టుకోలేకపోయాడు. విలవిల్లాడుతూ మీ ఇంటికి వచ్చి కన్నీళ్లతో ప్రాధేయపడ్డాడు. కాళ్ళమీద పడి బ్రతిమాలాడు. ఒట్లు పెట్టుకున్నాడు.

కానీ నీ ఈగో సంతృప్తి పడలేదు!

"నీ ఆస్తి అంతా ఏ తైతక్కలదానికో రాసివ్వవనీ, నా కూతుర్ని నడిరోడ్డున పడెయ్యవనీ గ్యారంటీ ఏమిటి?" అని వీరంగం ఆడింది మీ అమ్మ.

మీ నాన్న దౌత్యం వల్ల మొత్తానికి రాజీకుదిరింది. ఆస్తంతా యువరాజు పేరు మీదకు మార్చడానికీ, నిన్ను గార్డియన్‌గా నియమించడానికీ అంగీకరించాడు. రాతకోతలయ్యాకే ఇంటికి తిరిగి వచ్చావు.

మీ ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నా ఎందుకో మీ మధ్య సయోధ్య కుదరలేదు. పెరగలేదు. మరోపక్క ఎనిమిదేళ్ళు వచ్చినా... యువరాజు ఇతరులతో కలవడం లేదు. మాట్లాడడం లేదు. ఐ కాంటాక్ట్ లేదు. పిలిస్తే పలకటం లేదు. ఒంటరిగానే బొమ్మలతో ఆడుకోడానికే ఇష్టపడుతున్నాడు! ప్రత్యేకంగా పెట్టిన ఆయా మాటలకు బాగానే రెస్పాండ్ అవుతున్నాడు గాని ఇంకెవరితోనూ కలవటంలేదు.

మీరిద్దరూ వాడితో ఎంత ఎక్కువ సమయం గడిపితే అంత ప్రయోజనం ఉంటుందని డాక్టర్ చెప్పాడు.

నివాస్ షూటింగుల్లో తిరుగుతుంటే, నువ్వు ఫ్రెండ్స్‌తో పార్టీలతో బిజీ అయ్యావు. అయినా అతన్నే వేలెత్తి చూపేదానివి!

అతడు నిన్ను పీకలదాకా ప్రేమించాలని ఆశించావు గాని, అతడ్ని నువ్వెంత ప్రేమిస్తున్నావని ఎప్పుడూ ఆలోచించ లేదు!

నీకు మళ్ళీ గర్భం రాకపోవడానికి కారణం అతడి బయటి తిరుగుళ్లే అని కొత్త పల్లవి ఎత్తుకున్నావు. షూటింగ్ ఉన్నా లేకపోయినా నివాస్ క్యాంపులకు వెళ్లడం ఎక్కువైంది.

ఒక టీవీ నటి సాంగత్యంలో సాంత్వన పొందుతున్నాడని ఆలస్యంగా తెలిసింది. రగిలిపోయావు.

ఒకరోజున వారిద్దరూ హోటల్ రూమ్‌లో ఉండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని మీడియా ముందు రాద్ధాంతం చేశావు.

ఇదే అదనని ఎగబడిన యూట్యూబర్లకి నివాస్ గురించి అవాకులూ చవాకులూ చెప్పావు. అతడికి నీమీద ప్రేమ లేదని చెప్పి,

విడాకులు కోరుతూ కోర్టుకెక్కావు.

అది నివాస్‌కి అశనిపాతం అయింది! తట్టుకోలేకపోయాడు. ముఖ్యంగా యువరాజుకి దూరంగా ఉండలేనన్నాడు! రాజీకి స్వయంగానూ మిత్రుల ద్వారానూ ప్రయత్నించాడు, కానీ నువ్వు మెత్తబడలేదు. అడుగు వెనక్కి తీసుకోలేదు. అతడి ముఖం చూడనని తెగేసి చెప్పావు.

కోర్టు విడాకులు మంజూరు చేసింది. యువరాజ్‌ని నీ సంరక్షణలోనే ఉంచింది. ప్రతి నెలా 1, 15 తారీకుల్లో అతడు కొడుకుని కలుసుకోవచ్చని వెసులుబాటు కల్పించింది.

ఆ రెండు రోజులూ మిస్సవకుండా వచ్చేవాడు నివాస్. యువరాజుకి ఎన్నో కొని తెచ్చేవాడు. బయటికి తీసుకెళతానంటే అంగీకరించేదానివి కాదు. బెంగ పెట్టుకున్నాడనీ, బెదురుతున్నాడనీ, అందువల్లే వాడిలో మార్పు మందగించిందనీ నివాస్ బాధపడ్డాడు. మళ్ళీ ముంబైకి తీసుకెళ్ళి, మంచి ట్రీట్మెంట్ ఇప్పిస్తానని బతిమాలాడు.

నీ నుండి వేరు చేయడానికి ప్లాన్ చేస్తున్నాడని మండిపడ్డావు. అతని రాకపోకల మీద ఆంక్షలు అధికం చేసావు.

ఇక ఈరోజు ఉదయం జరిగింది... ఇంకా పచ్చిగానే ఉండి ఉంటుంది గనుక, ఒక్క ముక్క కూడా మర్చిపోయి ఉండవు! అయినా మననం అవసరమేమో గుర్తు చేస్తాను.

ఇవాళ్టి తారీకు 12. యువరాజు పుట్టినరోజు. కొత్త డ్రెస్సులు, పెద్ద విమానం బొమ్మ, యువరాజుకు ఇష్టమని కుక్కపిల్లనూ కొని ఉదయమే నివాస్ మీ ఇంటికి వచ్చాడు.

కోర్టు అనుమతి లేదు గనుక కొడుకుని చూపించనన్నావు. 15 నే రమ్మని చెప్పి తలుపులు వేసేసావు. యువరాజుని చూడకుండా వెనుతిరిగేది లేదని నివాస్ పంతం పెట్టాడు. ఇవాళే... ఇప్పుడే చూడాలని భీష్మించాడు. మీ ఇంటి గేటు దగ్గర నానా రభస చేశాడు. మీడియా వచ్చినా సిగ్గు పడలేదు.

అభాగ్య తండ్రినంటూ విలపించడం చూసి మీడియా కల్పించుకోబోయింది. వారికి నువ్వు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు.

మెల్లగా అందరూ చెదరిపోయారు. నివాస్ ఒక్కడూ మిగిలిపోయాడు. ఇంటి కిటికీ తలుపులు సైతం మూసేసినందున నువ్వు చూడలేదు గాని, ఒక్కసారి తెరిచి ఉంటే కనిపించేది. తెలిసేది!

రోడ్డుకవతల కారు పక్కన రోడ్డు మీదే చతికిలబడ్డాడు. యువరాజు కనిపిస్తాడేమోనని ఇంటి వైపే ఆశగా చూస్తూ కూర్చున్నాడు. తాగుతూ వాగుతూ వున్నాడు. వర్షం మొదలైంది. కారులోకెళ్ళి తల దాచుకోలేదు. అలాగే నిలువునా తడుస్తూనే ఉండిపోయాడు! అప్పుడైనా నీ మనస్సు కరుగుతుందేమోనని ఆశగా చూస్తూండిపోయాడు!

ఎవరైనా సరే కాల మాన పరిస్థితులు తెలుసుకోవాలి. మానవ సంబంధాలని అర్థం చేసుకోవాలి. సరైన పని సకాలంలో చేయాలి. సమయం మించిపోయాక చేసేదేమీ ఉండదు. దాన్నే కాలజ్ఞానం తెలుసుకోవడం అంటారు!

కాలజ్ఞానం అంటే భవిష్యత్తు గురించి తెలుసుకోవడం కాదు, కాల స్పృహ కలిగివుండటం... సమయ సందర్భాలను బట్టి కాలానుగుణంగా ప్రవర్తించడం... చేజారిన కాలం తిరిగి రాదన్న స్పృహతో జాగ్రత్తపడడం!

ప్రేమించడం అంటే అవతలి వారి బలాలతో బాటు బలహీనతల్నీ ఇష్టపడటం. ఆ పని నువ్వు చేసావా, అతడు చేశాడా

అని ఎవరికివారు తర్కించుకోవాలి. సమీక్షించుకోవాలి. సరిదిద్దుకోవాలి! ముఖ్యంగా యువరాజు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలి.

ఇంత క్రితమే నివాస్ స్పృహతప్పి పడిపోతే అభిమానులు, పోలీసులు ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్లో 'మైత్రి' 'యువరాజ్' అని కలవరిస్తూ ఉండటం విని ఉండబట్టలేక వచ్చాను. నివాస్ ప్రాణదీపం గాలిలో అల్లల్లాడుతోంది. సమయం చాలా తక్కువగా ఉంది. ఇదంతా నీలో కదలిక రావచ్చనే ఆశతో చెప్పుకొచ్చాను.

యువరాజ్‌ని తీసుకుని ఆస్పత్రికి వెళ్తావో మానతావో, అతడి ప్రాణాలు రక్షిస్తావో లేదో గాని, ప్రేమ జాడలేమైనా కనిపిస్తాయేమో నీ లోలోన వెదుక్కో!

చివరిగా ఒక్క మాట! ప్రేమించానంటే చాలదు. ప్రేమించాననుకున్నా చాలదు. దాన్ని మాటలతో గాక చేష్టలతో వ్యక్తపరచాలి. కాలానుగుణంగా మారేది కాదు, కాలాతీతంగా నిలిచేదే నిజమైన ప్రేమ!

ప్రేమే అమృతం. అది బతికిస్తుంది. బతుకునిస్తుంది. బతుకుల్ని పండిస్తుంది!

చూద్దాం, నీ ప్రేమజల జలజలా ప్రవహిస్తుందో లేక ఎండి ఎడారిగా మారుతుందో!

ఇంతకీ నేనెవరో చెప్పలేదు కదూ. నేను కాలాన్ని! సర్వసాక్షిని! నీ అంతరాత్మని!''



9949705166

# జవరాలి జడదెబ్బ

డీ.వీ. హనుమంతరావు

**సినీరంగ మార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***అర్ధాంగి నడుము మీద సున్నితంగా చెయ్యి వేసాడు, నెమ్మదిగా లోపలకి తీసుకు వచ్చాడు, లాలనగా శిరసు మూర్కొన్నాడు, ముక్కు బాగా లోపలికిలాగి మత్తుగా పువ్వుల ఘుమఘుమలు ఆస్వాదింపబోయాడు, మాయాబజార్ సినిమాలో రేలంగి లాగా...***

"కట్" ఎవరో గట్టిగా అరచారు...

తెల్లటి మేకప్పు వేసుకున్న నల్లటి హీరోయిన్ తెల్లబోయింది.

రోలింగ్‌లో ఉన్న కెమేరా ఆగిపోయింది.

హీరోయిన్ తల్లితో ముచ్చట్లాడుతున్న నిర్మాత గారు సర్దుకోవాల్సొచ్చింది.

అప్పగిస్తున్నట్టు డైలాగ్ చెప్తున్న హీరోయిన్ సోయగాలు కన్నప్పగించి చూస్తున్న డైరెక్టర్‌గారు ఉలిక్కిపడి...

"ఎవరది?" అని ప్రతిధ్వనించారు...

"గోపి అండి!" అన్నారు ఎవరో!

"కాదు... గోపు! నేటి అసిస్టెంట్ డైరెక్టర్.. రేపటి డైరెక్టర్" అంటూ సదరు అరుపు ఎదరకి వచ్చాడు.

"కట్ చెప్పాల్సింది నేను... నువ్వు చెప్తావేంటి?" గావుకేక పెట్టారు డైరెక్టర్‌గారు.

"అదేనండి, ఆవిడ డైలాగ్ చెప్పే పద్ధతి బాలేదండి." అన్నాడు గోపు అనే గోపి.

"ఆవిడకు బోల్డు నాటకానుభవం ఉంది. నీకేం తెలుసు?" అని, "అయినా గుడ్డొచ్చి పిల్లనెక్కిరించినట్టు... బచ్చాగాడు, వీడుటండీ నాకు నీతులు చెప్పేది!" అన్నారు సదరు డైరెక్టర్ జనాంతికంగా, కొంచెం ఆగి వెనక్కి క్రీగంట చూస్తూ!

సూచన గ్రహించిన మాగధులు, వందిలతో కలిసి పకపకా నవ్వారు.

"అదేనండి బాబూ! ఆ నాటకానుభవమే జీర్ణించుకు పోయింది. నాటకంలోలాగా మైకుకోసం ముందుకు రావడం. ఆడియన్స్ కేసి తిరిగి డైలాగ్ చెప్పడం, డీప్‌లో ఉన్న యాక్టర్‌కి, ఈవిడ ముఖం చూపదు, ఈవిడ ఎక్స్‌ప్రెషన్ తెలియదు, ఈవిడ డైలాగ్ వినపడదు, ఆయన ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తున్నాడు...

అటు చూడండి – మరో నాటకానుభవం. ఈవిడ ఎక్స్‌ప్రెషన్ ఏమిటో, ఏం చెప్తోందో... తన రియాక్షన్ ఏంటో తెలియక తికమక పడిపోతున్నాడు పాపం! ఇది సినిమాలా లేదండీ బాబూ, ఏదో నాటకంలా ఉంది!"

"తెలుసు, ఐతే మాత్రం, కట్ అని నేనుకదా చెప్పాలి!" గాభరాగా మరో గావుకేక పెట్టేడు. ప్రిస్టీజీ కొచ్చన్ కదుటండీ మరి!

"పోనీ మీరే చెప్పండి..." అన్నాడు రేపటి డైరెక్టర్.

"చెప్పమని నాకు చెప్పడానికి నువ్వు ఎవడవు, నేనా డైరెక్టర్, నువ్వా?" అని పేట్రేగిపోతూ, "ఫస్ట్ యూ గెటవుట్! వీణ్ణి బయటికి పంపేయండి!" అని కోపం వస్తే వచ్చే ఇంగ్లీషులోనూ, అలవాటైన తెలుగులోనూ, అరిచారు డైరెక్టర్‌గారు.

★★★

కట్ చేస్తే...

"నావల్ల కాదబ్బాయి, ఏదో మన ఊరి వాడని, నువ్వు చెప్పావని, డైరెక్టర్‌గారిని ఒప్పించి పనికి పెడ్తే... నాకే ఎసరు పెట్టేటట్టున్నాడు." అన్నాడు వెంకట్రావ్, గోపి మామయ్యతో.



వెంకట్రావ్, గోపి మామయ్యా మంచి ఫ్రెండ్స్. ఈ వెంకట్రావ్ డైరెక్టర్‌గారికి పర్సనల్ సెక్రెటరీ.

"అది కాద్సార్! ఇది సినీమా కదా, నాటకంలో లాగా కెమెరా కేసి చూసి డైలాగ్ చెప్తే ఏం బాగుంటుంది సార్. కారెక్టర్ వైపు చూసి చెప్తే, అక్కడో క్రేన్ షాట్ తీస్తే, వైడ్ సీన్‌తో నాచురల్‌గా ఉంటుంది కదా అని అలా చెప్పా!" అన్నాడు గోపీ.

నిజమే అనిపించింది వెంకట్రావ్‌కి. "'సరే! మూడ్ చూసి మళ్ళీ చెప్తాలే డైరెక్టర్‌గారికి... పాపం మంచివారే, వినొచ్చు!"

★★★

కట్ చేస్తే...

"ఏదో మంచి స్పార్క్ ఉన్నవాడంటున్నావు కదా, హీరోయిన్‌కి డైలాగ్ చెప్పి, షాట్‌కు రెడీ చేయమను... మీ స్పార్కును!" అన్నారు డైరెక్టర్‌గారు.

గోపు వెంటనే పరుగెత్తాడు. అక్కడ హీరోయిన్‌కు మేకప్ టచ్ చేస్తున్నాడు మేకప్‌మాన్. హీరోయిన్ ఆడ అసిస్టెంట్ చేతిలో పెద్ద పొడుగాటి మల్లెపూల దండ... ఘుమఘుమలు పంచుతుంటే ఆనందంగా గోపు అక్కడికి వెళ్ళాడు. ఆ సరికి హెయిర్‌డ్రస్సర్ హీరోయిన్‌కి సవరం సర్దుతోంది.

"'ఓ ఒరిజినల్ కాదా, ఇదంతా సవరమా!" సప్రైస్డ్ వాయిస్‌లో స్టన్నయ్యాడు గోపు.

"వండర్‌ఫుల్..." గోపులోని డైరెక్టర్ విజృంభించాడు. మనసులో రెడీ చేసుకున్న షాట్‌ను గాట్టిగా చెప్పేస్తున్నాడు.

"ముందు హీరోయిన్ చీరచాటున, కనబడీ కనబడనట్టున్న కప్పు లేని నడుముమీద జూమ్, నెమ్మదిగా పూలతో నిండిన వాలుజడపై ఫోకస్... "వాలుజడా ... వయ్యారాల వాలుజడా..." ఇక్కడ మంచి లిరిక్‌కీ పాట ఉంటుదన్నమాట! వెంటనే గోడమీదకు పాన్ చేస్తాము... 'తెల్లటి గోడపై నల్లటి వాలుజడా... లూజ్ అయిన జడా, జడకి మోజు పెంచే జడా..." పాట అవుతూ ఉంటుంది. అక్కడ పెట్టిన సవరాన్ని ఫోకస్ చేస్తాము. నడుము మీద ఒరిజినల్ జడ, గోడమీద సవరం జడా... అటూ ఇటూ... కెమెరా వర్క్ చేస్తాము! కవిగారికి చెప్పి సిరివెన్నెలగారి లెవెల్‌లో ఓ బ్రహ్మాండమైన సాంగ్ వ్రాయించి పెట్టామంటే... వాహ్, అదిరిపోతుంది! సజెస్టివ్‌గా ఉరకలు వేసే నీలి సముద్రాన్నో, జలజల పారే నల్లటి కృష్ణవేణినో ఫోకస్ చేస్తే... వండర్‌ఫుల్... కావాలంటే గ్రాఫిక్స్‌లో జడకు, సవరానికి కూడా మూవ్‌మెంట్ పెట్టొచ్చు!" రేపటి డైరెక్టర్ ఉత్సాహంగా కేకలు వేసాడు... 'యురేకా' అంటూ!

"అమ్మో ..." ఏడుపు లంకించుకుంది ఉలిక్కిపడ్డ హీరోయిన్

"ఏమైందే తల్లీ..." అని ఏడుపులాంటి గొంతుతో హీరోయిన్ తల్లి వచ్చేసింది నిర్మాత ప్రక్కనుంచి.

"ఏమైందబ్బా?" నిర్మాత ఆశ్చర్యం.

"ఏముంది, ఆ గోపుగాడు కొంప ముంచి ఉంటాడు!" అర్థమై పోయింది డైరెక్టర్‌కి.

ప్రశ్నార్థకంగా చూసారు వందిమాగధులు!

"ఛీ! ఛీ! కొంప అంటే అదికాదు" అని డైరెక్టర్‌గారు, "వెంకటరావ్" అంటూ పొలికేక పెట్టారు.

పరుగెత్తాడు వెంకట్రావ్. బ్రతిమాలాడు, బామాలాడు 'ఊహూ'...

'కాళ్ళా వేళ్ళా, చేతులా వేళ్ళా... కలిపీ, కలపకుండానూ పడ్డాడు.

'ససేమిరా' డైరెక్టర్‌గారు.

చేతులు పట్టుకుని... "ఇవి చేతులే" అన్నాడు వెం.రావు కవితాత్మకంగా.

'కాదు' అనబోయారు, పాత పద్ధతి డైలాగ్ అనుకుని.

కానీ వెంటనే కవి ఆత్మ తెలుసుకుని నాలిక్కరుచుకున్నారు.

కాళ్ళు పట్టుకోబోతే... వెనక్కి తీసేసుకున్నారు, కరచుకున్న నాలుకపై చేయి వేసుకుని, రాయిచేసుకున్న గుండెతో డైరెక్టర్‌గారు...

★★★

కట్ చేస్తే...

ఇంటికొచ్చేసాడు గోపు... కాదు గోపి. వాలుజడా, నిండా మల్లెలు, విరజాజులు తురుముకుని, గడపదగ్గర 'బాపుగారి

బొమ్మలా' వయ్యారంగా నిలుచుని స్వాగతం పలికింది శ్రీమతి.

'షాట్ రెడీ' అనుకున్నాడు.

తనే 'యాక్షన్' చెప్పేసుకున్నాడు,

అర్ధాంగి నడుము మీద సున్నితంగా చెయ్యి వేసాడు, నెమ్మదిగా లోపలకి తీసుకు వచ్చాడు, లాలనగా శిరసు మూర్కొన్నాడు, ముక్కు బాగా లోపలికి లాగి మత్తుగా పువ్వుల ఘుమఘుమలు ఆస్వాదింపబోయాడు, మాయాబజార్ సినిమాలో రేలంగి లాగా...

ఇంతలో శ్రీమతి మెత్తగా, కవితాత్మకంగా ...

"ప్రాణేశ్వరా... జర జడ భద్రమే" అంది.

అప్పటికే శ్రీమతి వాలు జడలోంచి విడిపోయిన ఆ జడ గోపీ చేతిలో ఉంది.

జ(స)వరాలు జడ దెబ్బకి కుర్చీలో వాలిపోయాడు... రేపటి డైరెక్టర్ గోపు.



9014659041

# రంగుల కల

కె. వి. లక్ష్మణరావు

**సినీరంగ మార్తాండ కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

***మనిషి తాను అనుకున్న రంగంలో పైకి ఎదగాలంటే కృషి బాగా చేయాలి. కానీ మార్తాండంలో కసి ఉంది గానీ కృషి లేదు. అనుకరణ ఉంది గానీ అదృష్టం లేదు. కొన్ని జీవితాలు అంతే! ఏది ఏమైనా... మార్తాండం సినిమా పిచ్చోడు మాత్రమే కాదు, సినిమారంగం వలన పిచ్చోడిగా మారిన వాడు.***

“ఎలా ఉన్నాను శాస్త్రీ?” అడిగాడు మార్తాండం నా ముందు నడుమున చేతులు ఆన్చి ఫోజిస్తూ!

మార్తాండం

కేసి తేరిపారా చూశాను. నలిగిన తెల్లని లాల్చీ, పైజామాలో ఉన్నాడు. పెన్ను మాత్రమే పట్టే జేబు.

“అచ్చు కన్యాశుల్కంలో గిరీశంలా ఉన్నావు!” అన్నాను నవ్వుతూ.

“నాతో మాట్లాడటమే ఓ ఎద్యుకేషన్... ఈ డైలాగ్ ఎలా చెప్పానోయ్?” అరుగు మీద ఒక స్తంభానికి చేయి ఆన్చుతూ, మరో చేతిలోనున్న చిన్న రూళ్ళ కర్రను తిప్పుతూ అడిగాడు.

“మేనరిజం లోనే కాదు, మాట్లాడటంలో కూడా గిరీశం కనబడుతున్నాడు! నీలో గొప్ప నటుడున్నాడు మార్తాండా!” కుర్చీలో కూర్చోమన్నట్టుగా సైగ చేస్తూ అన్నాను. నేను అలా అనడంతో కుర్చీలో కూర్చున్నాడు.

“చెప్పు... ఉదయమే ఇంటికి వచ్చావు... ఏమిటి విశేషం?” అని అడిగాను.

“నిజం చెప్పు శాస్త్రీ! నాలో గొప్ప నటుడు లేడంటావా?” సీరియస్‌గా చూస్తూ మళ్ళీ అడిగాడు.

“అలా ఎవరన్నారు గిరీశం?” అన్నాను.

నా మాట విని ఒక్కసారిగా నవ్వాడు. తనను తాను పరిశీలనగా చూసుకున్నాడు.

“శాస్త్రీ! తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తున్నావు. ఎన్నో నాటకాలు రాశావు. నాటకాలలో వేషాలు వేశావు. నీకు తెలియనిది కాదు. అసలు నటనంటే ఎలా ఉండాలి? ఏ పాత్రలో నీటిని పోసినా, ఆ పాత్ర రూపాన్ని నీరు సంతరించుకున్నట్లుగా, నటుడు ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి...” మార్తాండ మాటలకు నేను మధ్యలో అడ్డు తగులుతూ,”అది సరే... మార్తాండా!” అని చెప్పబోయాను.

"నన్ను పూర్తిగా చెప్పనీ, శాస్త్రీ! మనం చెప్పే డైలాగ్స్‌కు ప్రేక్షకులు ఈలలు వేయాలి గానీ, గోల పెట్టకూడదు. చప్పట్లు కొట్టాలి గానీ, చెప్పులతో కొట్టకూడదు. అవునా? కాదా?" ముందు నెమ్మదిగా మాట్లాడుతూనే స్వరం పెంచాడు.

ఆవేశంగా ఉన్నాడనిపించింది.

'అతని ఆవేశం చల్లార్చాలి' అనుకుంటూ... "అదికాదు గిరీశం! సారీ! మార్తాండా!" అంటూ నటించాను.



"చూసావా! ఒక నటుడి ప్రతిభ మరో నటుడికి మాత్రమే బాగా తెలుస్తుంది. నన్ను గిరీశం అని పిలిచావంటే నాలో నటుడు ఉన్నట్టే... అనుమానం లేదు!" కొద్దిపాటి గర్వంతో మీసం దువ్వుతూ అన్నాడు.

"నాలుగు దశాబ్దాలనాటి సంగతి... అందరికీ తెలిసిన సంగతే! ఇప్పుడెందుకు?" అన్నాను... అతనిలో ఆవేశాన్ని చల్లార్చి, ఆనందాన్ని బలపరుస్తూ.

"సంగతి పాతదే కావచ్చు. కానీ నాలో బాధ మాత్రం ఊటబావిలో నీళ్ళూరినట్లుగా పైకి తన్నుకు వస్తూనే ఉందోయ్. బాధ తగ్గడం లేదు. నేను తగ్గేదే లేదు!" అదే ఆవేశంలో అన్నాడు.

చిన్నగా పొడిదగ్గు దగ్గాడు. అది చూసి నేను అరుగు మీదే మాకొంచెం దూరంగా కూర్చున్న మా అబ్బాయితో, "రవీ! మంచినీళ్లు పట్టుకుని రా" అన్నాను.

వాడు గ్లాసుతో నీళ్లు తెచ్చి, "తీసుకోండి అంకుల్!" అన్నాడు.

రవిని తదేకంగా చూస్తూ, "ఏం చదువుతున్నావ్?" అడిగాడు మార్తాండ.

"డిగ్రీ ఫైనల్ ఇయర్ అంకుల్!" రవి వినయంగా అన్నాడు.

రంగు వెలిసి పోయిన గోల్డ్ ఫ్రేమ్ నల్లకళ్ళద్దాలను సవరించుకుంటూ, "ఏమీ అనుకోకమ్మా!" అంటూ జేబులో ఉన్న చార్మినార్ సిగరెట్ తీసి నోటిలో పెట్టుకున్నాడు. లైటర్‌తో వెలిగించి గాలిలోకి పొగను రింగు, రింగులుగా వదిలాడు.

"హీరో అయిన ప్రతీవాడూ సిగరెట్ ఇలాగే స్టైల్‌గా కాల్చాలి! కానీ స్టైల్‌గా కాల్చే వాళ్ళందరూ హీరోలు కాలేరు!" అంటూ ఒక దమ్ము లాగి మళ్ళీ గాలిలోకి రింగు రింగులుగా పొగను వదిలాడు.

వద్దని చెప్పడానికి నాకు మొహమాటం అడ్డొచ్చింది. మా రవికి ఇబ్బంది అనిపించింది. చిరాకుపడుతూ వాడు ముఖాన్ని అటు వైపు తిప్పాడు.

మార్తాండం వాడి ఇబ్బంది గ్రహించినట్టున్నాడు. పొడి పొడిగా దగ్గుతూ, సగం కాల్చేసిన సిగరెట్‌ను విసిరి పారేశాడు. రవి తెచ్చిచ్చిన గ్లాసు లో నీళ్లు గడ గడా తాగుతూ గుటకలు వేశాడు.

తిరిగి మా రవితో "సిరి అబ్బకపోయినా చీడ అబ్బుతుందంటారు. సినిమాలో నెగ్గుకు రాలేకపోయినా, చెడు అలవాట్లు మాత్రం నేర్చుకున్నాను! నా సంగతి సరే... నువ్వు బాగా చదువుతావా?" మార్తాండ దృష్టి నా మీద నుండి రవి వైపు తిరిగి, వాడితోనే మాట్లాడుతూ అడిగాడు.

"ఫర్వాలేదు అంకుల్. ఫస్ట్‌క్లాస్ మార్కులొస్తాయి!" అన్నాడు రవి.

"భేష్! ఖాళీ సమయాల్లో సినిమాలు గట్రా చూస్తుంటావా?"

"లేదంకుల్! అప్పుడప్పుడూ కథలు రాస్తూ ఉంటాను. అడపా దడపా పత్రికల్లో కూడా వచ్చాయి!"

"శహభాష్! పులి కడుపున పులే పుడుతుంది!" నా వైపు గొప్పగా చూస్తూ అన్నాడు.

"కథలు బాగానే రాస్తాడు!" రవిని సమర్థిస్తూ అన్నాను.

"రవీ! మీ నాన్న వయసులో నా కంటే బాగా చిన్నవాడు. నాటకాలే మమ్మల్ని స్నేహితుల్ని చేశాయి. మీ నాన్న తెలివిగా నాటకాలు వదిలి ఉద్యోగం వైపు వెళ్ళాడు. నేను ఉద్యోగం వదలి నాటకాలు వేసి, రైలెక్కి సినిమాల మోజులో మద్రాసు వెళ్ళాను!"

రవి ఏదో పనున్నట్లు అక్కడ్నుంచి కదలబోయాడు.

"ఆగవోయ్ అందగాడా! పాత సినిమా దేవదాసు హీరో ఎవరూ... తెలుసా?" కనుబొమ్మలెగరేస్తూ అడిగాడు.

"నాగేశ్వరరావు కదా అంకుల్!" రవి జవాబుగా చెప్పాడు.

"ఉష్! అంతే నీకు తెలిసింది. నీకు తెలియంది. ఆ సినిమాకు మొదటగా నన్ను అనుకున్నారు. కానీ కొంతమంది వెధవలు అసూయతో నన్ను తీయించారు... పైకి రాకుండా చేయాలని! పాత సినిమా మల్లీశ్వరి సినిమా హీరో ఎవరు?" మరో ప్రశ్న సంధించాడు.

ఈ సారి రవి, "రామారావు" అని చెప్పాలా, వద్దా... అని మీమాంసలో పడుతూ మార్తాండ వైపు సందిగ్ధంగా చూసాడు.

"అదీ తెలియదా? అవునులే కుర్రాడివి కదా, పాత విషయాలన్నీ తెలిసుండవులే. ఆ సినిమాకు కూడా ముందుగా నన్నే అనుకున్నారు! నేనంటే సరిపడని కుళ్లు వెధవలు కుట్ర పన్ని నన్ను తీయించేశారు! ఇలా ఒక్కటేమిటి... మాయాబజారులో శ్రీకృష్ణుడు, వీరాభిమన్యులో అభిమన్యుడు, నర్తనశాలలో అర్జునుడు, మిస్సమ్మలో నాగేశ్వరరావు పాత్ర, ఇలా ఎన్నో, ఎన్నెన్నో పాత్రలు, నన్ను, నా నటనాప్రతిభను గుర్తించి వెతుక్కుంటూ వచ్చాయి! తెర వెనుక రాజకీయం తెలియనివాడి నవడంతో వెనక్కి పోయాయి. కానీ బంతిని ఎంత వేగంగా కిందకు కొడితే అంతే వేగంగా పైకి లేస్తుందని వాళ్ళకి తెలియదు. చూస్తూ ఉండు. ఎప్పటికైనా హీరో వేషం వేస్తా! నన్ను చూసి వెక్కిరించిన నోళ్లు అవాక్కయ్యేలా చేస్తా! అరచేయి అడ్డు పెట్టి సూర్యోదయాన్ని ఆపలేరు... ఈ మార్తాండుడి ప్రచండ నటనాప్రతిభనూ అడ్డుకోలేరు!" అంటూనే ఉన్నట్లుండి ఒక్కసారిగా లేచాడు.

"శాస్త్రీ! వెళ్ళొస్తానోయ్!" అంటూ వాకిట్లో నున్న హీరో సైకిల్ తీసాడు. అదే ఆవేశంతో ముందుకు కదిలాడు.

మార్తాండుని మాటలతో ఆశ్చర్యపోయిన రవి తిరిగి నా వైపు చూసాడు.

"నాన్నా! ఆయన ఆవేశంగా చెప్పిన మాటలన్నీ నిజాలేనా? అంత గొప్ప నటులే అయితే, కోనసీమలో పుట్టి, పల్లెటూరైన మన మానేపల్లిలోనే ఎందుకు ఉండిపోయారు?" కుతూహలం కొద్దీ అడిగాడు.

"రవీ! మార్తాండే కాదు. ఎంతోమంది రంగుల కలలు కంటారు. సినిమా రంగంలోకి వెడతారు. కానీ అది పెద్ద రంగులరాట్నం అని ఎక్కించుకున్నట్టే ఎక్కించుకుని, కింద కూడా పడేస్తుందని తెలుసుకోరు. తెలుసుకోలేరు! వైకుంఠపాళిలో నిచ్చెనలను చూసి ఆశ పడటంలో తప్పులేదు. కానీ పాములను పసిగట్టకపోవడమే తప్పు!

నిచ్చెనలెక్కి పైకి వెళ్ళేవాళ్ళు కొందరైతే, పాము బారిన పడి పాతాళంలోకి పోయేవాళ్ళు ఎందరో! మార్తాండునికి పట్టిన సినిమా పిచ్చి, కుటుంబ బాధ్యతలను పక్కన పెట్టేలా చేసింది. ఆప్తులను దూరం చేసింది. అప్పులను పెంచింది!"

"మంచిది కాదని, ఏ ఒక్కరూ ఆయనకు చెప్పలేదా నాన్నా?" రవి ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

"మొండివాడు, రాజు కన్నా బలంగా ఉంటాడు! ఆ మొండివాడు మూర్ఖుడైతే... ఆ సమయంలో కళ్ళు నెత్తికెక్కుతాయి. చెవులు మూసుకుపోతాయి. అయినా... అక్కడకూ నేను చెబుతూనే ఉన్నాను. 'మార్తాండం... సినిమారంగంలో నెగ్గుకురావాలంటే అనుకరణ పనిచేయదు. మిమిక్రీ కళాకారునిగా అనుకరణతో కాదు... నీకంటూ ఒక ప్రత్యేకత కనబరుచుకోమన్నాను. మాట వింటేగా? విధానం మార్చుకుంటేగా... మార్తాండం మూర్ఖుడు కూడా! వాడి మూర్ఖత్వానికి వారసత్వంగా వచ్చిన పదెకరాల పొలం హారతి కర్పూరమైంది. పెంకుటిల్లు పూరిపాక అయింది. రాయల్ బుల్లెట్ హీరో సైకిల్‌గా మారిపోయింది. ఇక మిగిలిన ఒక్క ఎకరం అమ్మేస్తుంటే, చెల్లెమ్మ తరుపున బంధువులు, 'పుట్టింటి భరణం' అంటూ అడ్డుకున్నారు. దానిపై వచ్చే శిస్తుతో బతుకు బండి వెడుతోంది!"

"నాన్నా! ఆయన చదువుకోలేదా? ఉద్యోగం ఏమీ చేయలేదా?" రవి వాడి గురించే ఆలోచిస్తున్నట్లుగా అడిగాడు.

"ఇష్టం లేని కాపురం కష్టం అన్నట్లుగా... వచ్చిన గుమాస్తా ఉద్యోగాన్ని, 'ఒకరి కింద పనిచేయడం ఏమిటి? నాకిందే పదిమంది పని చేయాలంటూ గొప్పగా రాజీనామా చేశాడు. సినిమాయే నా చిరునామా అంటూ కుటుంబాన్ని గాలికొదిలేసి, రైలెక్కి మద్రాసు వెళ్ళిపోయాడు. అటు లక్ష్యం చేరుకోలేక, ఇంట్లో వాళ్ళ నిర్లక్ష్యానికి గురైనాడు. మెదడు పాడైంది. మందులు వేసుకున్ననాడు ఇంటి పట్టున బుద్ధిగా ఉంటాడు. లేని నాడు, గతం గుర్తుకు వచ్చి, మనింటికి వచ్చినట్లుగా... గుర్తొచ్చిన స్నేహితుల ఇంటికి వెడతాడు. అప్పుడు రేడియోలా మనం వాడు చెప్పేది వినాలే కానీ, ఇరిటేషన్ రప్పించకూడదు... రప్పిస్తే, మెదడు మరింత దెబ్బ తింటుంది. ఇలాంటప్పుడు, ఇంట్లో చెప్పాపెట్టకుండా సైకిల్ మీద వెళ్ళిపోతాడు. సాయంత్రానికి, పాపం చెల్లెమ్మ వీడి కోసం వీధులన్నీ తిరుగుతుంది. ఇంటికి తీసుకెడుతుంది. వీడిలో మార్పు రాదు. చెల్లెమ్మలో ఓర్పు తగ్గదు. కొన్ని జీవితాలు అంతే. నిస్సారపు ఉషోదయం... నీడకే పరిమితమైన సంధ్యాసమయం!" అంటూ నిట్టూర్చాను.

మర్నాడు కొత్త పాఠ్యపుస్తకాల రూపకల్పనలో శిక్షణ నిమిత్తం విజయవాడ వెళ్లవలసి వచ్చింది. దాదాపు నెల రోజులు అక్కడే ఉన్నాను. తిరిగి ఇంటికి వచ్చాకా అబ్బాయి చెబితే తెలిసింది... మార్తాండం గుండెపోటుతో పదిరోజుల క్రితం చనిపోయారని!

వినగానే ఒకలాంటి బాధ, ఆవేదన! వెంటనే రవితో కలసి మార్తాండ ఇంటికి పరామర్శగా వెళ్ళాను.

పూరిపాక... సరిగ్గా నిలబడితే చూరు తలకు తగులుతుంది.

వాకిట్లో కుర్చీలో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. వయసు నలభై ఉండొచ్చు! నన్ను చూడగానే లేచాడు. వయసులో ఉన్నప్పుడు మార్తాండం ఇలాగే ఉండేవాడనిపించింది!

"బాబూ... నేనూ..."

"తెలుసు అంకుల్! నాన్నగారు తరచూ మీతో మాట్లాడటం నా చిన్నతనంలో గుర్తుంది!" అన్నాడు కూర్చోమని కుర్చీ చూపిస్తూ.

"ఎక్కడుంటున్నావ్? నిన్ను ఈ మధ్యలో చూడలేదు!" అన్నాను.

"నాన్న బతికుండగా రాకూడదనుకున్నాను. పోయాకే వచ్చాను. హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాను!" అన్నాడు.

అతని కళ్ళు బాధగా ఉన్నాయి. దీనంగా చూస్తున్నాడు.

కొంతసేపు మౌనంగా ఉన్నాడు. తర్వాత, "అంకుల్! నాన్న తప్పేం చేశాడు? సినిమాల్లోకి వెళ్లాలనుకోవడం తప్పా?" అన్నాడు.

"కాదు... బాబూ!"

"ఎన్నోసార్లు ఫోన్ చేసేవాడు. కట్ చేసేవాణ్ణి. మెసేజ్ చేస్తే డిలీట్ చేసేవాణ్ణి. 'ముందు, నువ్వు మారు. అప్పుడు నాకు నీతులు చెప్పు' అనే వాణ్ణి. 'తన కంటే తనయుడు ఎత్తులో ఉండాలని ప్రతీ తండ్రి కోరిక' అనేవాడు. 'నా దగ్గర సినిమా డైలాగ్స్ చెప్పకు' అనేవాణ్ణి. నవ్వేవాడు! 'ఛీ నాన్నా... పో నాన్నా' అని తిట్టినా పలికేవాడు. ఇప్పుడు 'రా నాన్నా' అన్నా పిలుపు అందనంత

దూరం వెళ్ళిపోయాడు. ఇప్పుడు రమ్మన్నా నాన్న ఇక రాడు!" ఏడుపుతో గొంతు పూడుకుపోవడంతో ఆగాడు.

మళ్ళీ కొంతసేపటికి, "అంకుల్, మీకు ఈ విషయం తెలుసా?" అన్నాడు.

"ఏమిటి బాబూ?"

"ఆయన మెదడు బానేవుంది. బాలేదని అబద్ధం ఆడితే అందరూ ఆయన చెప్పిన వాటికి 'ఊ' కొడతారని, జాలిగా అయినా వింటారని అలా చెప్పేవారట. అమ్మ చెప్పేవరకూ నాకూ తెలియదు! కొడుకునైన నేనే ఆయన్ని అర్థం చేసుకోనప్పుడు, బయట వాళ్ళు ఎందుకు పట్టించుకుంటారు?" మాట్లాడుతూ ఒక్కసారిగా మా రవి వైపు చూసాడు.

"మీ అబ్బాయా?" అడిగాడు.

"అవును... పేరు రవి!" అన్నాను.

రవి వైపు చూస్తూ,"నాన్న అనే పదమే చాలా గొప్పది. పిలిస్తే పలికే దైవం. నాన్న చెయ్యి వదలకు, అలాగే అంటిపెట్టుకో!" అన్నాడు.

"బాధపడకు బాబూ... ఋణం తీరిపోయింది!" అంటూ లేచాను.

ఇంకా అక్కడే ఉన్న పందిరి గుంజ మీద చేయి వేసి మార్తాండం నవ్వుతున్నట్టుగా అనిపించింది.

"శాస్త్రీ! డాక్టర్ చక్రవర్తిలో నాగేశ్వరరావులా లేనా?" నాకు అడ్డంగా నిలబడి అడుగుతున్నట్లుగా అనిపిస్తోంది.

'ఎవరికీ కనబడని మార్తాండం, నా మనసుకే వినబడినట్లుగా' అనిపించింది.

'వస్తా మార్తాండం!' మనసులోనే ఒకసారి మననం చేసుకుంటూ ముందుకు కదిలాను.

"నాన్నా! బతికున్నప్పుడు అందరూ ఆయన్ని తిట్టారు కదా, ఇప్పుడు కొడుకు కూడా పొగుడుతున్నారే?" రవి ఆశ్చర్యంగా అడిగాడు.

"మనిషి నైజం అంతే రవీ! ఉన్నప్పుడు అర్థం చేసుకోరు. ఆ మనిషి విలువ తెలియదు. పోయినప్పుడు పొగుడుతారు. కానీ, ఆ మనిషికి తెలియదు. అదే లోకం తీరు! మనిషి తాను అనుకున్న రంగంలో పైకి ఎదగాలంటే కృషి బాగా చేయాలి. కానీ మార్తాండంలో కసి ఉంది గానీ కృషి లేదు. అనుకరణ ఉంది గానీ అదృష్టం లేదు. కొన్ని జీవితాలు అంతే! ఏది ఏమైనా... మార్తాండం సినిమా పిచ్చోడు మాత్రమే కాదు, సినిమారంగం వలన పిచ్చోడిగా మారిన వాడు. అభాగ్యుడు! అతని లాగే ఎందరో..." అంటూ రవి భుజం మీద చెయ్యివేసి ఇంటి వైపు నడిచాను.



9492525607

# నాన్న మళ్ళీ పుట్టాడు

పి. రాజేంద్ర ప్రసాద్

*ఈ బ్యాగ్‌లో మీరు మాట్లాడుకున్న అమౌంటుకు పదిలక్షలు ఎక్కువ పెట్టాను.*
*మీ అన్నయ్యలు వచ్చిన తరువాత మాట్లాడుకోండి. మీకు ఇంకా కావాలంటే*
*ఎంత కావాలంటే అంత కాష్ రూపకంగానే ఇస్తాను.*
*దయచేసి ఈ ఇల్లు ఇంకెవరికీ అమ్మే ఆలోచన పెట్టుకోకండి ప్లీజ్!*

పెద్దలిచ్చిన ఆ ఇంటిని అన్నదమ్ములందరం కలిసి ఆరు భాగాలుగా కట్టుకుందామని లేదా, ఎవరైనా బిల్డర్‌కి డెవలప్‌మెంటుకి ఇచ్చినా, వాడు ఆరుగురికీ ఆరు అపార్టుమెంట్లు ఇస్తాడని నేనూ, మా పైవాడు, నాలుగో అన్నయ్యా ఎంత చెప్పినా మా పెద్దన్నయ్య వినలేదు. మొత్తానికి అమ్మకానికే పెట్టించాడు. మా వదిన ఆయనకి రెండవ భార్య. వాళ్ళ వాళ్లు వైజాగ్‌లో ఉంటే ఇక్కడ ఇంకో ఇల్లెందుకని ఆవిడ పోరు. ఇక్కడ ఇల్లు కట్టుకుంటే ఇంకో ఐదేళ్లకి ఆయన రిటైరైపోతే మా అందరితో కలిసి ఉండాల్సి వస్తుందేమోనని ఆమె అనుమానం.

చిన్నన్నయ్యకి ఒక్కగానొక్క కొడుకు... ఇరవై ఎనిమిదేళ్ల వాడు ఐదేళ్ళక్రితం హఠాత్తుగా హార్ట్‌అటాక్‌తో చనిపోయాడు. అప్పటినుండి చిన్నన్నయ్య ఆ ఇల్లు విడిచీ, ఆ ఊరు విడిచీ రావడానికి ఇష్టపడటం లేదు. ఇలా ప్రతీ ఒక్కరికీ ఏవేవో కారణాలు! చివరికి... ఎవరూ చూసుకునేవాళ్ళు లేక ఇల్లు పాడైపోతుందని కొత్త వాదన వచ్చింది. నేను ఉద్యోగంలో చేరిన కొత్తల్లోనే నాన్నగారు చనిపోయారు. ఆ తరువాత పదిహేనేళ్ళకి మా అమ్మ కూడా మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది. అప్పట్నుంచి ఎవరూ మాట్లాడలేదు. ఇదిగో మా అమ్మ చనిపోయిన పదేళ్ళకి మా చిన్నప్పటి తీపి చేదుల గుర్తుగా మిగిలి ఉన్న ఆ ఒక్క ఇల్లూ అమ్మడానికని, ఎక్కడెక్కడో ఆరు ఊళ్ళల్లో విసిరేసినట్టు ఉన్న అన్నదమ్ములందరూ ఉత్తరాలల్లో, ఫోనుల్లో, ఇళ్లల్లో మాట్లాడుకొనీ, కొంచెం కొంచెం పోట్లాడుకునీ ఒక్క వారం పదిహేను రోజుల కోసం ఎలాగైతే వీలు చూసుకునీ, వీలు చేసుకునీ వచ్చాం.

చివరివాళ్ళం మేమిద్దరం పుట్టకముందు మాకు ఊళ్ళో పొలం కూడా ఉండేదట. ఆరుగురు పిల్లల కుటుంబానికి ఖర్చుల వల్ల నాన్నగారికి చివరకు ఈ ఇల్లూ, చేసిన ఉద్యోగం తాలూకు పెన్షనూ తప్ప ఏదీ మిగిలినట్టు నాకు తెలీదు. ఆయన చాలా దానధర్మాలు చేసినా మా ఇంట్లో ఆ విషయం గురించి ఎప్పుడూ ఎవరూ ఎక్కువగా మాట్లాడుకోకపోవడంతో వాటి సంగతి నాకూ, మా తమ్ముడికీ పూర్తిగా తెలియదనే చెప్పాలి. నాన్నగారంటే ఎంతో ప్రేమ ఉన్నా భయమూ భక్తీ ఎక్కువ! మా చిన్నపుడు అమ్మ చీటికీ మాటికీ మా ఇద్దరినీ చితకబాదినా ఎక్కువ జ్ఞాపకాలూ అనుబంధమూ అంతా ఆమెతోనే.

వెయ్యి గజాల విస్తీర్ణంలో ఏడువందల గజాలు ఖాళీగా వదిలేశారు నాన్నగారు. మిగతా మూడు వందల గజాల్లో మాత్రం మధ్యలో మండువా వదిలిపెట్టి, చుట్టూ వర్తులాకారంలో ఎనిమిది గదులు కట్టించారు. ఈశాన్యం ఖాళీ వదిలిపెట్టి అక్కడ బోరు వేయించారు. ఉత్తరంలో చిన్న పూజగది, ఆగ్నేయంలో పదిమంది ఒకేసారిగా భోజనం చేయగలిగినంత పెద్దగా వంటగది. ఇంటికి ముందు ఎత్తైన అరుగులు, వెనకాల విశాలమైన పెరట్లో అరటిచెట్లూ, నారింజ, బొప్పాయి చెట్లూ, మల్లెమొక్కలూ, సన్నజాజి, నైట్ క్వీన్ తీగలూ ఇలా ఎన్నెన్నో!

నా చిన్నతనమంతా ఆ పెరట్లోనూ, అరుగుల మీదా గడిచింది. అరుగుమీద రాత్రి పూట నాన్నగారి పక్కన పడుకుని చెప్పించుకున్న కథలూ, పెరట్లో నారింజకాయలు సగానికి కోసి ఉప్పూ, కారం అద్దుకుని తిన్న జ్ఞాపకాలూ, అల్లరి ఎక్కువైతే అమ్మ వాయింపులూ, ప్రతీ పండక్కీ కొత్తబట్టలూ... ఇలా ఎన్నెన్నో జ్ఞాపకం వచ్చి మనసంతా కకావికలమైపోయింది.

మా ఇంటికే నోరుంటే "నేనింకా చచ్చిపోలేదర్రా! మీ నాన్నల గుండెల్లో చిన్నప్పటి జ్ఞాపకాలుగా మిగిలే ఉన్నాను." అని చెప్పేదేమో. ఇప్పుడు ఆ ఇంట్లో నేను మళ్ళీ తిరుగుతూ ఉంటే మూల మూలా నన్ను పలకరిస్తున్నట్టు అనిపిస్తుంది.

"అన్నయ్యలూ! వద్దురా! అమ్మ తిరిగిన ఇల్లు అమ్మకండ్రా! అమ్మనే అమ్ముకున్నట్టుందిరా నాకు.." మనసులోని బాధ తన ముఖంలో కనిపిస్తుండగా అన్నాడు తమ్ముడు.

"పోనీ! ఆ రేటేదో ఇచ్చేసి నువ్వే తీసుకోరా!" పెద్దన్నయ్య సీరియస్‌గా అన్నాడు.

ఒక్కసారిగా ఉండేలు దెబ్బ తగిలిన పిట్టలా చూశాడు నానీ... మా తమ్ముడు.




"అలాగే అన్నయ్యా! మీరు అమ్మకే వెల కడతారు. ఎలాగూ నేను కొనలేననేగా!" రోషంగా అన్నాడు. చిన్న గుమస్తాగిరీ చేస్తున్న నేనూ, ఏదో పత్రికలో పనిచేస్తున్న వాడూ... ఇద్దరం అంతంత మాత్రంగాళ్లమే అని అందరికీ తెలుసు. మా కంటే కొద్దిగా ఉన్నతస్థాయిలో ఉన్నా ఒక్కళ్ళే మొత్తం ఇల్లు కొనుక్కునే స్థోమత ఎవరికీ లేదనే సంగతి కూడా అందరికీ తెలుసు. అందుకే ఇల్లు అమ్మక తప్పలేదు!

అమ్మ మీద ఉన్న అంతులేని ప్రేమతో తమ్ముడు అలా అంటున్నాడు కానీ, ఇల్లు అమ్మగా వచ్చే తనవంతు వాటా డబ్బుకు సరిపడా వాడికీ, నాకూ అప్పులు పీకల దాకా ఉండనే ఉన్నాయి. చేసేదేమీ లేదు మరి... మంచి బేరం కోసం ఎదురు చూడడం తప్ప!

మేము వచ్చిన నాలుగు రోజులకి వచ్చిన పని అయ్యింది. ఒకాయన ఎవరో మేము అనుకున్న రేటుకి ఇల్లు తీసుకోవడానికి ఒప్పుకొన్నాడు. వారంలోపులో వచ్చి అడ్వాన్స్ ఇచ్చి, అగ్రిమెంట్ పత్రాలు రాయించుకుంటానని చెప్పాడు. అప్పటిదాకా ఉండడమో, వారం తరువాత మళ్లీ వెనక్కి రావడమో చెయ్యాలి. ఎలాగూ లీవు పెట్టాం కదా అని ఉండిపోదామనే నిర్ణయించుకున్నాం అందరం. తిరుగుప్రయాణానికి రిజర్వేషన్ కోసం పెద్దవాళ్లిద్దరూ స్టేషనుకి పరిగెత్తారు. మూడో అన్నయ్యా, నాలుగో అన్నయ్యా "పార్కుకి వెళ్ళొస్తాం." అంటూ వెళ్లిపోయారు. ఇక తమ్ముడూ, నేనే మిగిలాం!

నేడైనా, రేపైనా... ఇక ఇల్లు మాది కాదు అని రూఢిగా తెలిసేటప్పటికి మనసంతా ఏదోలా అయిపోయింది. "కొనుక్కున్న వాడు

ఈ ఇంటిని ఇలాగే ఉంచుతాడా... కాదు కాదు... పడగొట్టి అపార్టుమెంట్లుగా మార్చి కట్టేస్తాడు." ఇలా సాగుతున్నాయి నా ఆలోచనలు. తమ్ముడి వైపు చూశాను. వాడి మనసులో కూడా ఇదే సంఘర్షణ జరుగుతోందేమో, ముఖం మాత్రం గంభీరంగా ఉంది. ఏమిటన్నట్టు చూశాడు తమ్ముడు. ఏం లేదన్నట్టు అడ్డంగా తలూపాను.

ఇంటి ముందు కారాగిన శబ్దం వినిపించింది.

ఎవరో తెలియని వ్యక్తి కారు దిగుతూ కనిపించాడు.

"నమస్కారం ప్రసాదు గారూ, నమస్కారం సత్యం గారూ!" అంటూ నమస్కారం చేస్తూ లోపలికొచ్చాడు ఆ వ్యక్తి.

మా పేర్లు ఎలా తెలుసో అర్థం కాక "మీరూ..." అంటూ ఆగిపోయాను.

"మీరు నాకు తెలుసండీ! నేనే మీకు తెలియదు. నేను ఈ పక్కన వీధిలో ఉంటానండి. నన్ను సాంబిరెడ్డి అంటారు!" చివరి మాట అంటున్నప్పుడు అతని స్వరం ఎందుకో కొద్దిగా వణికినట్టనిపించింది.

వెంటనే గుర్తొచ్చింది. అతను సారా సాంబిరెడ్డి. సారా సావిత్రి కొడుకు. పక్క వీధిలోనే గత ఏభై ఏళ్లుగా సారా వ్యాపారం. చిన్నప్పట్నుంచీ మా నాన్నగారూ, అమ్మా మమ్మల్ని ఆ వీధికి వెళ్లే వైపు తిరిగి కూడా చూడనిచ్చేవాళ్ళు కాదు. వీళ్ళ నాన్న ఎవరో మాకు తెలీదు కానీ, వీళ్ళమ్మే సారా అమ్మేది. ఆ గొడవల్లోనే ఎవడో ఆమెని రోడ్డు మీదే చంపేశాడు. ఇవన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చాయి.

అతన్ని తేరిపార చూశాను. మల్లెపువ్వులాంటి తెల్లని సిల్కుపంచె, జుబ్బా, రెండుచేతులా ఇంతింత ఉంగరాలూ, మెడలో ఇంత లావున గొలుసు పదిహేను, ఇరవై తులాలుంటుంది. అనుకోకుండానే చికాగ్గా ముఖాన్ని ఇంకోవైపుకి తిప్పుకున్నాను. అది అతను గమనిస్తాడని అనుకోలేదు. అవమానపు దెబ్బ తగిలిన బాధ అతని గొంతులో వినపడింది.

"సార్! అలా చూడకండి. మా తాతల నుండీ వస్తున్న వ్యాపారం. నేను ఉన్నట్టుండి వదిలెయ్యలేను కదా! మీ అన్నయ్యలకి నేను బాగా తెలుసు. వారు ఇలా అనుకుంటారనే వారున్నప్పుడు రాలేకపోయాను..." తలవంచుకొని అన్నాడు.

మా తమ్ముడు అందుకుని "సర్లెండి...అవన్నీ ఎందుకులెండి! ఇంటి విషయంగా వచ్చుంటారు...కానీ బేరం అయిపోయింది... లాభం లేదు!" వెళ్లిరమ్మన్నట్టు ధ్వనిస్తూ అన్నాడు.

"తెలుసండీ! ఆ విషయం నాకు తెలిసింది."

"మరింకేంటండీ! ఎందుకొచ్చారు? డైరెక్టుగా చెప్పొచ్చుకదా!" ఎంత డబ్బున్నవాడైనా ఒక సారా వ్యాపారం చేసేవాడు అన్న చులకన భావం నా మొహంలో పలికిస్తూ అసహనంగా అన్నాను నేను.

"మీరేమీ అనుకోకూడదు మరి! ఆ వచ్చినతన్ని నేను కలిశానండి. 'ఈ ఇల్లు మీకు అమ్మరనీ, ఇక ఈ చుట్టుపక్కలకి రానవసరం లేదనీ, ఇంకెవర్నీ రానివ్వద్దనీ' నేనే అతడ్ని బెదిరించి పంపించేశానండి!" నీళ్లు నములుతూ నెమ్మదిగా అన్నాడతను.

"ఆ!! ఎందుకూ?" నిర్ఘాంతపోయిన ఇద్దరం ఒకేసారి అన్నాం. నా గొంతైతే భయంతో వణికింది.

"అంటే... అంటే... ఈ ఇల్లు నేనే కొనుక్కుందామని... అలా చేశానండి!" ఇంకా మెల్లిగా అన్నాడతను.

"ఆ!! ఏమిటీ??" అంతకు మించి ఏం మాట్లాడాలో తోచనంతగా మ్రాన్పడిపోయాం ఇద్దరమూ.

ముందుగా తేరుకున్నది తమ్ముడు. ఎవరితోనైనా గొడవపడాలంటే ముందుంటాడు వాడు!

"ఏవయ్యా పెద్దమనిషీ! ఏంటీ వెధవ రాజకీయాలు! నువు కొనుక్కోవాలంటే డైరెక్టుగా వచ్చి మాట్లాడుకోవాలి గాని, వచ్చిన బేరం చెడగొడతావా? అంటే ఆ బేరం తప్పిస్తే చచ్చినట్టు ఎంతోకంతకి నీ కమ్ముతామనుకొని నీ వెధవ ఆలోచన. అంతేనా?" గుడ్లురుముతూ అన్నాడు. తనకి తెలియకుండానే ఏకవచనంలోకి మారిపోయాడు వాడు.

"అది కాదండి! అలా అనుకోలేదండి..." తడబడ్డాడు ఆ సారావ్యాపారి సాంబిరెడ్డి.

"మరేమనుకున్నావు? ఒకసారి అయిపోయిన బేరం చెడకొడితే, వచ్చేవాళ్ళని బెదిరిస్తే, తక్కువకి కొట్టేయొచ్చని కదూ నీ ఆలోచన. అయితే ఇప్పుడు చెపుతున్నాను విను. నిన్న అతను మాట్లాడుకున్నదెంతకో నీకు తెలుసు కదా! అంతకు పైసా తగ్గేది లేదు. అది కూడా నీలాంటి మోసగాడికి అమ్మం. అసలు అమ్మాలో లేదో మా అన్నదమ్ములందరం కలిసి నిర్ణయానికొస్తాం! ఇక నువ్వు బయలుదేరచ్చు." కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ, ఒళ్ళంతా కోపంతో ఊగిపోతుండగా తర్జనితో వీధిగుమ్మం వైపు చూపిస్తూ క్రోధంతో, ఉక్రోషంతో అరిచాడు తమ్ముడు.

"ఆయ్! అలా కోప్పడకండి సార్" వినయంగా అన్నాడు సాంబిరెడ్డి. ఆ వినయంలో నాకు నయవంచన కనిపించి ఇంకా మండిపోయింది.

"చాల్లేవయ్యా! నీది సారావ్యాపారమైతే, మీరు రౌడీలైతే మేం బెదిరిపోతామనుకున్నావా! మర్యాదగా బయటకు నడు!" ఈ సారి నేను రెచ్చిపోయాను.

మాట మధ్యలోనే నన్నుఅడ్డుకున్నాడు రెడ్డి. "సార్! మీరలా అనుకోవడంలో తప్పులేదు. కానీ నా ఉద్దేశం అది కాదు. చిన్నప్పట్నుంచీ బాగా చదువుకున్న మీరన్నా, పదిమందికీ ఎప్పుడూ ముందుండి సాయం చేసే మీ నాన్నగారన్నా నాకు ఎంతో గౌరవం. అందుకే మీ నాన్నగారి గుర్తుగా ఈ ఇల్లు నేనైనా కొనుక్కుందామని అనుకున్నాను. మార్కెట్ రేటు ఎంతుందో మీకు తెలుసు. మీరు ఆ రేటుకే ఇంతకు ముందు వచ్చినతనికి అమ్మడానికి ఒప్పుకున్నారు. ఈ ఇల్లు ఎవరికో పోనివ్వకూడదని ఆత్రపడుతున్నాను. ఇదిగోండి. ఈ బ్యాగ్‌లో మీరు మాట్లాడుకున్న అమౌంటుకు పదిలక్షలు ఎక్కువ పెట్టాను. మీ అన్నయ్యలు వచ్చిన తరువాత మాట్లాడుకోండి. మీకు ఇంకా కావాలంటే ఎంత కావాలంటే అంత కాష్ రూపకంగానే ఇస్తాను. దయచేసి ఈ ఇల్లు ఇంకెవరికీ అమ్మే ఆలోచన పెట్టుకోకండి ప్లీజ్!" చేతులు జోడించి నమస్కరిస్తూ తన వెంట తెచ్చిన బాగుని, మేము మర్యాదకైనా అతనిని కూర్చోమనకుండా ఖాళీగా ఉన్న కుర్చీలో పెట్టి..."వస్తాను సార్! రేపు ఉదయం వస్తాను. మీరు ఒప్పుకుంటే రిజిస్ట్రేషన్ చేయించుకుంటాను. లేదూ ఆ లోపులో వేరే ఏ విధంగా మాట్లాడాలన్నా నా కార్డు ఇస్తున్నాను." అంటూనే అవాక్కయి చూస్తున్న నా చేతిలో అతని కార్డు పెట్టి చేతులు జోడించి తలవంచుకొని వెళ్ళిపోయాడు ఆ సారా వ్యాపారి సాంబిరెడ్డి.

★★★

పదేళ్ల తర్వాత మళ్లీ మా ఊరికి వెళుతున్న ఆనందంతో ఒళ్ళు పులకరించినట్టవుతోంది. ఆ రోజు సాంబిరెడ్డికి ఇల్లు అమ్మేసి వచ్చేశాక మళ్లీ ఇదే రావడం. ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బులతో పెట్టిన వ్యాపారంలో దేవుడి దయవల్ల బాగా కలిసొచ్చింది. మాకున్న ఒకే ఒక అమ్మాయిని ఎం డీ చేయించాను. అనుకోకుండా మా సొంత ఊరి గవర్నమెంట్ హాస్పిటల్‌లో మొదటి

పోస్టింగ్ వచ్చింది. తనకి క్వార్టర్స్ వచ్చి సెటిల్ అయ్యేదాకా కొన్ని రోజులు దగ్గరుండి తనను చూసుకుందామని నేనూ, మా ఆవిడా ఇద్దరం వచ్చాము.

ఊళ్ళోకి ప్రవేశించింది కారు. ఒక్కసారి మా చిన్ననాటి ఇల్లు చూడాలని కోరిక కలిగి కారుని అటు పోనిచ్చాను.

ఆ రోజు సాంబిరెడ్డి అలా ఆఫర్ ఇచ్చింతర్వాత అందరం కలిసి ఆలోచించుకున్నాం. "గౌరవమా! పాడా! ఈ సాంబిరెడ్డి చూడు... రెండు మూడు నెలల్లో ఇక్కడే పెద్ద బార్ అండ్ రెస్టారెంట్ ఓపెన్ చేస్తాడు!" అన్నాడు మా పెద్దన్నయ్య అప్పుడు.

కారు దిగుతూ పరిశీలనగా చూశాను. ఇల్లు పెద్దగా మారినట్టు ఏమీ లేదు. గోడలకి ప్లాస్టరింగ్ చేసి రంగులు వేసినట్టుంది.

ఇంటిపైన మా అమ్మానాన్నగార్ల పేరుతో 'లక్ష్మీ రాజశేఖర నిలయం' వృద్ధాశ్రమం మరియు ఉచిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' అని బోర్డు చూసి ఆశ్చర్యంతో లోపలికి వెళ్ళాను. లోపలి గోడకు మా అమ్మా, నాన్నగార్ల నిలువెత్తు ఫోటోలు. పక్కనే సాంబిరెడ్డి ఎలా సంపాదించాడో తెలియని, మేమందరం ఉన్న మా ఫామిలీ ఫోటో. క్రింద 'నాకు ఆదర్శప్రాయులు, సరస్వతీపుత్రులు, పరమ సేవాతత్పరుల కుటుంబం' అని వ్రాసి ఉన్న కొటేషన్. కుడివైపు రిసెప్షన్, ఎడమవైపు వరసగా ఉన్న పూర్వపు మా అన్నదమ్ముల గదుల్లో స్పెషలిస్టు డాక్టర్లున్నట్లు వాటి మీది బోర్డులు, ముందు కుర్చీల్లో కూర్చున్న పేషంట్ల వల్ల తెలుస్తోంది. హాలు దాటి లోపలికి వెళ్ళాను. పెరటికి బదులు నాలుగు ఫ్లోర్ల బిల్డింగ్. నోటమాట రాలేదు.

ఇంతలో ఎక్కడినుండి వచ్చాడో సాంబిరెడ్డి మా వెనకనుండి "నమస్కారం సార్!" అన్నాడు. అతను వస్తాడని ఊహించలేదేమో గతుక్కుమన్నాను.

"రెడ్డిగారూ!" అన్నాను ఆశ్చర్యపోతూ...

"మిమ్మల్ని చూసి, ఫోటోలో ఉన్నవారే అని గుర్తుపట్టి మా రిసెప్షన్ అమ్మాయి చెప్పింది. వెంటనే వచ్చాను..." వివరించాడు.

"అవునా! అయితే రెడ్డిగారూ, మీరేదో ఈ ఇల్లు పడగొట్టి అపార్టుమెంటు కడతారనుకుంటే మీరేమిటిలా..." అర్ధోక్తిలోనే ఆపేశాను.

"ఏమీ లేదు సార్! ఎప్పటినుండో ఒక వృద్ధాశ్రమం పెడదామని ఆలోచన ఉండేది. ఇంతలో మీరు మా ఇంటికి దగ్గరలోనే మీ ఇల్లు అమ్మారు. మీ అమ్మగారు, నాన్నగారు తోటివాళ్లకు సహాయం చేసినట్టు నాకు తెలిసి, బాగా డబ్బున్నవాళ్ళు కూడా ఎవరూ చేయలేదు. అందుకనే వారి మీద గౌరవంతో ఆశ్రమానికి వారి పేరు పెట్టాను. పోతే నాకు తెలిసి ఒకే కుటుంబంలో మీలాగా అందరు అన్నదమ్ములూ ఇంత ఉన్నత స్థాయిలో చదువుకోవడం ఎక్కడా చూడలేదు. అందుకే మీ ఫామిలీ ఫోటో సంపాదించి పెట్టుకున్నా!"

ఈ సారావ్యాపారం చేసేవాడికి మేమంటే ఇంత గౌరవాభిమానాలా! ఉక్కిరిబిక్కిరయ్యాను. సాంబిరెడ్డి ఇంకా మాట్లాడుతున్నాడు.

"ఈ వృద్ధాశ్రమంలో వృద్ధులందరికీ ఉచిత భోజన వసతీ, ఉచిత వైద్యం కోసం ఆరుగురు స్పెషలిస్టు డాక్టర్లని పెట్టాను సార్! వెనకాల నాలుగు ఫ్లోర్ల బిల్డింగ్‌లో వృద్ధాశ్రమం, లాబొరేటరీ, ఐసీయూ వగైరా ఉన్నాయి. ముందు పాతబిల్డింగ్‌లో కన్సల్టేషన్ ఉంది. మీ నాన్నగారు వందలాది మంది విద్యార్థులకి ఆర్థికసహాయం చేస్తూ, చదువు చెప్పించి ఊళ్లోని మీ ఇరవై ఎకరాల పొలం కూడా అమ్మేశారని నాకు తెలుసు బాబూ! వారి ముందు నేనెంత? నాకా పిల్లలు లేరు. నా కోట్ల ఆస్తి ఏం చేసుకోను?

అందుకే నాకు తోచిన చిన్నసత్కార్యం చేస్తున్నాను.”

ఆనందాశ్చర్యాలతో నాకు మాట రావటం లేదు. ఈ సారావ్యాపారిని ఏమని అభినందించాలో కూడా తెలియటం లేదు. మా ముగ్గురిలో ముందుగా తేరుకున్నది మా అమ్మాయే!

“డాడీ! తాతగారి గురించి మీరు నాకు చాలా కొద్దిగా చెప్పారు. వీరి ద్వారా ఆయన గొప్పతనం తెలుసుకున్నాను. మనం చేయలేని... ఈయన చేయగలిగిన పనేమిటో మన కళ్ళముందే కనిపిస్తోంది. అందుకే నేనొక నిర్ణయం తీసుకున్నాను!” అంటూ సాంబిరెడ్డివైపు తిరిగి “అంకుల్..నేను యాక్చువల్‌గా గవర్నమెంటు హాస్పిటల్‌లో ఈ రోజు నుండి కార్డియాలజిస్టుగా జాయినవ్వాల్సి ఉంది. మీకభ్యంతరం లేకపోతే మీ వృద్ధాశ్రమంలో మీతో పాటు నేనూ సేవ చేసే అవకాశం ఇస్తారా?” అభ్యర్థిస్తూ అడిగింది.

“అమ్మా! అంతకన్నానా!” ఆనందంగా అన్నాడు సాంబిరెడ్డి.

పట్టరాని సంతోషంతో నేనూ, మా ఆవిడా మా అమ్మాయిని ప్రేమతో దగ్గరికి తీసుకున్నాము. “మా నాన్నగారు మళ్లీ పుట్టారమ్మా!” ఆనందంతో కళ్ళు చెమరుస్తుండగా అన్నాను నేను.

# మిస్సయిన బస్సు

కొయిలాడ రామ్మోహన రావు



📞9849345060

***తప్పు చేసానన్న బాధతో చచ్చిపోతున్నానని ఇంతవరకూ అనుకున్నాను.***
***మీకే కాదు అందరికీ మేలే చేసాను సాబ్. లేకపోతే బస్సు ప్రమాదంలో మీరు ఇరుక్కునేవారు.***
***మీలా కాపాడడానికి ఎవరూ ఉండేవారు కాదు. ఇప్పుడు మీరూ సేఫ్... అందరూ సేఫ్!***

'ఎంత దగా! ఎంత మోసం!!' అనుకుంటూ పళ్ళు నూరుకున్నాడు ధర్మవీర్! పట్టరాని కోపం అతని ముఖంలో ప్రస్ఫుటమౌతుంది. కళ్ళు ఎరుపెక్కాయి. ముఖం కందగడ్డలా మారింది.

"మాస్టారినెప్పుడూ ఇలా చూడలేదు!" అన్నాడు సాకేత్.

"అవును మరి. పరిస్థితి అలా ఉంది!" అన్నాడు అనిల్.

బస్సు దగ్గర, తన పరిచయస్తులతో ఛలోక్తులు విసురుతూ హుషారుగా మాట్లాడుతున్న అగర్వాల్‌ని తీక్షణంగా చూస్తూ ఉండిపోయాడతను. అతనొక్కడే కాదు, అక్కడున్న అరవై మంది స్టూడెంట్లు అగర్వాల్‌నే కసిగా చూస్తున్నారు.

నిన్న ఉదయం ఢిల్లీలో తన ఎన్.సి.సి. స్టూడెంట్‌లతో దిగాడు లెక్చరర్ ధర్మవీర్. నెల రోజుల క్రితమే పక్కా ప్లాన్‌తో కాశ్మీర్ ట్రిప్ ప్లాన్ చేసాడు. రానుపోను ట్రైన్ రిజర్వేషన్లు అయిపోయాయి. ఢిల్లీ నుంచి శ్రీనగర్, జమ్మూ చూసి రావడానికి బస్సు, అక్క ఉండడానికి హోటళ్ళ కోసమూ, ఢిల్లీలోని అగర్వాల్ ట్రావెల్ ఏజెంట్‌తో డీల్ మాట్లాడుకొని, అడ్వాన్స్ కూడా ముందుగానే చెల్లించాడు. ఢిల్లీ చేరగానే అగర్వాల్‌తో ఫోన్లో మాట్లాడటంతో, అగర్వాల్ వెంటనే బస్సు కోసం వేచియుండాల్సిన చోటు, సమయం, బస్సు నంబర్, డ్రైవర్ ఫోన్ నంబర్ మెసేజ్ చేసాడు. దాన్ని చూడగానే అతనికి ప్రయాణం గురించి ఉన్న కాస్తంత చింత మాయమైంది. ఆ రోజంతా ఢిల్లీ చూసి, మర్నాడు బస్సు కోసం అరగంట ముందే నిర్ణీత సమయానికి చేరుకున్నారు, ధర్మవీర్, అతని స్టూడెంట్లు. అప్పటికే ఒక బస్సు పట్టే జనం అక్కడ వేచి ఉన్నారు. వాళ్ళంతా ఉత్తరాది వాళ్ళలా ఉన్నారు. ఆ జనంలో కలిసిపోయిన అగర్వాల్‌ని గుర్తుపట్టాడు ధర్మవీర్. మిగిలిన బేలన్స్ అమౌంట్ తీసుకొని, టూర్ ప్రోగ్రాం అంతా వివరంగా చెప్పడం మొదలుపెట్టాడతను. ధర్మవీర్‌కి హిందీ కొద్దిగా వచ్చుగాని, ధారాళంగా మాట్లాడడం రాదు. అదీగాక అగర్వాల్ స్పీడ్‌గా మాట్లాడడం, దానికి తోడు యాసగా మాట్లాడడంతో, అతను చెప్పేది ధర్మవీర్‌కి పూర్తిగా అర్థం కాలేదు. అగర్వాల్‌కేమో ఇంగ్లీష్ రాదు. అతను చెప్పేదేమిటో అర్థంచేసుకొనే లోపుగా, ఎవరో పిలవడంతో ఆ గుంపులో కలిసిపోయాడు అగర్వాల్. ఆలోచించి చూస్తే, ప్రోగ్రాంలో ఏదో మార్పు ఉందేమో అని అతని మాటలను బట్టి అర్థమైనా, స్పష్టత రాక అయోమయంలో పడిపోయాడు ధర్మవీర్.

ఆ ఉత్తరాది బృందం అగర్వాల్‌కి బాగా పరిచయమైంది కాబోలు, 'దాదాజీ, దాదీ, మౌసీ, చాచా, కాకా, భాభీజీ...' ఇలా వరసలు పెట్టి పిలుస్తూ, చనువుగా మసలుతూ వాళ్ళలో కలిసిపోయాడు. ఇచ్చిన టైం దాటి అరగంట అయినా బస్సు రాకపోయేసరికి, ధర్మవీర్‌లో అసహనం పెరగడం మొదలయింది. అగర్వాల్‌ని పిలిచి వాచీ చూపించాడు. "అరే భాయ్ సాబ్... తోడా ఇంతిజార్ కరో..." అంటూ నవ్వాడు. తల ఊపి బస్సు కోసం ఎదురుచూడసాగాడు ధర్మవీర్. మరో ఇరవై

నిమిషాలకు బస్సు వచ్చింది. బస్సు నంబర్ చెక్ చేసుకొని, “బాగుంది... కొత్త వోల్వోబస్సు... పదండి... పదండి!” అంటూ అడుగులు ముందుకేస్తూ, అక్కడే ఆగిపోయాడు. బస్సు, ఆ బృందం దగ్గర ఆగడం, అగర్వాల్ స్వయంగా వాళ్ళని ఆ బస్సు ఎక్కించడం చూసిన ధర్మవీర్‌కి కోపం వచ్చినా ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుందని, తమాయించుకొని, అగర్వాల్ని అడిగితే, ‘ఇందాకే చెప్పాను కదా? ప్రోగ్రాం మారింది మీకో మరో బస్సు వస్తుందని’ అన్న మాట ఈసారి స్పష్టంగా అర్థమైంది ధర్మవీర్‌కి.



“ఎందుకలా మార్చారు? ఇచ్చిన మాట ప్రకారం ఈ బస్సులోనే మమ్మల్ని పంపండి” అంటూ గొడవ పెట్టాడు. ఆ గొడవకు, ఎక్కే వాళ్ళు సందేహిస్తుంటే, వాళ్ళను ఎక్కమన్నట్టుగా చేయి ఊపి, ధర్మవీర్‌ని కన్విన్స్ చేసే ప్రయత్నంలో పడ్డాడు అగర్వాల్. స్టూడెంట్లకు పరిస్థితి అర్థమైంది. వాళ్ళు రెచ్చిపోబోతుంటే, ఊరుగాని చోట ఏ సమస్యలొస్తాయోనని భయపడి, వాళ్ళను ఆపి, అగర్వాల్‌తో తనొక్కడే గొడవకు దిగాడు.

అగర్వాల్‌కి ఇలాంటివి మామూలే కాబోలు, ఆవేశపడకుండా, ఒక మెట్టు కూడా దిగకుండా, ఒక వైపు మాట్లాడుతూనే, వాళ్ళందర్నీ బస్సు ఎక్కించేసాడు. టకటకా సెల్‌ఫోన్ బటన్లు నొక్కి, “మరో బస్సు రెండు నిమిషాల్లో వచ్చేస్తుంది. డ్రైవర్ నంబర్, బస్ నంబర్ మెస్సేజ్ చేసాను. డోంట్ వర్రీ భయ్యా...” అంటూ అతను బస్సెక్కగానే, బస్ బయల్దేరిపోవడంతో, చేసేదేమీ లేక, కోపంగా చూస్తూ ఉండిపోయాడు ధర్మవీర్!

మరో గంట తర్వాత గానీ రెండో బస్సు రాలేదు. గంట తర్వాత వచ్చిన బస్సు చాలా ఆర్డినరీగా ఉంది. ‘దానిలో సుదీర్ఘ ప్రయాణం చేయగలమా?’ అని అనుమానం పట్టుకుంది. డ్రైవర్ మీద కేకలేసాడు ‘ఇలాంటి చెత్త బస్సు తెస్తావా? అంత డబ్బు గుంజి?’ అంటూ. ఆ డ్రైవర్ ఒక పంజాబీ. పేరు అజయ్ సింగ్. చాలా నెమ్మదస్తుడిలాగ ఉన్నాడు. ఆవేశపడకుండా నిదానంగా సమాధానమిచ్చాడు. అతని హిందీ సరళంగానూ, అర్థమయ్యే రీతిలోనూ ఉంది. “సాబ్ జీ... ఇది నా తప్పు కాదు. అగర్వాల్ సాబ్, అప్పటికప్పుడు ఏ బస్సు ఉంటే అది పట్టుకొని అర్జెంట్‌గా రమ్మంటే, నేనిలా రావాల్సి వచ్చింది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకూడదని చిన్నచిన్న రిపేర్లు చేయించుకొచ్చాను. అందుకే కొంచెం లేట్ అయ్యింది. మాఫ్ కరో సాబ్. మీరేమీ వర్రీ అవకండి, బండి పాతదేగాని మంచి కండిషన్లో ఉంది!” అని అనేసరికి ఇంకేమీ మాట్లాడ లేకపోయాడు ధర్మవీర్! స్టూడెంట్లు అందరూ అగర్వాల్‌కి శాపనార్థాలు పెట్టారు.

“ఉత్తరాదివాళ్ళకు దక్షిణాదివాళ్ళంటే చులకన అని, అదిప్పుడు అగర్వాల్ రుజువు చేసాడని” ధర్మవీర్ ఆవేదనతో అన్నాడు. స్టూడెంట్లు ఆవేశంతో ఊగిపోయారు. అప్పుడుగానీ... అగర్వాల్ వాళ్లకు దొరికితే, ముక్కలు ముక్కలుగా నరికేసేవారేమో!

సింగ్ చెప్పినట్లు బస్సు కండిషన్ బాగానే ఉంది. డీలా పడిపోయిన పిల్లలకు మంచి సరదా విషయాలు చెపుతూ వాళ్ళ మూడ్ మార్చాడు ధర్మవీర్! అతను మంచి మాటకారి, హాస్యంగా మాట్లాడడం, అనేక విషయాలను ఆసక్తికరంగా చెప్పడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. సాయంత్రం నాలుగయ్యే సమయానికి బండి ఘాటు రోడ్డెక్కింది. అందరూ లోతైన లోయలు, పచ్చని కొండలు చూస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటే, సింగ్ ఆయా ప్రదేశాల విశిష్టత వివరిస్తూ, ఫోటోలు తీసుకోవడానికి అనువైన ప్రదేశాలలో బండిని ఆపుతూ, అందరికీ తక్కువ సమయంలోనే ప్రీతిపాత్రుడయ్యాడు.

"ఏడు గంటలు ప్రయాణం చేసినా టైమ్ తెలియలేదు. ఎంత భయపడ్డాం? ఎంత హాయిగా సాగుతుంది మన ప్రయాణం?" అని ఎవరో పక్కవానితో అంటుండగా సడన్ బ్రేక్‌తో కీచుమనే శబ్దంతో బస్సు ఆగేసరికి, మాటల్లో మునిగిపోయిన వారంతా, ఎందుకు బస్సు ఆపాడో తెలుసుకోవాలనుకుండగా, ఎదురుగా నాలుగైదు వాహనాలు ఆగి ఉండడం, ట్రాఫిక్ నిలిచిపోయి ఉండడం గమనించారు.

'ఏదో ఏక్సిడెంట్ అయినట్లుంది' అనుకుంటూ సింగ్ కిందకు దిగేసరికి, దాదాపు అందరూ కిందకు దిగారు. కాస్త ముందుకెళ్ళి చూసి, నోళ్ళు వెళ్ళబెట్టారు. పెద్ద ఏక్సిడెంటే అది. బస్సు లోయలో పడిపోయింది. ప్రయాణికులు సహాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు. లోయ బాగా లోతులో ఉంది. ఎవరూ సాయంచేసే స్థితిలో లేరు. అందరూ నిలబడి చూస్తున్నారే గానీ, ఎలా సాయం చెయ్యాలో ఎవరికీ అర్థం కావడం లేదు. కొందరు ఫోటోలు, వీడియోలు తీస్తుంటే, సింగ్ వాళ్ళ మీద కోపంగా అరిచాడు, "సాయం చెయ్యడానికి చూడండి, వీడియోలు తీసే టైం కాదిది" అంటూ.

ఆ సమయంలో ఒక స్టూడెంట్ ఆవేశంతో అరుస్తూ, "అదిగో అగర్వాల్‌గాడు" అంటూ లోయలో గాయపడి సాయం కోసం ఎదురుచూస్తున్న అగర్వాల్‌ని చూపించి, "బాగా అయ్యింది. వాళ్ల బస్సే అది. మోసం చేస్తే ఏమవుతుంది? మంచి పనే జరిగింది!" అన్నాడు కసిగా. సింగ్‌తో సహా అక్కడున్న ఉత్తరాది వాళ్లకు ఆ కుర్రాడి మాటలు అర్థం కాలేదు. తెలుగు అర్థం కాకపోయినా, అగర్వాల్ మీద వాళ్ళకున్న కసిని గుర్తించాడు సింగ్. ప్రమాదంలో ఇరుక్కున్న వారిమీద అతనికెంతో జాలి కలిగింది. తలుచుకుంటే ధర్మవీర్, అతని స్టూడెంట్లు మాత్రమే రక్షించగలరనే నమ్మకం కలిగిందతనికి. అయితే వాళ్ళు ఒప్పుకోరని అతనికి ఖచ్చితంగా తెలుసు. అయినా తన ప్రయత్నం మానలేదు.

"సాబ్ జీ... మనమే వాళ్ళను కాపాడాలి" అంటూ ధర్మను బతిమాలాడు. అలా అడుగుతాడని ధర్మ ఊహించలేదు. విస్మయంగా సింగ్ వైపు చూస్తుంటే, వద్దు వద్దంటూ స్టూడెంట్లు కేకలు వేసారు. అయినా సింగ్ వదల్లేదు. బతిమాలుతూనే ఉన్నాడు. కేవలం తన ఉత్తరాది వాళ్ళనే కాపాడుకోవాలని అతను ప్రయత్నించడం లేదని, అతని అభ్యర్థనలో మానవత్వం ఉందని గ్రహించాడు. కానీ స్టూడెంట్లు ఎట్టి పరిస్థితిలోనూ దానికి సహకరించరని అతనికి తెలుసు. వాళ్ళను ఒప్పించడం కష్టమే గాని, అసాధ్యం కాదని తెలిసినా, ధర్మ సాయం చేయడానికి ముందుకు రాలేదు.

"మీరేమీ వర్రీ అవకండి సింగ్ జీ, పోలీసులకు ఫోన్ చేసారట, కాస్సేపటిలో రెస్క్యూ టీం వస్తుంది. అంతా వాళ్ళే చూసుకుంటారు!" అంటూ ధైర్యం చెప్పాడు.

"లాభం లేదు సర్. రెస్క్యూ టీం వచ్చేసరికి మరో రెండు గంటలు పైనే పడుతుంది. చూసారుగా? పరిస్థితి. కాస్సేపటిలో చీకటి పడేటట్లుంది. చీకటి పడితే, వాళ్ళను కాపాడటం చాలా కష్టం. అక్కడుండే పాములో, విష పురుగులో లేదా అడవి జంతువులో వాళ్ళను పొట్టన పెట్టుకుంటాయి. ఆ లోయ ఎంత ప్రమాదమైనదో నాకు తెలుసు. ప్లీజ్ ఏదో ఒకటి చెయ్యండి. టైం లేదు. మీరు, మీ ఎన్.సి.సి. స్టూడెంట్లే ఆ పని చెయ్యగలరు. ఇలాంటివెన్నో మీరు గతంలో చేసే ఉంటారు. దయచేసి

నా కోరిక మన్నించండి!" అంటూ బతిమాలుతుంటే కాదనలేక, స్టూడెంట్లను అతికష్టం మీద ఒప్పించాడు గానీ ఎలా సహాయం చెయ్యాలో అతనికి అర్థం కాలేదు. వాళ్ళందరినీ రక్షించాలంటే, చాలా పెద్ద సాహసమే చెయ్యాలి. ఇందులో రిస్క్ లేకపోలేదు. స్టూడెంట్స్‌కి ఏమైనా అయితే, తనే పెద్ద బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాలలో, ముందుగా కాలేజ్ ప్రిన్సిపాల్ లేదా యాజమాన్యం అనుమతి తీసుకోవాలి. కానీ అదిప్పుడు జరిగేపని కాదు. అంత టైం లేదు. అంతేకాక, వాళ్ళు అనుమతి ఇవ్వరు. 'నీకెందుకొచ్చిన తలనొప్పి?' అంటూ వెనక్కి లాగుతారు.'ఇలా ఆలోచించుకుంటూ కూర్చుంటే, ఇంతే సంగతులు. ప్రయాణీకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఏది ఏమైతేనేం? ఏదో ఒకటి చెయ్యాలి. వాళ్ళ ప్రాణాలు కాపాడాలి' అనుకున్నాడు ధర్మ.

ఎలాగైనా వాళ్ళను కాపాడాలనే నిర్ణయమైతే తీసుకున్నాడు గానీ, అంత లోతులో ఉన్న ప్రయాణికులను బయటకు తేవడానికి, అవసరమైన తాళ్ళు, పనిముట్లు లేకపోవడం వల్ల, అతను అశక్తుడయ్యాడు. అలా కొట్టుమిట్టాడుతున్న సమయంలో, అక్కడికి వచ్చి ఆగిన లారీని చూడగానే అతని కళ్ళు మెరిసాయి. అది గోధుమల బస్తాల లోడ్‌ను వేసుకొచ్చిన భారీలారీ. బస్తాలకు కట్టిన తాడు విప్పి ఇస్తే, ప్రయాణికులను రక్షించవచ్చునని ఆ లారీ డ్రైవర్‌ని కోరాడు. దానికతను సుతరామూ ఒప్పుకోలేదు. బస్తాలు పడిపోతాయని, తిరిగి యథాతథంగా లోడ్ పేక్ చెయ్యడం కష్టమని, చీకట్లో అది అసాధ్యమని, తన ఉద్యోగం పోతుందని తేల్చి చెప్పేసాడు ఆ లారీ డ్రైవర్. తనకు ఏ నష్టమూ కలిగించమని, వాళ్ళ ప్రాణాలు కాపాడడం అందరి బాధ్యత అని, చిన్నపిల్లలున్నారు, జాలిచూపమని ధర్మ, సింగ్ విడవకుండా బతిమాలేసరికి ఆ డ్రైవర్ ఒప్పుకోవలసి వచ్చింది. వెంటనే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన బృందాన్ని రంగంలో దింపాడు ధర్మ. సహాయ కార్యక్రమాలు మొదలయ్యాయి. లోయలోకి దిగిన స్టూడెంట్లు అక్కడి పరిస్థితి ప్రత్యక్షంగా చూసి విచలితులయ్యారు. ముందు మూర్ఖంగా నిరాకరించినందుకు సిగ్గుపడ్డారు. అందరికన్నా ఎక్కువగా గాయపడింది అగర్వాలే. అతనికి సాయం చేసే అవకాశమివ్వకుండా ఇతర ప్రయాణికులు ఎగబడుతుంటే, 'వీళ్లనేనా? వరసలు పెట్టి పిలుస్తూ, వాళ్ళతో కలసిపోయి, మాకు అన్యాయం చేసాడు' అనుకున్నారు స్టూడెంట్లు. ప్రయాణీకులే అవకాశం ఇవ్వలేదో, స్టూడెంట్‌లే కావాలని వదిలేసారో ధర్మకు తెలియలేదు. పైకి తెచ్చిన వాళ్ళలో అగర్వాల్ లేడు. ఆ విషయమే అడిగితే, తమకు తెలియదని కొందరు అబద్ధమాడితే, ఇప్పటికే బాగా చీకటిపడింది. ఇప్పుడు అతన్ని తీసుకురావాలని ప్రయత్నించడం చాలా ప్రమాదమని కొందరు చేతులెత్తేసారు. వాళ్ళు కావాలనే నాటకమాడుతున్నారని తెలిసిపోయింది అతనికి. వాళ్ళను బతిమాలదలుచుకోలేదు. వాళ్ళు వద్దని వారిస్తున్నా, తనే ముందడుగు వేసి, టార్చ్‌లైట్ పట్టుకొని, తాడు అందుకున్నాడు కోపంగా. అతని కోపం చూసి స్టూడెంట్లు వెనకడుగు వేసారు భయంతో.

"నేనూ వస్తాను సాబ్" అంటూ అతని వద్ద టార్చ్ అందుకున్నాడు సింగ్. నిజానికి ఆ చీకటిలో లోయలోకి దిగడం నిజంగా సాహసమే. ఆఖర్లో లోయనుంచి పైకి వచ్చిన విద్యార్థులు, పాములు, తేళ్ళు రావడం చూసామని, ఇప్పుడు లోయలోకి దిగడం చాలా ప్రమాదమని చెప్పినా, ధర్మ వినలేదు.

ఇద్దరూ కిందకు దిగేసరికి, అగర్వాల్ దయనీయమైన పరిస్థితిలో ఉన్నాడు. వాళ్ళిద్దరినీ చూసి నీరసంగా నవ్వాడు.

"నన్నిలా వదిలేస్తారని అనుకున్నాను... మీరొస్తారని ఊహించలేదు..." అంటూ... హఠాత్తుగా పెద్ద కేక పెట్టాడు. ఆ అరుపుకి అదిరిపడ్డారు ఇద్దరూ.

"మైగాడ్ కింగ్ కోబ్రా!!" అని అరిచాడు సింగ్, అప్పటికే అగర్వాల్‌ని కాటేసి జారుకుంటున్న కాలనాగుపై టార్చ్ ఫోకస్ చేస్తూ!

ధర్మకు ఏడుపొచ్చింది. కింగ్‌కోబ్రా కాటేస్తే ప్రాణాలు దక్కవని అతనికి తెలుసు. హుటాహుటిన అగర్వాల్ దగ్గరకు చేరారిద్దరూ.

“త్వరగా సాయం పట్టండి. ఇతన్ని బతికించుకుందాం. ముందు అర్జంట్‌గా ఇతనికి ఫస్ట్ ఎయిడ్ చెయ్యాలి!” అంటుంటే, పేలవంగా నవ్వాడు అగర్వాల్.

“సాబ్, నేను బతకను. మీరేమీ బాధపడకండి. నేను చేసిన తప్పుకి భగవంతుడిలా శిక్ష వేస్తాడనుకోలేదు...” అంటుంటే అడ్డు తగిలాడు “అరెరె... మీరు అంత పెద్ద తప్పేమీ చెయ్యలేదే? వ్యాపారంలో ఇది సహజమే. భయపడకండి. మీకేమీ కాదు!” అంటూ ధైర్యం చెపుతుండగా, సడన్‌గా అగర్వాల్ ముఖంలో వెలుగు వచ్చింది. ఇద్దరూ ఆశ్చర్యంగా అగర్వాల్ వైపు చూసారు.

“తప్పు చేసానన్న బాధతో చచ్చిపోతున్నానని ఇంతవరకూ అనుకున్నాను. మీకే కాదు అందరికీ మేలే చేసాను సాబ్. లేకపోతే బస్సు ప్రమాదంలో మీరు ఇరుక్కునేవారు. మీలా కాపాడడానికి ఎవరూ ఉండేవారు కాదు. ఇప్పుడు మీరూ సేఫ్... అందరూ సేఫ్!” అంటూ ప్రాణాలు వదిలాడు అగర్వాల్. అతన్నే చూస్తూ కన్నీరు కార్చారిద్దరూ!!

# వడ్లగింజలో బియ్యపుగింజ

సి.హెచ్.వి.యస్.యస్. పుల్లంరాజు



8639868875

***నిద్రపోతున్న మంజుల కొడుకుని భుజం మీద వేసుకుని నిలబడ్డ శాంతమ్మ, విక్టర్ కేసి చూస్తూ, కాండ్రించి ఉమ్మింది. బీడీ దమ్ములాగి, కసిగా విక్టర్ మీద వదిలాడు మస్తాన్. చాటుగా నిలబడి అన్నీ గమనిస్తున్నాడు సుబ్బారావు.***

"అమ్మో... అమ్మో! ఎంత పని జరిగింది! లేచిన వేళా విశేషం బాగుండి, పిల్లాడు దక్కాడు కానీ ..." మంజుల పెడబొబ్బలకి అమ్మలక్కలు కొందరు పోగయ్యారు.

"ఏమి జరిగిందో చెప్పవే తల్లీ! ఆ తరువాత తీరికగా కూర్చుని ఏడ్వచ్చు ..." అంటూ బుజ్జగించ సాగారు వాళ్ళు.

రెండు మూడు సార్లు ముక్కు ఎగబీల్చి, కొడుకుని బరబరా ఇంట్లోంచి బయటకు లాక్కొచ్చి, "తండ్రిలేని పిల్లవాడంటే ఎంత లోకువ! ఎవడో దిక్కుమాలిన ఎదవ ఎంత పనిచేశాడో చూడు! ఉత్తి పుణ్యానికి కడుపులో గుద్ది, గోడకేసి కొట్టాడట నా బంగారాన్ని ... కాస్త క్రిందికి తగిలుంటే కన్నుగుడ్డు పగిలి ..." అంటూ మళ్ళీ భోరుమంది.

"తరగతి గదిలో పిల్లలు కొట్లాడుకొంటుంటే, ఉపాధ్యాయులేమి చేస్తున్నారట ... నిద్రపోతున్నారా? ఆ పసివాడికి తగిలిన దెబ్బకి ఎవరు బాధ్యత వహిస్తారు? కన్నకొడుకుని ఆ స్థితిలో చూసి తల్లడిల్లిపోతున్న ఆ తల్లిని ఎవరు ఊరడించగలరు?" పాయింట్ లాగుతూ, తలవెంట్రుకలని దగ్గరగా లాగి, కొప్పు చుట్టుకొంటూ ఆ తల్లి, కొడుకుల మీద వెర్రిప్రేమ వెళ్లగక్కింది రాజ్యం పిన్ని.

ఆవిడ అభిమానానికి మంజుల ముఖం వికసించింది.

"టీచర్లు, చదువులు ఎలాగు చెప్పి ఛావరు, జీతాలు పెంచమని సమ్మెలు, ధర్నాలు చేస్తారే తప్ప, పిల్లలకి క్రమశిక్షణ కూడా నేర్పరు! మా రోజుల్లో పిల్లలు ఇలా వెర్రివేషాలేస్తే, డొక్కచించి ..." అంటూ నేటి విద్యావ్యవస్థని తూర్పార పట్టసాగింది కళ్ళజోడు సవరించుకొంటూ కాంతమ్మ పిన్ని.

ఇంతలో పోలీసు జీపులోంచి ఇన్స్పెక్టర్ రాబర్ట్ విక్టర్ ఆ ఇంటికి కొంచెం దూరంలో దిగి, క్రీగంట వాళ్లని గమనిస్తూ, తన ఇంటివైపు అడుగులు వేస్తుంటే, "అయ్యో! ఇక్కడ ఇంత గోరం జరిగి, మన మంజుల గగ్గోలు పెడతావుంటే, ఏందని కూడా సూడకుండా, అలా జారిపోతావేటి ఇకటరు బాబూ! ఏదో మా ఊరూడివి కదా, నాయం చేస్తావని ..." అంటూ శాంతమ్మ పిన్ని పిలిచింది దూరంగా వెళ్లిపోతున్న ఇన్స్పెక్టర్ విక్టర్ని.


ఆడవాళ్ల అభ్యర్థనని కాదనలేని బలహీనత... పాపం ఆ పోలీసు ఇన్స్పెక్టర్‌ది!

అందుకే వాళ్ళ దగ్గరకి వచ్చి , "మనసు బాగుండక ఏదో ఆలోచనలో ఉన్నాను పిన్నీ... నువ్వు పిలిస్తే రానా? విషయం ఏమిటో చెప్పు!" అన్నాడు అందరిని కలయచూస్తూ, ఠీవిగా నిలబడి.

అప్పటిదాకా, ఎదురు అరుగు మీద కూర్చుని, జరుగుతున్న భాగోతం తిలకిస్తూ, తాపీగా బీడీ తాగుతున్న మస్తాన్‌రావు, పోలీసు ఇన్స్పెక్టర్‌తో మాట కలపాలని, ఉత్సాహంగా వచ్చి, "మంజుల కొడుకుని ..." అంటూ విషయం చెప్పబోయాడు.

కానీ, విక్టర్‌కి ఆడవాసన తప్పా, మగ వాసన పెద్దగా గిట్టదని మస్తాన్‌రావుకు తెలియదు.

అంతేకాక, పిల్లాడిని ఒడిలో చేర్చుకుని, గడపనానుకొని విక్టర్ వంక చూస్తున్న గుమ్మడిపూవు లాంటి మంజుల కొంగుచాటు అందచందాలని ఆస్వాదిస్తున్న విక్టర్‌కి సర్రున కోపం పడగ విప్పింది.



వాడి చెంప ఛెళ్ళుమనిపించే వాడే ... కానీ కొంచెం నిగ్రహించుకొంటూ, "మంజుల నీకేమవుతుందిరా? ఇక్కడ నీకేమిటి పని?" అన్నాడు కరకుగా, గొంతు తగ్గించి. 'పానకంలో పుడకలా నువ్వు ఎవడురా?' అని ధ్వనించేలా.

ఆ ప్రశ్నకు, ఆ ప్రశ్న సంధించిన తీరుకు మస్తాన్‌రావు ముఖం, ఆరిపోయిన బీడీలా మసిబారింది.

'మరి మంజుల నీకేమౌవుతుందిరా?' అని విక్టర్‌ని అడిగే, దమ్ము లేక, అక్కడ నుంచి జారుకొన్నాడు.

"మంజులా! సమస్య ఏమిటో సరిగ్గా చెప్పు. భయపడకు!" అన్నాడు విక్టర్ సౌమ్యంగా.

అతని భరోసాకి, ఆమెలో, బాధ ఎగిరిపోయి, మనసున పొంగిన సంతోషం, కనులకి ఎగపాకింది.

కృతజ్ఞతతో చూసిన ఆమె చూపుల్లో, అతడు తడిసి ముద్దయ్యాడు.

"ఇందులో అంత చెప్పడానికేముంది! పాఠశాలలో పిల్లాడెవరో, దాని పిల్లాడ్ని గోడకేసి కొట్టాడట... ఆ గాయం చూసి, దాని తల్లి మనసు తరుక్కుపోయింది పాపం! తండ్రి వదిలేసిపోయినా, పిల్లాడ్ని సాకుతూ, కాలక్షేపం చేస్తోంది!" అంటూ సానుభూతి ఒలకబోస్తూ, వివరించింది సీతమ్మ పిన్ని. కానీ, విక్టర్‌కి కావలసింది సమాచారం కాదు. మంజుల... ఆమెతో పరిచయం!

అందుకే గంభీరంగా ముఖం పెట్టి, నడుము మీద చేతులేసుకుని, "స్కూలుకు కానిస్టేబుల్‌ని పంపి, సంగతేమిటో తేలుస్తా!" అని హుంకరించాడు.

"అందుకనేగ బాబూ... నిన్ను రమ్మంది!" అంది శాంతమ్మ ముసిముసి నవ్వులతో, తన పాచిక పారినందుకు.

"మంజులా! నువ్వు స్కూలుకి రాగలవా పిల్లాడ్ని తీసుకుని?" అడిగాడు కాస్త సందేహంగా! ఆ ప్రశ్నకి బెరుకుగా అతనికేసి చూసింది.

ఏమి చెప్పాలో తెలియలేదామెకు!

"పాపం పిల్లాడ్ని తీసుకుని ఒక్కర్తి ఎలా వస్తుంది ఇక్టర్ బాబూ! ఏదో మనూరోడివి కదాని ..." అంటున్న శాంతమ్మ మాటలు పూర్తికాకుండానే..,

"అవన్నీ నే చూసుకొంటాలే! భోజనం చేసి మళ్ళీ వస్తా!" అంటూ చకచకా నడిచాడతడు, మంజుల అందాల్ని మనసులో నెమరువేసుకొంటూ!

★★★

పోలీసు జీపు దర్జాగా పాఠశాల ముందు ఆగింది. లేత నీలిరంగు ఫాంట్ మీద, తెల్లచొక్కా వేసి, జీపులోంచి, కథానాయకుడి స్థాయిలో దిగాడు విక్టర్. అప్పటికే అతని రాక కోసం ఎదురు చూస్తున్న కానిస్టేబుల్ సుబ్బారావు, విక్టర్‌కి సెల్యూట్ చేసి, ప్రధానోపాధ్యాయుడి గదిలోకి తీసుకెళ్లి కూర్చోబెట్టాడు.

కానిస్టేబుల్ సుబ్బారావు ద్వారా విషయం తెలుసుకున్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మంజుల పిల్లాడు చదువుతున్న తరగతిలోని, ఎక్కువగా అల్లరిచేసే పిల్లల తల్లిదండ్రులను పిలిపించాడు. వాళ్లంతా పాఠశాల ఆవరణలో చెట్టుక్రింద నిలబడ్డారు.

ఇంతలో కొడుకుతో మంజుల, ఆటోలోంచి క్రిందకు దిగగానే, సుబ్బారావు ఆమెను లోపలికి తీసుకెళ్ళి, విక్టర్ ప్రక్కనే కుర్చీలో కూర్చోపెట్టాడు.

మంజుల కొడుకుని, తన దగ్గరకు రమ్మనమని సైగ చేస్తూ, "నీ పేరేమిటిరా?" అని అడిగాడు ప్రధానోపాధ్యాయుడు.

"పవన్ సార్" అన్నాడు వాడు, కొంచెం బెరుకుగా.

"ఏ తరగతి?"

"నాలుగో తరగతి సార్"

"పొద్దున్న మీ తరగతి గదిలో ఏమి జరిగిందిరా?" అడిగాడాయన.

అప్పటిదాకా బయట వేచిచూస్తున్న తల్లిదండ్రులు, వాళ్ల పిల్లలని తీసుకొని, ఆ గదిలోకి వచ్చి నిలబడి, తతంగమంతా వీక్షిస్తున్నారు.

పిల్లగాలికి ఊగుతున్న మంజుల ముంగురులు ... విక్టర్ చెంపల్ని తాకుతూ అల్లరి చేస్తున్నాయి. వాలుజడతో, తేనెరంగు చీరలో హుందాగా వుందామె! అంత దగ్గరగా మంజులని చూస్తూ, ఏదో పారవశ్యంలో వున్నాడు విక్టర్.

"శంకర్, వినోద్ ఇద్దరు కొట్టుకొంటున్నారు సార్. నేను బెంచీ మీద బ్యాగ్ పెట్టుకొంటుంటే, నా బ్యాగ్‌ని సుభాష్‌గాడు క్రిందకి పడేసాడు, 'ఎందుకు పడేసావురా?' అని అడిగితే, శంకర్‌తో చెప్పి, తన్నిస్తానని చెప్పాడు సార్!" అన్నాడు.

ఎదురుగా నిలబడ్డ శంకర్ని పిలిచి, "మీరిద్దరూ ఎందుకు కొట్టుకున్నారురా?" అడిగాడు ప్రధానోపాధ్యాయుడు శంకర్ని.

ముక్కులో పొక్కులు తీసుకొంటూ, "మేమేమీ కొట్టుకోలేదండి" అన్నాడు వాడు.

వాడి నిర్లక్ష్య ధోరణికి, కోపం వచ్చి, "నిజం చెప్పరా? ఎందుకు తన్నుకొన్నారు?" అని గద్దించాడు విక్టర్.

వెంటనే, అతన్ని వారిస్తూ, "దయచేసి మీరు ఆగండి సార్."అని, "వినోద్ ఇలారారా! శంకర్, నువ్వు ఎందుకు తన్నుకున్నారు... చెప్పు?" గద్దించాడు ప్రధానోపాధ్యాయుడు.

అందరూ నిశ్శబ్దంగా చూస్తున్నారు, వాడేమి చెబుతాడాని.

బుర్ర గోక్కుంటూ, "అంటే మరి ... ఆడి జేబులో చాక్లెట్ నాది కదాండి... మరి నాకు పెట్టాలి కదాండి." అన్నాడు. వాడి మాటలకి కొందరు కిసుక్కున నవ్వారు.

"ఆ చాక్లెట్ నీది కాదుగా ..." గొణిగాడు శంకర్.

"మధ్యలో ఈ గోల ఏమిటిరా! చాక్లెట్ ఎలా వచ్చింది? ఎవరిచ్చారు?" అడిగాడు ప్రధాన ఉపాధ్యాయుడు.

"శారద ఇచ్చిందండి." అన్నారు ముక్తంఠంతో అక్కడున్న పిల్లలందరూ.

"శారదా ... ఎందుకిచ్చింది?" కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు వెంటనే.

జరుగుతున్నదంతా ఆసక్తికరంగా వుంది మంజులకి.

అసహనంగా వుంది విక్టర్‌కి.

"శారద తల్లిదండ్రులు వచ్చారా?" అడిగాడు ఆ గుంపులో ఒకడు.

స్పందన లేకపోవడంతో, "వచ్చినట్లు లేరు" అన్నాడు కానిస్టేబుల్ సుబ్బారావు.

"పుట్టినరోజని చాక్లెట్లు ఇచ్చింది!" అన్నాడు పవన్.

"నా చాక్లెట్ కూడా, శంకర్‌గాడు లాక్కొని జేబులో పెట్టుకొన్నాడు." అన్నాడు వినోద్.

"ఏరా, నువ్వు తీసుకొన్నావా శారద దగ్గర?" అడిగాడు ప్రధాన ఉపాధ్యాయుడు.

శంకర్‌గాడు బెల్లంకొట్టిన రాయిలా బిగిసిపోయాడు.

"ఇంతకీ అసలు విషయం వదిలేసి, ఆ గోల ఎందుకు మాష్టారు. మంజుల కొడుకుని ఎవరు కొట్టారు?' విసుగ్గా అడిగాడు విక్టర్.

అదే ప్రశ్నని అడగాలని తహతహ లాడుతున్న మంజుల, విక్టర్‌ని, మెచ్చుకోలుగా చూసింది.

"పవన్‌గాడు మొన్న కిషన్‌గాడ్ని కొట్టాడని, కిషోర్‌గాడు ..." ఇంకా ఏదో చెప్పబోతున్న వాసుగాడు, అప్పుడే లోపలికివస్తున్న వాళ్ళని చూసి, ఠక్కున ఆగిపోయాడు.

చేతికి కట్టుతో వున్న కిషన్‌ని ఎత్తుకుని వాడి తల్లి అక్కడ ప్రత్యక్షమయ్యి, "సూడండి మాట్టారు! ఈ పవన్‌గాడు, మా కిషన్‌గాడ్ని కొట్టాడుట. చేయి వాసింది. ఆసుపత్రికెళ్ళితే రెండొందలు పిండి, కట్టేశారు!" అని క్షణం ఆగింది.

అనుకోని ఆ ఆరోపణకి మంజుల ఖంగుతింది.

"నేను దాని ఇంటిమీదకి కయ్యానికి పోతే, పాపం మంజుల ఏమి సేస్తది? పిల్లలు అంటేనే... కొట్టుకొంటారు ... కలిసిపోతారు. వడ్లగింజలో బియ్యపుగింజ..." అంటూ గొణుక్కొంటూ కొడుకుని ఎత్తుకొని, 'ఈ గిల్లికజ్జాలకి ఇంత పంచాయతీ అవసరమా?' అన్నట్లు చూస్తూ వెళ్లిపోయింది.

మంజుల ఆలోచనలో పడింది.

అంతవరకు బిర్రుగా నడుస్తున్న విచారణ పట్టు సడలింది.

ముందుగా ...విక్టర్ లేచి నిలబడ్డాడు ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా! వాచీకేసి చూసుకొని, "సాయంత్రం ఇంటికి వస్తా... ఏమి జరిగిందో చెప్పు!" అని మంజులకే వినిపించేలా రహస్యంగా చెప్పి, "అర్జెంటుగా వెళ్ళాలి. మాష్టారూ." అని నడిచాడు.

నెమ్మదిగా ఒకొక్కరే బయటకు నడవసాగారు!

ఆటోలో కూర్చున్న మంజుల, "నిజం చెప్పరా నాన్నా! నిన్ను ఎవరు కొట్టారు? చెప్పమ్మా!" అప్పటిదాకా అడగని ప్రశ్నని, లాలనగా అడిగింది కొడుకుని.

"కిషన్‌గాడు నన్ను కొట్టాడు. వాడ్ని నేనూ కొట్టానమ్మా!" అన్నాడు భయం భయంగా.

"అదేంటిరా, నిన్ను ఎన్నిసార్లు అడిగాను? మరి చెప్పలేదేం?" కాస్త కోపంగా అడిగింది.

ఇంతలో, ఆటో ఆమె ఇంటి గుమ్మం ముందు ఆగింది. .

"మరిచిపోయానమ్మా!" అన్నాడు తల్లి కేసి బేలగా చూస్తూ.

ఆ జవాబుకి అవాక్కయ్యి చూస్తుంటే, వాడు అమాంతం ఆటోలోంచి క్రిందకు దూకి, శాంతమ్మ ఇంటి వైపు దౌడు తీసాడు.

★★★

“పిల్లల గొడవలో పోలీసులు దూరడమేమిటి సార్? అది వడ్లగింజలో బియ్యపుగింజ వ్యవహారం. ఇంక వదిలెయ్యండి!” అన్నాడు కానిస్టేబుల్ సుబ్బారావు.

పోలీస్ స్టేషన్లో, తన సీటులో కూర్చొని ఆలోచిస్తున్నాడు విక్టర్.

“భలే వాడివి సుబ్బారావు! నీ మాట, ఎప్పుడైనా కాదన్నానా? స్కూలు లోనే వదిలేసానుగా! కానీ...” అని అర్థోక్తిగా ఆగాడు విక్టర్.

“కానీ ఏమిటి సార్ ... వదిలెయ్యండి!” రెట్టించాడు సుబ్బారావు.

“పిల్లల సంగతి వదిలేయగలను, కానీ ... వదల లేకపోతున్నది ...” ఆగాడు విక్టర్.

“అంత వదల్లేనిది ...?” అంటూ సందేహంగా చూశాడు సుబ్బారావు.

“మంజుల. తస్సాదియ్యా ...దాని ఒంపుసొంపులు ఎంత సెగరేపుతున్నాయో తెలుసా? కావాలంటే నువ్వే చూడు, ఒళ్ళు ఎలా కాలిపోతోందో ... మనసు ఎలా మరిగిపోతుందో ... ఆ వయ్యారి వడ్లగింజ ...” అని ఆగి, కాలిబూట్లతో నేల మీద వింత శబ్దాలు చేస్తూ, సిగరెట్లు వెలిగించి, దమ్ము లాగాడు విక్టర్.

“చెప్పండి, ఆ వడ్ల గింజ ...” ఆత్రంగా అడిగాడు సుబ్బారావు మనసులో ఏదో కీడు శంకిస్తూ.

“ఒలిచిన వడ్లగింజలా, మెరిసిపోతూ మురిపిస్తుంటే, దాన్ని ...” విక్టర్ చెబుతూనే వున్నాడు.

సుబ్బారావు, అసహాయంగా అసహనంగా బయటకు నడిచాడు!

విక్టర్ జీపు దిగాడు.

మస్తిష్కం నిండా మంజుల ఆలోచనలే. ఆ ఆలోచనలకి అనుగుణంగానే అతని అడుగులు పడుతున్నాయి.

వెలుతురుని మ్రింగిన చీకటి, తన రాజ్యాన్ని ఆశగా, ఆబగా చేతులు చాచి విస్తరించాలని తపిస్తోంది!

అప్పుడే, మంజుల స్నానంచేసి, గదిలో అద్దం ముందు నిలబడి, ఒళ్ళు తుడుచుకుంటోంది! గడప అవతల, చీకటిలో నిలబడిన విక్టర్... పరుచుకున్న పలుచని దీపపు వెలుతురులో ఆమె అందచందాలను ఒళ్ళంతా కళ్లుచేసుకొని పరిశీలిస్తున్నాడు,

అతని కాలు గడప దాటింది.

చెదరిపోయిన తెల్లచీరని మరిచి, ఎదురుగా నిలబడిన విక్టర్‌కేసి తల ఎత్తి సిగ్గుతో చూసింది మంజుల.

వలువలు విడిచిన వడ్లగింజ, బియ్యపుగింజగా మారి, దిగంబర శ్వేతశిల్పంలా, కనువిందు చేస్తోంది.

అతనిలో కామం జూలు విప్పింది.

పోలీస్ యూనిఫాం జారిపోయింది.

వెంటనే కరెంటు పోయింది.

ఆడ మగ శరీరాలు రెండూ మంచం మీదకు ఉరికాయి.

ఎంతో ప్రియమైన, పరిచయమైన ఆ బాడీ పెర్ఫ్యూమ్, అతన్ని కోరికల వరదలో ముంచెత్తింది. ఆమెను పూర్తిగా ఆక్రమించాడు. వాంఛల తీవ్ర గాఢతతో, ఆమె తనువులోని అణువణువుని శోధించి, అలసిపోయాడతడు.

అంతలో కరెంట్ రావడంతో, కంటి మీద పడిన వెలుతురుకి, అసహనంగా కళ్లు తెరిచాడు విక్టర్.

తను చూస్తున్నది కలా... నిజమా! అనే అనుమానం వచ్చింది.

తెల్లచీర కుచ్చిళ్లు సవరించుకుంటూ, విక్టర్ వైపు చూస్తోంది, మిసెస్ రూత్ విక్టర్.

దూరంగా తలుపునానుకొని నిలబడి, కృతజ్ఞతా భావంతో, సజల నయనాలతో, రూత్‌కేసి చూస్తోంది మంజుల.

జరిగిన విషయాన్ని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు ఆ పోలీస్ బుర్రకి.

తడవుగా అతను యూనిఫాం తగిలించుకుంటుంటే, ఆ నారీమణి రూత్ నెమ్మదిగా దగ్గింది.

ఆ సంజ్ఞకి, గదికి బయట నుంచి పెట్టిన గొళ్ళెం ఊడింది.

ఊహించని పరాభవానికి విక్టర్ ముఖం వాడి పోయింది!

తల మీద టోపీ పెట్టుకోవడానికి చేయి రాలేదు. అదృశ్యశక్తి ఏదో, నెత్తి మీద బలంగా లాఠీతో బాదుతున్న బాధ.

కష్టంగా అతని కాలు.. ఆ గది గడప దాటింది.

గది బయట నిలబడిన, రాజ్యం, కాంతం, నరసమ్మ, మేరీ, లిల్లీ, షాహియిదాతో బాటు మరికొందరు స్త్రీలు విక్టర్ కేసి చూస్తున్నారు.

వారి చూపుల్లో ఎన్నో భావాలు, శాపాలు ...

మౌనమే వారి భాష!

అందుకే, కన్నెత్తి చూడటానికే భయమేసింది విక్టర్‌కి!

నిద్రపోతున్న మంజుల కొడుకుని భుజం మీద వేసుకుని నిలబడ్డ శాంతమ్మ, విక్టర్‌కేసి చూస్తూ, కాండ్రించి ఉమ్మింది.

బీడీ దమ్ములాగి, కసిగా విక్టర్‌మీద వదిలాడు మస్తాన్.

చాటుగా నిలబడి అన్నీ గమనిస్తున్నాడు సుబ్బారావు.

తన అభ్యర్థన మేరకు భర్త విక్టర్‌కి బుద్ధి చెప్పడానికి ధైర్యంగా ముందుకొచ్చిన మిసెస్ రూత్‌కి, తన వ్యూహం ఫలించడానికి సహకరించిన వారందరికీ మనస్సులో ధన్యవాదాలు చెప్పాడు కానిస్టేబుల్ సుబ్బారావు.



📞9164543253

మద్దూరి నరసింహమూర్తి

***అబ్బాయైతే ఓ లాగు బనీను లేదా చొక్కా తొడిగేసి, తలమీద వెంట్రుకలు,
ఓ రెండు దువ్వులు దువ్వేసి, వాడి ముఖాన ఇంత పౌడర్ కొట్టేస్తే,
వాడి ముస్తాబైపోతుంది. ఊరిమీద పడి తిరుగుతుంటాడు.
ఆకలేస్తే తప్పించి ఇంటి మొహం చూడడు. అదే అమ్మాయైతే...***

తలుపు తట్టిన రామారావుకి, కళ్ళనీళ్లతో గాదరించుకున్న మొహంతో ఎదురుగా నిలబడ్డ భార్యని చూసేసరికి, మనసు బరువెక్కిపోయింది. భార్యని అనునయంగా దగ్గరకి తీసుకొని ఆమె కళ్లనీళ్లు తుడుస్తూ "ఏం కమలా, ఈరోజు మళ్ళా ఎవరింటికైనా వెళ్ళావా లేక ఎవరేనా మనింటికి వచ్చారా?" అని ఆర్ద్రంగా అడిగేసరికి, కమలకి దుఃఖం మరీ ముంచుకొచ్చింది.

"ఎప్పుడూ ఉండేదే, వచ్చిన వాళ్ళు వచ్చినట్టు ఉండకుండా, నా మనసుని గాయపరచందే వెళ్లడం లేదు!" అని వెక్కిళ్ళతో సమాధానం ఇచ్చింది.

ఆ పరిస్థితిలో అంతకంటే ఇంకేమీ అడగడం ఉచితం కాదని నిశ్చయించుకున్న రామారావు "ముందు మొహం కడుక్కో. నేను స్నానం చేసి వస్తాను. తరువాత మనం మాట్లాడుకుందాం" అని వెళ్లబోతుంటే... "నా ఏడుపు ఎప్పుడూ ఉండేదే! ఇప్పుడే వచ్చారు, ముందు కాఫీ తెస్తాను. తాగి స్నానం చేద్దురుగాని!" అని కళ్ళు తుడుచుకుంటూ కమల వంటగదిలోకి వెళ్ళింది.

స్నానం చేసి వచ్చి పక్కన కూర్చున్న రామారావుతో, "ఇంటికి ఎవరొచ్చినా... నేనెక్కడికి వెళ్లినా... 'ఏమ్మా ఒక మంచి డాక్టర్ దగ్గరకి వెళ్లి చూపించుకోకూడదూ. ఏమేనా లోపం ఉందేమో' అని సలహా ఇచ్చేవాళ్లే! ఆ మాటలు విని విని ఏడుపొస్తూంది. ఆ లేడీ డాక్టర్ ఇచ్చిన మందులు పూర్తిగా ఒక ఏడాది తిన్నాకూడా, నాకు ఎందుకు కడుపు రావడం లేదో తెలియడంలేదు. నాలో ఏదో లోపం ఉండే ఉంటుంది. నాకు మరి పిల్లలు పుట్టరు కాబోలు!" అని, ఏడుపు తన్నుకొస్తుంటే, రామారావు ఒడిలో తలపెట్టి కన్నీరు కారుస్తూ ఉండిపోయింది.


తన ఒడిలో పడి, అలా ఏడుస్తున్న భార్యని చూసి, రామారావుకి ఎలా ఓదార్చాలో తోచలేదు. పోనీ ఆవిడకి అసలు సంగతి చెప్పేద్దామంటే, ఎలా తీసుకుంటుందో?

"ఊరుకో. కొందరికి ఇతరులని ఏడిపించడం సరదా! అయినా మనకి ఇప్పుడేమంత వయసైపోయిందని. నువ్వు మందులన్నీ తిన్న తరువాత మరొకసారి డాక్టర్ దగ్గరకి వెళదామంటే 'రాను రాను' అంటూ నీ మొండి పట్టుదలతో మనం వెళ్ళేలేదు. పోనీ రేపు వెళదామా!"

దిగ్గున లేచిన కమల, "ఆ లేడీ డాక్టర్ దగ్గరికి నేను రాను. నాకావిడ నచ్చలేదు. గాంధీనగర్‌లో ఎవరో క్రొత్త డాక్టర్ దంపతులు వచ్చారట. పిల్లలు పుట్టనివారికి చక్కగా పరీక్షలు చేసి మంచి మందులు ఇస్తున్నారట. ఆయన మగవారికి, ఆవిడ ఆడవారికి చూసినా, అవసరమైనప్పుడు ఇద్దరూ సంప్రదించుకొని, తగిన వైద్యం చేస్తారట. వారి వైద్యంతో చాలామందికి పిల్లలు పుట్టారట. కాబట్టి అక్కడికే వెళ్ళాలి మనం!" అని కమల పట్టుదలగా చెప్పింది.

"సరే. రేపు వెళ్దాం. ఇంతకీ ఆ లేడీ డాక్టర్ నీకు ఎందుకు నచ్చలేదో చెప్పలేదు!"

"ఆ లేడీడాక్టర్ ఏదేనా నాకు చెప్పకుండా 'మీ ఆయనతో మాట్లాడాలి' అంటూ నాతో మాత్రం ముక్తసరిగా 'మీ ఆయనతో అన్నీ మాట్లాడేను, మీరు విశ్రాంతి తీసుకోండి' అంటుంది. అందుకే నాకు ఆవిడ నచ్చలేదు. అయినా మిమ్మల్ని చూస్తే... ఎవరికైనా, అందునా ఆడవాళ్ళకి అలా చూస్తూ ఉండాలనిపిస్తుంది!" అంది కమల కాస్త నిష్ఠూరం, అసూయ కలగలిపి.



"ఆ మహాతల్లి ఇచ్చిన మందులు తినక ముందు, ఒకసారి నేను గర్భవతినయ్యాను. కానీ ఆ మందులు తిని ఇప్పటికి రెండేళ్లు దాటినా అసలు ఆ ఆశే కనబడడంలేదు. ఆవిడ అసలు డాక్టరీ సరిగ్గా చదివిందా లేక కాపీ కొట్టి పాసైన బాపతా!" అంటూ మనసులో ఉన్న అక్కసు అంతా వెళ్లగక్కింది.

"నువ్వు కూడా అసూయకి ఆమడదూరంలో లేవని నిరూపించుకున్నావు." అని నవ్వి, "క్రొత్త డాక్టర్‌తో రేపు మాట్లాడడానికి వెళ్ళినప్పుడు, నీతోనే అన్నీ మాట్లాడమని ముందుగా ఆమెకి చెప్తాను సరేనా!" అని రామారావు అనగానే... వాతావరణం కాస్తా ఉల్లాసంగా మారింది.

అలా అప్పటికి సర్దుకున్న కమల రాత్రి కోసం వంట చేయడానికి వంటింట్లోనికి వెళితే, సోఫాలో కూర్చొని టీవీ చూస్తున్న రామారావు మనసులో తాజాగా ఉన్న పాత సంఘటనలే కదలాడుతున్నాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రామారావు ముప్పైఏళ్ల వయసులో ఇరవైఎనిమిది ఏళ్ల కమలని పెళ్లి చేసుకున్నాడు. పెళ్ళైన రెండేళ్ళకి కమల గర్భం దాల్చింది. కానీ, నాలుగో నెల కూడా వెళ్లకుండానే గర్భస్రావం అయిపోయింది.

కమలని పరీక్షించిన లేడీ డాక్టర్ "గర్భాశయం ఉండవలసినంత పరిమాణంలో లేకపోవడం వలన ఆమె మళ్ళా గర్భం దాల్చితే పెద్ద ప్రాణానికే ముప్పు!" అని రామారావుకి మాత్రమే చెప్పింది.

ఈ చేదు నిజాన్ని రామారావు కమలకి చెప్పకుండా దాచి ఉంచేడు.

డాక్టర్ కమలతో "మీరు చాలా నీరసంగా ఉన్నారు. ఒక ఏడాదికి సరిపోయిన మందులు వ్రాస్తున్నాను. రెండేళ్లు గడిచిన వరకు గర్భం దాల్చకుండా జాగ్రత్త పడండి. రెండేళ్ల తరువాత వచ్చి చూపించుకుంటే పరీక్షించి అప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలేవైనా ఉంటే చెప్తాను!" అని మరీ మరీ నొక్కి చెప్పింది.

గర్భస్రావం అయినందువలన కలిగిన శారీరక నీరసంతో బాటూ, మానసికంగా బాధపడుతున్న కమలని ఓదార్చడం రామారావుకి చాలా కష్టం అయింది. ఆ రోజులలో రామారావు ఇంట్లోనే ఆఫీస్ పనులు చేసుకుంటూ, కమలని ఎంతో అపురూపంగా ప్రేమగా చూసుకుంటూ ఆమెని ఒంటరిగా ఉండనివ్వలేదు. అందుకే కమలకి భర్త అంటే పిచ్చిప్రేమ. అంతే కాదు, తనవల్ల ఆయన తండ్రి అవలేకపోతున్నాడే అని దిగులు కూడా!

దేనికైనా కాలమే సమాధానం కనుక, భార్యాభర్తలిద్దరూ ఆ చేదు జ్ఞాపకంనుంచి మెల్లిగా బయటపడ్డారు! రెండేళ్లు గడచిన తరువాత, కమల మెల్లిమెల్లిగా రామారావు దగ్గరకి చేరి, ఇన్నాళ్లు ఆపుకున్న తమకం రామారావుకి తెలిసేలా ప్రయత్నం చేయసాగింది. అన్నీ తెలిసిన రామారావు, ఏ రోజుకి ఆ రోజే ఏదో కారణం చెప్పి, కమలకి దూరంగా ఉండేవాడు. ఆ ప్రయత్నాలన్నీ దినదిన గండాలుగానే గడవసాగేయి.

ఎంత జాగ్రత్తగా ఉండాలనుకుంటున్నా, తానేమీ ప్రవరాఖ్యుడు కాదు కదా! పైగా, వరూధినిలా ప్రక్కనే ఉండే కమల అందం వెర్రెక్కిస్తుంటే మనసుని, అంతకంటే శరీరాన్ని నియంత్రించుకోవడం చాలా కష్టం అవుతుండడంతో, ఓ పదిరోజుల అవస్థ తరువాత, అన్ని విధాలుగా ఆలోచించి, రామారావు ఒక రోజు ఉదయం ఆఫీస్‌కి వెళ్లినవాడు, అక్కడ నుంచి అలాగే ఆసుపత్రికి వెళ్లి వేసక్టమీ చేయించుకొని, అక్కడే సాయంత్రం వరకూ విశ్రాంతి తీసుకొని, ఇంటికి వచ్చాడు. తను వేసక్టమీ చేయించుకున్న సంగతి... 'ఎప్పుడు అవసరమైతే అప్పుడు చెప్పవచ్చులే' అని కమలకి చెప్పకుండా తనలోనే దాచుకున్నాడు.

కొన్నిరోజుల తరువాత, రామారావు తనంతట తానే పక్కమీద కమలని దగ్గరకి తీసుకోవడం ఆరంభించేసరికి, ఆవిడ ఆనందానికి హద్దులేకుండాపోయింది. వారి సంసారనౌక మరో ఏడాది అలా హాయిగా సాగింది.

కమల 'తను ఇంకా గర్భవతి అవడం లేదేమిటా' అని మనసులో ఒక మూల ఆలోచిస్తూనే ఉంది. దానికి తోడు, ఇరుగుపొరుగు వారి మాటలతో 'తనలో ఏదేనా లోపం ఉందేమో' అని చిన్న అనుమానం మెల్లిమెల్లిగా ఏర్పడసాగింది. ఆ విషయం గ్రహించలేనంత అమాయకుడేమీ కాదు రామారావు. కానీ, భార్యకి ఆవిడలో ఉన్న లోపం చెప్పి ఆమె మనసు గాయపరచడం ఇష్టం లేక, అన్ని సంగతులు తెలిసినా, పైకి మాత్రం మామూలుగానే ఉంటూ వస్తున్నాడు.

పాత ఆలోచనల వలయంలోంచి బయటపడి, తాను వాసెక్టమీ చేయించుకున్న సంగతి కమలకి చెప్పవలసిన సమయం వచ్చిందని అనుకున్నా, 'అసలు సమస్యకి సమాధానం ఎలా సమకూర్చుకోవాలా' అని ఆలోచిస్తున్నాడు రామారావు.

పక్కన పడుకున్న భర్తతో కమల, "ఇప్పుడు మనం ఆ క్రొత్త డాక్టర్ దగ్గరకి వెళ్ళినప్పుడు, ఆవిడ చలవ వలన అంతా బాగుంటే

సరి. నా దురదృష్టానికి, నాలో లోపం ఉంది, నాకు పిల్లలు పుట్టడం కుదరదు, అంటే…"

"ఊ. అంటే"

"అంటే…" రామారావు గుండెల మీద కమల ప్రేమగా వేళ్ళతో రాస్తూ ఉండిపోయింది.

"అంటే_ _ _' అని నానుస్తావేంటి. నాకెలా చెప్పాలనా? నేను కూడా పరీక్ష చేయించుకుంటాను. సరేనా!" అని రామారావు అనగానే, భర్త నోటిని తన చేత్తో మూసి, కమల "మీరెందుకు పరీక్ష చేయించుకోవడం!" అంది.

"మరి ఇప్పుడు నీ ఆలోచన?"

"నాలో లోపం ఉంది అని తేలితే, మీరు మరో పెళ్లి చేసుకోవాలి. నా మాట కాదనకూడదు!"

రామారావు ఫక్కున నవ్వి, "సినిమా అనుకున్నావా ఏమిటి? వెర్రిఆలోచన నువ్వూనూ. నీకసలు అలా అనాలని ఎందుకనిపించింది?"

"మీకు నవ్వులాటగా ఉందా, నేను చాలా సీరియస్‌గా చెప్తుంటే. నావల్ల మీకు పిల్లలు పుట్టకపోతే, మీరెందుకు మరోలా తండ్రి అవకూడదు?"

"సరే. నీమాట నేనెందుకు కాదనాలి. నువ్వు చెప్పినట్టు నేను మరో పెళ్లి చేసుకుంటాను. సరేనా!" అని రామారావు అనేసరికి…

'నీ మీద నాకు ఇంత ప్రేమ, అంత ప్రేమ' అంటాడు. వెంటనే ఒప్పుకోడు. తను పదే పదే చెప్పి ఒప్పించాలి అనుకున్న కమల మనసు కొంచెం గాయపడింది.

ఇద్దరి మధ్య కొన్ని సెకన్లు నిశ్శబ్దం చోటు చేసుకుంది!

"అంతేనా, ఇంకా ఏమేనా మాట్లాడాలా నాతో…"

"అంతేనండీ!" అన్న మాట, దుఃఖం బయటపడనీకుండా, కమల గొంతులోంచి మెల్లగా భారంగా వచ్చింది.

"నువ్వు చెప్పిన దానికి నేను సరే అన్నాను కాబట్టి నేను చెప్పింది నువ్వు వినాలి!"

"ఏమిటండీ అది!" అన్న మాటలు కమల గొంతులోంచి మెల్లిగా వచ్చాయి.

"నేను కూడా పరీక్ష చేయించుకుంటాను. మన ఇద్దరినీ పరీక్ష చేసిన తరువాత నీలో ఏమీ లోపం లేదు. లోపం నాలోనే ఉంది అంటే, అప్పుడేమి చేద్దామో చెప్పు!"

"ఛా. మీలో ఏమీ లోపం ఉండదండి!"

"ఒకవేళ ఉంటేనో?"

"గొడ్రాలిగా బ్రతకమని ఆ భగవంతుడు నా నుదుటన వ్రాసేడు కాబోలు, నా ఖర్మ ఇంతే అనుకుంటాను!"

"అలా ఎందుకు అనుకోవాలి. నువ్వు మరో పెళ్లి చేసుకొని తల్లి అవుదువుగాని!"

"ఛ, అవేమి మాటలు? నేను మరో పెళ్లి చేసుకోవడమేమిటి!"

"ఏం... నేను చేసుకోవచ్చు అని నువ్వే అంటున్నావుగా. అలాగే, నువ్వు కూడా చేసుకోవచ్చు అని నేను గట్టిగా చెప్తున్నాను!"

"మీతో నేను వాదించి గెలవలేను బాబూ. నేను మరో పెళ్లి చేసుకోకూడదు, మీరు చేసుకోవచ్చు. అది మన సామాజిక న్యాయం!"

"అదేమిటి, నీకొక న్యాయం, నాకొక న్యాయమా?"

"అదంతే. మీలో ఏమీ లోపం ఉండదు. నాలో లోపం ఏమేనా ఉంటె, మీరు మరో పెళ్లి చేసుకుంటున్నారంతే!" "నీకే నామీద ప్రేమ ఉంటుంది, నాకు నీమీద ప్రేమ ఉండదని ఎలా అనుకున్నావు. మరో పెళ్లి ఆలోచన రానే కూడదు. మనకి పిల్లలు ఉన్నా లేకున్నా నీకు నేను నాకు నువ్వు, అంతే!"

రామారావు అలా మాట్లాడేసరికి, అతన్ని 'తనెంత తప్పుగా అర్థం చేసుకున్నానా' అనే సిగ్గుతో "నేను తప్పుగా మాట్లాడేను. నన్ను క్షమించండి." అని తన చేతులు పట్టుకున్న భార్యని దగ్గరగా తీసుకొని...

"మనలో మనకి క్షమాపణలేమిటి? అసలు ఇలాంటి సమస్య ఏదో నువ్వు తెస్తావనే, నేను ముందునించే జాగ్రత్తపడ్డాను. ఎవరూ ఇప్పుడు డాక్టర్ దగ్గరకి వెళ్లి పరీక్ష చేయించుకోనక్కరలేదు. నేను నీ దగ్గర దాచిన ఒక నిజం నీకు చెప్పే సమయం ఇప్పుడు వచ్చింది. జాగ్రత్తగా విను! నీకు గర్భస్రావం అయినప్పుడు, డాక్టర్ నీకు చెప్పలేదు. కానీ, నాతో చెప్పింది – 'నీ గర్భాశయం చిన్నదిగా ఉండడం వలన నువ్వు మళ్ళా గర్భవతైతే నీ ప్రాణానికే ప్రమాదం' అని. అది తెలిసిన నేను, నిన్ను కాపాడుకోవడానికి మరో మార్గం కనిపించక, ఎప్పుడో వేసక్టమీ చేయించుకున్నాను!"

భర్త మాటలు వింటూనే, కమలకి భర్త మీద ప్రేమ ఒక్కసారిగా వెల్లువలా తన్నుకొచ్చి అతన్ని గాఢంగా కౌగలించుకుని, కళ్ళంట నీళ్ళు పెట్టుకుంది.

వారం రోజుల తరువాత, కమల "మనం జీవితమంతా ఒకరినొకరు చూసుకుంటూ ఉండవలసిందేనా, మన సమస్యకి సమాధానం లేదా?" అంది.

నిజానికి... ఆ ప్రశ్న కోసం ఎదురు చూశాడు రామారావు.

"నువ్వు సరే అంటే ఓ పిల్లని దత్తత తెచ్చుకుందాం!" అన్నాడు.

"అంతే అంటారా?"

"లేదంటే, ఇప్పుడొస్తున్న నూతన ప్రక్రియల ద్వారా ఇంకేదైనా సదుపాయం ఉందేమో డాక్టర్ని కనుక్కుందాం!"

"ఛా, అలాంటి మాటలు వింటేనే ఒళ్ళంతా కంపరమొచ్చినట్టుంది. అంతకంటే, దత్తతే మేలు. మా బంధువుల్లో ఎవరేనా ఒక పిల్లాడిని మనకి దత్తత ఇస్తారేమో కనుక్కుంటాను"

"మీ బంధువులొద్దు, మా బంధువులొద్దు, అసలు తెలిసినవాళ్లెవరి దగ్గర వద్దు!"

"అలాగైతే దత్తతకు పిల్లలెక్కడ దొరుకుతారండి!"

"అనాథాశ్రమాలని సంప్రదిస్తే, ఎక్కడో ఒకచోట తప్పకుండా దొరుకుతారు!"

"అనాథాశ్రమమా!" కమలకి ఆశ్చర్యం వేసింది.

"ఆశ్చర్యం ఎందుకు, అవే సరైన అవకాశాలు. పైగా అక్కడున్న పిల్లల తల్లిదండ్రులు ఎవరో ఎవరికీ తెలీదు కాబట్టి, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రావు!"

"అదీ నిజమే. మనం దత్తత తీసుకునే పిల్లాడి తల్లిదండ్రులు ఎవరో తెలియకపోవడం అన్నివిధాలా మంచిది. ఎంత వయసున్న పిల్లాడిని తెచ్చుకుందామో చెప్పండి, అన్ని విషయాలు ముందుగానే ఆలోచించే మీరు ఈ విషయం కూడా ఆలోచించే ఉంటారు!"

"ఆరు నెలలు నిండని పిల్లని తెచ్చుకుందాం!"

"మరీ అంత చిన్న పిల్లాడినా!"

"అవును. అప్పుడే ఆ పిల్ల మనకి సులభంగా చేరిక అవుతుంది!"

"సరే. కానీ, నేను అబ్బాయి అంటున్నాను. మీరు అమ్మాయి అంటున్నారు. ఇంతకీ మనం దత్తత తీసుకునేది అమ్మాయినా, అబ్బాయినా? "

"మనం దత్తత తెచ్చుకోవలసింది అమ్మాయినే కానీ, అబ్బాయిని కాదు"

"ఎవరేనా అబ్బాయి పుట్టాలనుకుంటారు. మనం దత్తత తీసుకుంటున్నప్పుడు, కోరి అబ్బాయిని తెచ్చుకోక అమ్మాయినెందుకు? కొడుకైతే తల్లిదండ్రుల్ని పున్నామనరకం నుంచి తప్పిస్తాడు అంటారు కదా!"

"మానాన్న నా తమ్ముడి గురించి, మీ నాన్న నీ తమ్ముడి గురించి 'వీళ్ళని ఎందుకు కన్నామురా బాబూ, బ్రతికుండగానే నరకం చూపిస్తున్నారు' అని మన దగ్గర ఎన్నిసార్లు వాపోలేదు!"

"అబ్బాయైతే మన మలివయసులో తోడునీడగా ఉంటాడు కదా!"

"అబ్బాయైతే మనకి తోడుగా ఉంటాడని నమ్మకం ఏమిటి? మన అదృష్టం బాగులేకపోతే, మా నాన్న మీ నాన్నలాగా భవిష్యత్తులో మనం కూడా విచారించవలసిరావొచ్చు. అల్లుడు పంచపుత్రులలో ఒకరంటారు! మన అదృష్టం బాగుంటే. అల్లుడే మనకి అన్నివిధాలా అండగా ఉండొచ్చు. అమ్మాయి, అల్లుడు ఇద్దరు ఒప్పుకొని అల్లుడు ఇల్లరికం వస్తే ఇంకా అదృష్టం!"

"అబ్బాయైతే బాగుంటుంది అని నేను అనుకుంటుంటే, మీరేదో చెప్పి నా మాట కొట్టిపారేస్తున్నారు!"

"నువ్వలా అలగక, అమ్మాయినే తెచ్చుకుందామని ఎందుకంటున్నానో విను... ఒక అనాథ అమ్మాయి జీవితం బాగుపడడానికి మనం దోహదపడుతున్నామంటే ఎంత మంచి విషయమో ఆలోచించు! అమ్మాయిని కన్యాదానం చేస్తే, 'నా వైపు పది వంశాలు, నీ పుట్టింటి వైపు పది వంశాలు, మనతో కలిసి ఇరవైఒక్క వంశాలు ఉద్ధరింపడతారు' అని శాస్త్రాలలో చెప్పబడింది! జనక మహారాజుకి ఆతని తమ్మునికి సంతానం కూతుళ్లే కదా. పోనీ వాళ్ళు పురాణపౌరులు అనుకుంటే, మన తొలి ప్రధానమంత్రి నెహ్రూగారికి సంతానం ఇందిరాగాంధీ ఒక్కతే కదా! అంతవరకు ఎందుకు... నువ్వు ఇష్టపడి చూసే 'మిస్సమ్మ' సినిమాలో

రంగారావుకి సంతానం కూతుళ్లే! అబ్బాయైతే ఓ లాగు బనీను లేదా చొక్కా తొడిగేసి తలమీద వెంట్రుకలు, ఓ రెండు దువ్వులు దువ్వేసి వాడి ముఖాన ఇంత పౌడర్ కొట్టేస్తే, వాడి ముస్తాబైపోతుంది. ఊరిమీద పడి తిరుగుతుంటాడు. ఆకలేస్తే తప్పించి ఇంటి మొహం చూడడు. అదే అమ్మాయైతే... ఎంచక్కా పాదాలకి పసుపు, పారాణి, కాళ్ళకి మువ్వలపట్టీలు, నడుముకి చిరుగంటల వడ్డాణం, చేతులకి గాజులు, వంకీలు, చెవులకి లోలకులు, మెళ్ళో ముత్యాలసరాలు, తలమీద పాపిటపిందె, జడగంటలు, జడలో పువ్వులు చక్కగా అమరించి, మంచి పట్టుపరికిణీ, జాకెట్టుతో ముస్తాబు చేస్తే ఎంత ముద్దొస్తుందో. ఒకసారి నీ చిన్నతనం గుర్తు చేసుకో. మన అమ్మాయికి నీ చేత్తో నువ్వే అలంకరిస్తూంటే నీకెంత ఆనందంగా ఉంటుంది!"

భర్త వివరణతో మనసు నిండుగా నవ్వుతూ "ఒడిలో పాపాయి లేకపోయినా, కళ్లెదుట అమ్మాయిని నిలబెట్టేసారు మీరు!"

"నీకు అంతగా కోరిక, ఓపిక ఉంటె, అమ్మాయిని ఒక ఏడాది సాకిన తరువాత, ఒక అబ్బాయిని కూడా దత్తత తెచ్చుకుందాం సరేనా!"

"అప్పటి సంగతి అప్పుడు చూద్దాం లెండి. మనం ఎక్కడికి వెళ్లి అమ్మాయిని తెచ్చుకోవాలో ముందు చూడండి!"

"రేపటి నుంచి ఆ పని మీదే ఉంటాను!" అని రామారావు అనగానే... తేలిక పడిన మనసులతో, చక్కటి అమ్మాయిని ఊహించుకుంటూ, వారి సమస్యకి సమాధానం దొరికిందన్న ఆనందాన్ని జంటగా అనుభవించసాగారు.

# సామంతరాజులు

అట్టాడ అప్పల్నాయుడు



940031961

**విశిష్ట అతిథి కథ**

***బయట గొడవ పెద్దదైంది. కాంపౌండర్ ఆందోళనగా వచ్చి,***
***“సార్ ఎవరో వచ్చి మన హాస్పటల్ కొలతలు తీస్తున్నారు. మన స్టాఫ్ వద్దంటున్నా ఆగటం లేదు.***
***పేషెంటులూ వద్దంటున్నారు.***
***వాళ్ళమీద లాఠీలెత్తుతున్నారు సార్” అని చెప్పేడు ఆయాసపడుతూ.***

తూర్పు తొలిపొద్దు ప్రసవంలో ఉంది. రక్తజీరల వెలుగురేఖలు సన్నగా చీకట్లను పారద్రోలుతున్నాయి. వెలుగురేఖలు పడిన దగ్గరల్లా ఒక్కొక్కటీ కళ్ళకానుతోంది. అది మత్స శ్యాంప్రకాశ్ బంగ్లా. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో బంగ్లా, బంగ్లా చుట్టూ రకరకాల ఫలవృక్షాలూ, పూలమొక్కలూ, రాతి చప్టాలూ, చప్టాలను రాతి స్తంభాలతో లేపిన కుమ్మరి పెంకుల పైకప్పులూ, వాటిమీద అల్లుకున్న మల్లె, జాజి తీగలూ... ఆకుపచ్చ లానూ, లాను పక్కగా ఇసకతో వాకింగ్ ట్రాకు... ఇంతదాకా చీకట్లలో కనిపించనివన్నీ ఖాళీ టేబుల్ మీద ఇంద్రజాలికుడు నల్లతెరను దులిపితే టేబుల్ మీద ఒక్కొక్క వస్తువూ దర్శనమిచ్చినట్టు దర్శనమిస్తున్నాయి.

కార్పొరేట్ తో పోటీ పడలేక దిగాలుపడే దేశవాళీ మార్కెట్లా... బంగ్లా ప్రవేశద్వారం దగ్గర ఎత్తైన ఎలెక్ట్రిక్ స్తంభానికి ఎలెక్ట్రిక్ బల్బు ఒకటి సూర్యకిరణంతో పోటీ పడలేక వెలవెలబోతోంది.

అంతకుముందర మత్స శ్యాంప్రకాష్ చీకటితోనే నిద్రలేచాడు. బెడ్ మీద భార్య సోయిలేకుండా నిద్రపోతోంది. ఆమె చీర కాళ్ళముందు ముడుకులవరకూ కూడిపోయి, తొడలకింద నలుగుతోంది. పైట చెంగు గుండెలమీద కాక కటిభాగం కింద ఇరుక్కుపోయింది. చీరనూ, పైటనూ సర్దుదామని చెయ్యిచాచి... సర్దినా మళ్ళీ కాస్సేపటికే యధాస్థితిలో ఉంటాయి, ఉండనీ... అని శ్యాంప్రకాశ్ మంచం దిగి బయటకు వచ్చాడు.

ఇంటి బయటకు వచ్చాక వరండాలో లైట్లు వేసేడు. పోలీస్ విజిల్స్ విని పారిపోయే దొంగలా, చీకటి పారిపోయింది. బంగ్లా బయటి గార్డెన్లైట్ల స్విచ్చులు వేసేడు. అవి వెలుగులు ప్రసరించేయి.

ప్రత్యేకంగా తనకోసం వేసిన వాకింగ్ ట్రాక్లో నడవడం ప్రారంభించేడు. నడకకంటే ఆలోచనలు స్పీడుగా ఉన్నాయి. సెప్టెంబర్ మాసపు మధ్యరోజులు. కరెంట్ లేని రోజుల్లో ముఖ్మల్ గుడ్డతో చేసిన పెద్ద విసనకర్రలాంటి దాన్ని పనివాడు అటూయిటూలాగగా అధికారుల కుర్చీలకు తగిలే గాలిలా, చల్లగా గాలి వీస్తోంది. మనుషుల శ్రమ, లాభాలను చేకూర్చడమే కాదు, సేద దీరుస్తుందనిపించింది శ్యాంప్రకాశ్ కి!

అతనీమధ్య శ్రమజీవుల గురించి ఆలోచిస్తున్నాడు. శ్రమజీవుల మీద పత్రికల్లో వచ్చే వార్తలతో పాటు, వ్యాసాలూ, కథలూ,

కవిత్వం చదవడానికి ఆసక్తి చూపిస్తున్నాడు.

శ్యాంప్రకాశ్ నడుస్తూనే... నాకు ఆసక్తి ఉంది. వాళ్ళకి నామీద అసహనముంది! అసమ్మతీ, అసహనం కూడానేమో...! ఉండొచ్చు. ఉంటుంది. ఎందుకుండదు? మనమేమి చేసేం! వాళ్ళ ఉసురు పోసుకున్నాం! ఎన్నికలప్పుడు చేసిన ఒక్క వాగ్దానాన్నీ అమలుచేయ్యలేదు. ఉన్న ఉపాదులు పోయినా... ఎందుకిలగని అడగలేదు. ఇళ్ళు పడగొట్టేసి రోడ్లేయించినా, ఊళ్ళమధ్య టోల్‌గేట్లు పెట్టించినా, రేషన్‌కార్డులు తీసేసినా, పెన్షన్లు రద్దుచేసినా, కర్మాగారాలు మూసేసి రోడ్ల మీదకు తోలేసినా, రోడ్లమీద కూలీలు చచ్చి చావైనారు గాని, పాపం పల్లెత్తి మాట పలకలేదు వాళ్ళు!

కాదులే... అన్నారులే! పలకడమేటి... అరిచారులే! గోలగోల చేసేరులే!! గొంతులెత్తేరు. పిడికిళ్ళు బిగించేరు. రోడ్లమీదకొచ్చేరు. కార్యాలయాల ముందర దీక్షలు చేసేరు. ఉసురు పోసుకోకండన్నారు. భూముల్ని లాక్కోకండన్నారు. కర్మాగారాల్ని మూసీకండన్నారు. కంపెనీవాళ్ళ కోసం మా కడుపులు కొట్టికండన్నారు!! అన్నారన్నారు!!! ఆళ్ళకి అసహనముంది. అసమ్మతున్నాది. ఆగ్రహమూ ఉన్నాది. ఉంటాదుంటాది...!!



అవేవీ పట్టించుకోకయ్యా, ఓటేసినప్పుడు సమ్మతీ ఆ తరవాత అసమ్మతీ ఈ దేశ ఓటరు స్వభావంలే. అవేవీ పట్టించుకోకు. వాళ్ళంతా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు తెలుసా? ఇలాగైతే దేశం ఎలా అభివృద్ధవుతాది? కంపెనీలు మేమెలా పెడతాము? రెండే ప్రశ్నలేసేరు కంపెనీవోళ్ళు.

పోలీసులూ, మిలటరీ ఎందుకున్నాయని మరి రెండు ప్రశ్నలేసేరు!

శ్రీరాముణ్ణి తలచుకోండన్నారు!

యజ్ఞవాటికల రక్షణకు తీసుకెళ్లిన విశ్వామిత్రుని సంతానమా వీళ్ళు?

శ్రీరాముడి చేత అస్త్రాలు ప్రయోగింపచేసేరు!

ఛ...ఛా... వాళ్ళు చెప్పినది నమ్మేను. అభివృద్ధే గామోసనుకున్నాను. ప్రజల మీదికి పోలీసుల్ని తోలేను. ప్రజల ఉసురు పోసుకున్నాను.

వాళ్ళు మాత్రం విశ్వామిత్ర సంతానమే! త్రిశంకుస్వర్గం కాదు, నరకమే సృష్టిస్తున్నారంది మనసు. ఔనౌనని తల అంగీకారంగా ఊపుతూనే జోరుజోరుగా నడవసాగాడు శ్యాంప్రకాష్. సూర్యకిరణాలొచ్చేవరకూ చాలాసేపు నడిచాడు.

శరీరం మీద చెమటలు ధారలు కట్టేయి.

పండిన పంటలన్నీ మా చెమట చుక్కలే... వంగపండు పాట గుర్తొచ్చింది.

పంటకు వచ్చిందీ కామందుల చేనీ... ఆకలిమంటలనీ ఏడుపింకమానీ... ఎన్నుగింజ కడదాకా... కష్టమంతా మాదేనని... పంట కోతకు పిలుపిచ్చేడు! నయం, పీకల కోతకు పిలుపివ్వలేదు వంగపండు... అని వంగపండుకు దండం పెట్టుకున్నాడు.

రోజూ గుడ్మార్నింగ్ చెప్పి తన వెంట నడిచే పర్సనల్ సెక్రటరీలా సూర్యకిరణం వాకింగ్ట్రాక్ మీద శ్యాంప్రకాష్ నడుస్తుంటే, వినయంగా నడుస్తోంది.

కాసేపు సూర్యరశ్మి శరీరానికి పట్టండి, మంచిది. శ్రామికులు నిత్యం ఎండలో శ్రమిస్తారు గాబట్టే ఆరోగ్యంగా ఉంటారంటాడు డాక్టర్ రామకృష్ణ. ఆరోగ్యమే మహాభాగ్యం... డాక్టర్ల నినాదం. ఆరోగ్యానికేముందండీ, భాగ్యముంటే ఆరోగ్యాన్ని కొనుక్కోవచ్చు. ఒక ఫామ్‌హౌస్, అందులో రసాయనిక ఎరువులతో కాకుండా, ప్రకృతిసిద్ధ ఎరువులతో పంటలు పండించుట, నేటివ్ ఆవులు పెంచి వాటి పాలు తాగుట, కూరగాయలు పండించుట, వాటినే వండుకు తినుట... ఎటుల సాధ్యం? భాగ్యముంటేనే సాధ్యం... సో, భాగ్యమే ఆరోగ్యం... కంపెనీ వారి నినాదం.

బంగ్లాకు అవతల కొంత దూరంలోని కోలనీలో కోళ్ళు ఇక గూళ్లలో ఉండలేం మొర్రో అన్నట్టుగా కూయసాగేయి. పొరపాట్న చెట్ల కొమ్మలమీద ఇంతవరకూ ఉండిపోయామన్నట్టుగా, పొరపాటు దిద్దుకుంటున్నట్టుగా పక్షులు రెక్కలు కొట్టుకుంటూ గాభరా గాభరాగా ఎగిరిపోతున్నాయి. నిద్రలో ఏ భయంకర కలగన్నవో కుక్కలు, తుళ్లిపడి లేచి అరుస్తున్నాయి. ఆ అరుపులు శ్యాంప్రకాశ్ భవంతి వరండాలోని ఖారవేలు చెవినబడి, చిరాగ్గా కళ్ళు తెరిచి, ఒళ్ళు విరిచి, కాళ్ళు చాపి, తల నేలకు వాల్చి, నేలను ముద్దాడి లేచి, భవంతి గేటు దాటి శ్యాంప్రకాశ్ వేపు నడుచుకుంటూ వెళ్లింది.

శ్యాంప్రకాశ్ వాకింగ్ట్రాక్ పక్కగా, బాదంచెట్టు నీడలో, రాతిబల్ల మీద కూర్చొని, యోగా చేయసాగేడు. ముక్కూ కళ్ళూ మూసుకున్నాడు గాని, ఆలోచనలు మానుకోలేక పోతున్నాడు. ఖారవేలు కూడా రాతిబల్ల మీద కూర్చొని శ్యాంప్రకాశ్ వేపు దీక్షగా చూడసాగింది. ఆయన ఉఛ్వాస, నిశ్వాసాలను తలా, కళ్ళూ మీదకీ, కిందకీ ఎత్తి దించుతూ గమనిస్తోంది.

ఎన్నికలెంతో దూరంలో లేవు. మళ్ళీ నీకు టికెట్టివ్వాలా? నువ్వు గెలవాలా? మళ్ళీ మంత్రి పదవేదో కావాలా? పార్టీ నాయకుని ప్రశ్నలే కదులుతున్నాయి శ్యాంప్రకాశ్ మనసులో! నిజానికవి ప్రశ్నలు కావు... ప్రశ్నల రూపంలో ఉన్న తను చెప్పాల్సిన జవాబులు.

టికెట్ కావాలి... ఎన్నికల్లో గెలవాలి... తరవాత మంత్రి పదవి పొందాలి... కదా! వెళ్ళు వెళ్ళు... వార్ని కలువ్! వారు అంటే ప్రజలనుకున్నాను... కాదట... గండి గదానీ ఆట...!

దేవతలు ఇంద్రుని దర్శనానికి వెళ్తే ఎలా ఉంటుందో ఆలాగుంది గదానీగాడి దర్శనానికి ఎల్లినప్పుడు.

ఇంద్రభవనం ఎవుడు కట్టేడోగాని, ఆడిబాబు గదానీగాడి భవనం కట్టేడు. అవెన్ని గదులో, అవెన్ని గడపలో , అవెన్ని అంతస్తులో, అందలెవలుంటున్నారో! అందులోనే సిన్మాహాల్లట! ప్లే గ్రౌండట! కాన్ఫరెన్సు హాలాట! డైరక్టుగా ఆ భవంతి టెర్రస్ మీద విమానం లేండవుతాదట! ఇంకేటేటున్నాయో... ఏటేటాగుతాయో... దిగుతాయో, ఎప్పుడో, ఏనాటికో యే కవో, రచయితో వర్ణాలు వర్ణాలుగా రాస్తే తెలుస్తాది తప్ప, మామూలుగా తెల్డు.

గదానీగాడు, రాష్ట్రాల సీ.ఎం.లకీ, దేశ పి.యెమ్.కీ, ఎప్పుడో ప్రసిడెంట్ ఆఫ్ ఇండియాకీ, అదర్ కంట్రీ ప్రసిడెంటులకీ దర్శనమిస్తాడు తప్ప, మరొకడికివ్వడట!

మా పార్టీ లీడర్ పంపించేడురా బాబూ!

గదానీగారు కలవరు, పియ్యేని కలవచ్చు.

ఏట్రా ఈ కర్మ? మత్స శ్యాంప్రకాశ్, ఏట్రా ఈ సిచ్యుయేసన్? నువ్వెవుడివి?

నేనొక ఎమ్మెల్యేని. నేనొక మంత్రిని. నేనేటి... ఈడెవుడో యాపారం చేసుకునే ఎదవని కలవడానికి రాడవేటి? నాకేటి ఈడి ఓటు కావాలా? ఈడేమన్నా నాకు కేన్వాసు చెయ్యాలా? మైకొట్టుకొని నియోజకవర్గమంతా తిరిగి నా గురించి పొగడాలా? ఏలా ఈ గదానీగాడు... నాకేల? ఈడికి నా అవసరముందా, నాకు ఈడవసరముందా?

ఇప్పుడు నాకు ఈడవసరం లేదు. నాకో భవంతి... ఈడంతది కాకపోయినా... నాకు తగ్గది నాకుంది. నాకూ ఆస్తీ, ఐశ్వర్యం... ఈడంత కాకపోతే... నాకున్నంత నాకుంది. నాది ఇచ్చే చెయ్యేగాని, పుచ్చుకునే చెయ్యి కాదు. కాదొరే కాదు. అరచేయి ఎన్నడూ చాచలేదు ఎవరిదగ్గరా! అరచేయి చూపడం ఇష్టంలేకే హస్తం గుర్తు పార్టీ మారిపోయేను. నువ్వు నాకు కాదు... నేనే నీకు దర్శనమివ్వనొరే గదానీ! ఒరొరే గదానీ!!

అంటే! గో బేక్ మత్స శ్యాంప్రకాశ్... గో బేక్! వెనక్కి గాని, ముందుకుగాని మా పర్మిషన్ లేకుండా వెళ్లలేవు. పియ్యేని కలిసి వెళ్ళు.

గదానీగాడి పియ్యే గదానీ కంటే గర్రాగున్నాడు. గ్రామసర్పంచిని ముఖ్యమంత్రి పియ్యే పలకరించినట్టు పలకరించేడు. కూర్చోమని కూడా అనలేదు.

వెయ్యి ఎకరాలు కావాలట మీ నియోజకవర్గంలో. ఆ ఏర్పాట్లలో ఉండండి. వైజాగ్ సాయిని ఎప్రోచ్ అవ్వండి... అంతే, అంతే అన్నాడు! కుర్చీలోంచి లేచి వెళ్లిపోతూ ఆగి, మీ బేంక్ ఎకౌంట్ పర్టిక్యులర్స్ మా క్లర్కుకు ఇచ్చి వెళ్లండన్నాడు.

వెయ్యెకరాలు మా నియోజకవర్గ రైతుల ఉసూరు పోసుకొని, సేకరించి ఈడికి, గదానీగాడికివ్వాలా? నా బేంకు కాతాల ఈడు ముస్టేస్తాడా? ఇంతకుముందు అదేదో కంపెనీవోడి మాటలు నమ్మి, (మూటలు కూడా తీసుకొని) భూసేకరణకు పూనుకున్నాను. ఏటైంది? ప్రజల ఉసురు తీసేను. కంపెనీవోడు తట్టాబుట్టా సర్దేసేడు. తరవాత ఎలక్సన్ల మనల్ని అసెంబ్లీకి ఎల్లనియ్యలేదు ప్రజలు.

కష్టపడి మొన్న ఎలక్షన్ల గెలిచేనురా నాయనా! (బోల్డు డబ్బు కరుసైందిరా బాబూ)

భూమి సేకరించనంటే? బేంక్ పర్టిక్యులర్స్ ఇవ్వనంటే?

ఒర్నమ్మీ...

కర్తవ్యమేంట్రా? నా కర్తవ్యమేంట్రా? రాజ్యాంగాన్ని కాపాడడం, రాజ్యాంగబద్ధంగా పరిపాలన సాగించడం. అదిరా నా కర్తవ్యం. ఒరోరే గదానీ, అదిరా నా కర్తవ్యం!

జోరీగేదో తల వెనుక నుంచి, చెవుల పక్కగా తిరుగుతోంది. యోగా భగ్నమైంది. చిరాగ్గా కళ్ళు తెరిచేడు మత్స శ్యాంప్రకాశ్.

ఖారవేలు కనిపించేడు. ఆనందంగా ఖారవేలుని చూసి, దాని ఒళ్ళు నిమిరుతూ, 'సామ్రాట్ ఖారవేలూ, గుడ్ మోర్నింగ్' అన్నాడు.

సామ్రాట్ ఖారవేలు 'భౌభౌ' అంది.

ఏదీ తేల్చుకోలేక పోతున్నాను సామ్రాట్. నంజికొడుకులు మనల్ని ముందుకెల్లనియ్యరు, వెనక్కి ఉండనియ్యరు. వాళ్ళు ఆడించినట్టు ఆడాలట.

ఆలోచనల్లో పడిన సామ్రాట్ కాసేపు కళ్ళు మూసి, తరవాత కళ్ళు తెరిచి, ఆళ్ళతోటి కయ్యమే తప్పు, నెయ్యము కుదరదనిపిస్తంది బాబూ అంది ఖారవేలు పెద్ద వయసు వ్యక్తిలా దీర్ఘంగా నిట్టూర్చి.

'కార్పొరేటోడితోటి కయ్యం మన తరంగాదు. ఆడికి ప్రపంచమంతా సైన్యమే! ఆడికాడ సొమ్ముంది. అది సాలకపోతే అన్ని బేంకులూ ఆడికి సొమ్మిస్తాయి. సొమ్ముతోటి కొనుక్కున్న జాతైన అయ్యేయెస్లూ, ఐపీయెస్లూ, ప్లీడర్లూ, జడ్జీలూ, ప్రెసొస్సోళ్లూ, పొలిటీసియన్లూ ఉన్నారు. ఆడితోటి కయ్యం మన తరం కాదు' అన్నాడు దీనంగా మత్స శ్యాంప్రకాశ్, కూర్చున్న దగ్గరనుంచి నడుము పడిపోయిన ఒంటెలా భారంగా లేస్తూ!

తల కొట్టేసినట్టుంది బాబూ... తలెత్తి నడలేనిక... అనంటూ ఖారవేలు చప్టా మీదనుంచి లేచి, తోకను నోట్లో పెట్టుకు కరుచుకొని, 'ఖారవేలు అన్న నా పేరైనా మార్చీ, నన్ను నీ ఇంటినుంచి బయటికైనా పంపించీ' అని చెప్పేసి, తలాడించుకొని, గబగబా అడుగులు వేసుకొని వెళ్లిపోయింది.

కొసకి కుక్కకున్న రోషమైనా పొలిటీషియన్‌కి లేదన్నమాట!

మత్స శ్యాంప్రకాశ్ స్వతహాగా రోషమున్నవాడు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో రోషమే ఆభరణంగా జీవించేడు. గ్రామసర్పంచి పదవినుంచి సమితికీ, జిల్లాకీ నాయకుడైనాడు. ఇప్పుడు ఎమ్మెల్యేగా, మంత్రిగా. గత ఐదేళ్లుగా రోషాన్ని అదుపు చేసుకుంటున్నాడు. రోషం అదుపైన మేరకి బీపీ పెరుగుతోంది. షుగర్ లెవెల్స్ పెరుగుతున్నాయి. మందులు వాడుతున్నాడు.

రోషానికి మందులు వాడు బాబూ అంటుంది ఖారవేలు. తండ్రి కూడా ఇలాగే అనేవాడా? లేదులేదు, సెబాస్ అనేవాడు. సర్పంచిగా నెగ్గడానికి కర్రా కత్తీ వాడినప్పుడు, ప్రత్యర్థిని వెంట తగిలినప్పుడు సెబాసన్నాడు. జిల్లా చేర్మెన్ అవ్వడానికి తుపాకి తీసినప్పుడో! ఎమ్మెల్యే అయినప్పుడో! జిల్లాని రాజులూ, సమితిని బ్రాహ్మలూ ఏలుతున్నప్పుడు పల్లుదిని గింజలు ఊసేవాడు.

రాజుల్నీ, బ్రామ్మర్లనీ ఎదుర్కొని, అంచెలంచెలుగా ఎదిగి మంత్రి అయినప్పుడు శ్యాంప్రకాశ్ చేతికి కొన్ని దస్తావేజులిచ్చాడు తండ్రి. అందులో అతను సంపాదించిన ఆస్తులూ, అతనికి సంక్రమించిన ఆస్తులూ ఉన్నాయి. మంచం పట్టిన తల్లినీ, తనతో తిరగాడే ఖారవేలునీ, గది గోడకి వేలాడే తుపాకినీ చూపించి, ఇవే నీకు నేనిచ్చే ఆస్తులు! వీటిని పెంచుకుంటావో, తరిగించుకుంటావో చూడగలననుకున్నాను. కానీ లేదు! అవకాశం లేదు. నాకు భగవంతుని దగ్గరనుండి పిలుపొస్తోంది, ఎలిపోతానని చెప్పి... ఒకరోజు కన్నుమూశాడు. దస్తావేజుల్లోని ఆస్తుల కోసం అనేకానేక కొట్లాటలు జరిగాయి. అప్పట్లో పోవాల్సిన ప్రాణాలవి. రోషమే నిలబెట్టింది.

చెప్పింది ఖారవేలు.........

'కళింగరాజ్యాన్ని స్థాపించిన ఖారవేలుడంటే ప్రాణం మీ నాన్నకి. నాకందుకే ఖారవేలుడన్న పేరు పెట్టేడట. ఇలాంటి పేరెక్కడా

వినలేదే... అని, నా పేరు గురించి గంగువాడ నాయుడు అడిగినప్పుడు చెప్పేడు. ఖారవేలు కళింగరాజ్యాన్ని స్థాపించిన రాజట. కళింగమ్మీద దండయాత్రకు వచ్చిన శాతకర్ణిని ఓడించాడట. పొరుగుదేశం మీద యుద్ధానికి వచ్చిన పరదేశ రాజు 'దిమిత్రావ్'ని వెంట తరిమాడట. కళింగ వీరుడట ఖారవేలుడు... గర్వంగా చెప్పింది ఖారవేలు.

భూమికోసం, భూమికి కావలసిన నీటికోసం, బతుకులో దేనికో ఒకదానికి రాజుల్తోటీ, బ్రామర్లతోటీ కొట్లాడినాడు మీ తండ్రి. తెల్లోడు ఎల్లిపోయినా ఈళ్ళకి పవర్ తగ్గలేదు. ఒంటినిండా గాయాలే బాబూ మీ తండ్రికి... అని కూడా అన్నది ఖారవేలు.

నేను గాయపడకూడదు, తండ్రిచ్చిన ఆస్తిని తరిగించకూడదు అని అప్పుడే నిర్ణయించుకున్నాడు శ్యాంప్రకాశ్. మనం గాయపడకూడదంటే ప్రత్యర్థుల్ని మనం గాయపర్చాల. ఆస్తిని తరిగించకూడదంటే దాన్ని ఖర్చు చేయకూడదు. ఖర్చు చేయకపోతే పెరగదు... నిజమే! కానీ పెరగాలంటే?

ఆస్తిని పెంచాలంటే... భూములు, భవంతులూ, బంగారాలూ, సంపదలూ పాలుబోసి కాదు, పలురకాల విటమిన్లు తినిపించినా పెరగవు... మరొకడి భూముల్నీ, భవంతుల్నీ, బంగారాల్నీ, సంపాదల్నీ మన ఆస్తిలో కలుపుకోవాలి. అవి కలవగా పెరుగుతాయి అని కూడా ఆలోచన చేశాడు. ఆయొక్క తండ్రి ఇచ్చిన ఆస్తిని పెంచుకుంటూ వచ్చాడు. ఆయొక్క తండ్రిలా గాయపడకుండా బతుకుతున్నాడు.

తన తండ్రి కష్టపడి ఆస్తి సంపాదించాడంటారు. ఆ సంపాదనలో కూలీల శ్రమ ఉందంటారు కమ్యూనిస్టులు. శ్రమజీవుల పట్ల ఇటీవల కొంత అనురాగం కలుగుతోంది గాని, శ్యాంప్రకాశ్‌కి కమ్యూనిస్టులమీద తీవ్ర అసహనముంది. శ్రమజీవులు వేరు, కమ్యూనిస్టులు వేరు అని భావిస్తున్నాడు.

కూలీ సంఘాలు పెట్టి, పనులు బందు చేసి, కూలిరేట్లు పెంచేసి, దున్నేవోడికి భూమి ఇవ్వాలనేసీ, ఎన్నెన్ని చేసేరయ్యా మీరు? రైతులెన్ని ఇరకాటాలు పడినారు మీవల్ల? ఎవురో మా నాయిన లాంటోలు అంతో ఇంతో సంపాదిస్తే, వడ్డీలకు అప్పులిస్తే, దోపిడీ అన్నారు. అడివి కలప వ్యాపారం చేస్తే, అందరిలాగా ఒక సారా వ్యాపారం, ఒక సివిల్ కాంట్రాక్టు లాంటివి చేస్తే కళ్ళలో నిప్పులు పోసుకున్నారు. కత్తులు పట్టుకొని పీకలు తీస్సేరు కదయ్యా! కొసకేటయింది? మా నాయిన కాలం నుండి, నా కాలానికి వచ్చేసరికేటయింది? ఎక్కడున్నారు మీరు? మీ బలం ఏదీ? తరిగిపోయింది కదయ్యా! ఇప్పుడు మా తండ్రికి బాబులాంటోలు... కార్పొరేటోల్లు వొచ్చేసినారు! ఆలు మమ్మల్నే లెక్కజెయ్యటం లేదు, మీరొక లెక్కా? మావోల్ల పీకలు తీసేసినంత సులువుగా కార్పొరేటోల్ల పీకలు తీసేగల్రా!.... ఎదుట మనిషి ఉన్నట్టూ, అతన్ని ప్రశ్నించినట్టూ ప్రశ్నించాడు శ్యాంప్రకాశ్.

నడుస్తూ బంగ్లాలోకి వచ్చేశాడు. ఖారవేలు లోపలనుంచి దినపత్రికల్ని తీసుకొచ్చి, శ్యాంప్రకాశ్ కూర్చునే కుర్చీ ఎదురుగా ఉన్న టీపాయ్ మీద పెట్టి, అక్కడే కూర్చుంది. శ్యాంప్రకాశ్ కూర్చొని, దినపత్రిక తీసుకొని చదవసాగాడు.

రాబోయే రోజుల్లో రాష్ట్రానికి లక్షకోట్ల పెట్టుబడులు రాబోతాయనీ, పరిశ్రమలు స్థాపించబోతున్నారనీ, వేలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు దొరుకుతాయనీ, పరోక్షంగా లక్షలాదిమంది ఉపాధి పొందుతారనీ ముఖ్యమంత్రి ప్రకటన!

ఉద్యోగాలు దొరుకుతాయి, వ్యాపారాలు పెరుగుతాయి, ఉపాధులు కలుగుతాయి అని అంటారేగాని... భూములు పోతాయనీ, నదులు దిశలు మార్చుకుంటాయనీ, అడవులు ఉండవనీ, సముద్రజలాలు పాడైపోతాయనీ చెప్పారు. చాలా తెలివిగా ఒచ్చేవేవో... ఒస్తాయన్నా గేరంటీ లేకపోయినా... చెప్తారు తప్ప, పోయేవి చెప్పరు... అని బాలగోపాల్ కదా అనేవాడు? ఇప్పుడు నువ్వన్నది నిజమనిపిస్తుందయ్యా బాలగోపాలూ!

పత్రిక ఐదో పేజీకి వచ్చేశాడు. 'ప్రజాసమస్యలు పట్టించుకోని శ్యాంప్రకాశ్; నియోజకవర్గంలో ఎదురుగాలి'... రెండు కాలంల వార్త! మరో పత్రిక తీసేడు. గబగబ పేజీలు తిరగేసేడు. అందులో కూడా శ్యాంప్రకాశ్ మీద ముఖ్యమంత్రి కార్యాలయం నిఘా... అనంటూ ఏదేదో ఉంది! కోపంగా పేపర్ని టీపాయ్ మీదకు విసిరి కొట్టేడు.

ఖారవేలు ప్రశ్నార్థకంగా చూసింది. ఇందంతా గదానీగాడి దన్నుతో గోదారి, కృష్ణా జిల్లా నా కొడుకుల చదరంగం. కాలేజీలు పెట్టి ఉద్ధరించినట్టు మాట్లాడతారు. పత్రికలు పెట్టి, నిజాలు రాస్తున్నట్టు ఒట్లు వేస్తారు. ఆస్పత్రులు పెట్టి ఆదుకుంటున్నట్టు పోజూలిస్తారు. ఎపార్ట్మెంట్లు కట్టి, ఫ్లై ఓవర్లు లేపి, సిన్మాలు తీసి, స్టార్ హోటళ్లు పెట్టీ, బేక్వర్డ్ ఏరియాని డెవలప్ చేశామని డప్పు కొడతారు.

నా కొడుకుల్ని చేరదియ్యడం తప్పు, చోటియ్యడం తప్పు. 'పోన్లే, వ్యాపారాలే కదా చేసుకుంటారు' అనుకున్నాం. కాంట్రాక్టులే కదా, చేసుకొని కాసులు గడిస్తారనుకున్నాము. ఆగలేదు...ఆళ్ళక్కడతో ఆగలేదు. గడించేరు. నలుమూలలకీ విస్తరించీసేరు. ఆకరికి మా పదవులకాడికీ వచ్చేస్తున్నారు నా కొడుకులు.

గదానీగాడి ఆఫీసు కెళ్లొచ్చేక సి.ఎం. కూడా వైజాగ్ సాయిగాడ్ని కలవమన్నాడు. 'వైజాగ్ సాయి' అనంటారాడ్ని అందరూ, కానీ ఆడిది వైజాగ్ కాదు. కృష్ణా జిల్లానుంచి వచ్చినోడు. వైజాగులో అడ్డమైన వ్యాపారాలూ చేసి, బాగా ఎరువేసిన తోటలో పెరిగిన కొబ్బరిమొక్కలా సంపదల్తో ఎదిగిపోయేడు. వ్యాపారాలు సంపద తెస్తే, సంపద పదవుల్ని తెచ్చింది.

మాకేటి కావాలో, మాకేటి మంచిదో ఈ నంజికొడుకు చెప్తాడేట్రా నాయనా! సేకరించాల, సేకరించాల, ఎంతో అభివృద్ధి అవుద్ది, ఎన్నో ప్రయోజనాలున్నాయి! మీ ప్రయోజనాలకే! మీ అభివృద్ధికే సేకరించాల భూమి...... చెప్పేడు, చెప్పేడు నా కొడుకు! కొసకి, ఒచ్చే ఎలక్షన్ల టికెట్ల సెలక్సనూ, కేండిడేట్ల కర్చూ నాదీ పూచీ... అనన్నాడు వైజాగ్ సాయిగాడు. అంటే ఈడు, ఆ గదానీగాడి బ్రోకరన్నమాట!

నాకొడుక్కి నా ఆలోచనలు తెలిసినట్టుగుంది... బ్రోకరింగనేదేమీ పాడుపని కాదండీ. పోలిష్డ్ సొసైటీలో అదిప్పుడు లింకు... అనన్నాడు నవ్వుతూ. అలా అని ఊరుకున్నాడా... పూర్వం సామంతరాజుల్లా ఆయా ప్రాంతాల్లో మీలాంటోళ్లిప్పుడు చలాయిస్తున్నారు. అది సజావుగా సాగాలంటే చక్రవర్తి దయ అవసరం. ఆలోచించుకోండి..... చక్రవర్తులకి సామంతులు కరువు కాదు... అన్నాడు. లంజికొడుకు అన్నీ హెచ్చరికల రూపంలోనే మాట్లాడతాడు.

టీ తెచ్చిచ్చి నిల్చున్నాడు పొన్నాడ గవరయ్య. గవరయ్య శ్యాంప్రకాశ్ తండ్రి దగ్గర పెరిగినవాడు. నడివయసు వాడు. శ్యాంప్రకాశ్ తిండీ తిప్పలూ అతనే చూస్తాడు. అప్పుడప్పుడూ మంచీ చెడ్డా చెప్తుంటాడు కూడా.

శ్యాంప్రకాశ్ భార్య ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంటుంది. వారంలో మూడు రోజులు బాగుంటుంది; నాలుగు రోజులు బాగోదు. బాగున్నప్పుడు పూజలూ పునస్కారలంటూ గుళ్ళచుట్టూ తిరుగుతుంది. ఉపవాసాలుంటుంది. 'రాత్రి కూడా ఒంట్లో బాగోలేదండీ' అంది శ్యాంప్రకాశ్‌తో.

ఎప్పుడు మాత్రం నీకు బాగుందిలే... అని మనసులో అనుకోని, ఏమైందమ్మా అని అడిగాడు అనునయంగా.

"గుండెల్లో గాభరాగా ఉందండీ. కడుపు పొంగినట్టుగానూ, ఒళ్ళంతా నిస్సత్తువగానూ ఉంది" అని చెప్పిందామె.

"సరే పడుకో. పొద్దుట డాక్టర్ దగ్గరకు వెళ్దువుగాని" అని చెప్పేడు. ఆమె పడుకుంది. నిజానికి ఆమెతో రాజకీయాలు ఎప్పుడూ మాట్లాడడు గాని, రాత్రి మాటాడాలనిపించింది. పార్టీ అధినాయకుడూ, కార్పొరేట్ కంపెనీ గదానీ ఇద్దరూ ఆడుతున్న

చదరంగంలో తనెలా బలవబోతున్నాడో చెప్పాలనుకున్నాడు. చాలా దుఃఖం కలిగింది. రోగగ్రస్తగా పడుకున్న భార్యను చూసికాదు, తన మనసులోది విప్పి చెప్పుకొని, ఓదార్పు పొందాల్సిన స్థితిలో ఉన్నాడు. గుండె ఘోష వినిపించే చోటుగాని, మనిషి గాని, భార్యకు మించి ఎవరూ కారు.

టీ తాగి కప్పు టీపాయ్ మీద పెట్టేడు శ్యాంప్రకాశ్. ఎప్పటునుంచో బంగ్లా ఆవరణలో ఎదురుచూస్తున్న జెడ్పీ వైస్‌చెయిర్మన్ కృష్ణవేణి, ఆమె కొడుకూ, గంగువాడ సర్పంచ్ గంగునాయుడు, పట్నంలో హోల్సేల్ మర్చంట్ బిళ్ళంశెట్టి గోవర్ధనరావు, ఎంజీవోల సంఘం నాయకుడు తాంద్ర రాజశేఖరూ, మరి నలుగురూ శ్యాంప్రకాశ్ దగ్గరకు ఒకేసారి వచ్చేసారు, ఒకరి తరవాత ఒకర్ని పంపిస్తామని సెక్యూరిటీ వారు వారిస్తున్నా!

గవరయ్య వారి వేపు విసుగ్గా చూసేడు. ఇంకా పొద్దు పూరాగా పొడలేదు, పారోచ్చేరు ఏటి కొంపలు మునిగిపోనాయో! ఎవులి కొంపలు ముంచాలో? అని ప్రశ్నించుకొని, గుణుసుకున్నాడు మనసులో! అతను శ్యాంప్రకాశ్‌తో ఒక విషయం చెప్పాలని చూస్తున్నాడు. ఇంతలో వీరొచ్చి పడ్డారు.

“కక్కలేమూ, మింగలేమండీ... ఏమి పెద్దరికాలండీ!! ఒదలమంటే పాముకి కోపం! పోన్లే అంటే కప్పకి కినుకులాగుంది.” అన్నాడు అచ్చన్నాయుడు. అతను ఆరడుగుల పొడవూ, వందకేజీల కవతల లావూ ఉంటాడు. అలాటిలాటి కుర్చీలు చాలవు కూచోడానికి. కూచున్న దగ్గరనుచి అన్నీ అతనికి అసహనాలే!

“ఔనండీ” అంటూ పైట కొంగు భుజాల నిండా సర్దుకుంది కృష్ణవేణి.

“మా ‘ఓల్సేలు’కీ గాలోస్తందండీ. గుజరాతీ మార్వాడీలు దిగిపోతన్ను.” కళ్ళముందు ఈగ తిరుగుతుంటే, అరచేత్తో అదురుతూ చెప్పేడు గోవర్ధనరావు.

శ్యాంప్రకాశ్‌కి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. స్థానికుల వ్యాపారాలూ, పెద్దరికాలూ దెబ్బతింటున్నాయని వాపోయేవారిని ఎలా ఓదార్చాలో ఎలా ఆదుకోవాలో అతనికి తెలియట్లేదు.

“నువ్వులపంట నీట కొట్టుకుపోతుందని ఏడుస్తుంటే, కొబ్బరిబొండాలు పోతాయని యేడ్సి నోడిలాగుందోయ్ గోవూ (గోవర్ధనరావుని షార్ట్‌కట్‌లో అలాగే పిలుస్తారంతా) నీ యేడుపు. ఏనుగు తొంగున్నా యెద్దంత పొడవుంటాది. నీ యాపారమూ అంతే! మాది అలక్కాదు. ఎద్దుకి తక్కువ బతుకులు, తొంగుంటే బూవికి అంటుకుపోతాం.” అన్నాడు అచ్చన్నాయుడు. అతడన్నీ సామెతలతోటీ, ఉపమానాలతోటీ చెప్తాడు. అసహనం వలన అబ్బిన శిల్పం అది.

అచ్చన్నాయుడి మాటలకు వత్తాసుగా అందరూ తమతమ ఏడుపులు ఏడ్చారు. శ్యాంప్రకాశ్ అన్నీ విన్నాడు గాని బదులు చెప్పలేదు.

గవరయ్య అందరి దిక్కూ చూస్తూ, “అచ్చిన్నాయుడు బాబూ కోపగించుకోకండి గాని, ఒకటి మాత్రం నిజం. మీ అందరిదీ కొబ్బరిబొండాలు పోతాయని ఏడుపు. ప్రెజల్ది మాత్రం నువ్వులపంట పోద్దని ఏడుపు!” అన్నాడు. గవరయ్య మాటలకు గొడవ చేస్తారేమోనని అనుమానించిన శ్యాంప్రకాశ్ కల్పించుకొని,

“అన్నివేళలా పరిస్థితులు ఒకేలా ఉండవు. మనమే పరిస్థితులు అనుకూలించేదాకా, సర్దుకుపోవాల” అన్నాడు అనునయ స్వరంతో. ఆ స్వరానికి మిగిలిన అందరూ ఊరుకున్నారు గానీ, అచ్చన్నాయుడు ఊరుకోలేదు.

"ఏల్నాటి శనికైనా ఒక గడువుంటాదట. మరి దీనికో? ఎన్నాల్లు ఒల్లకోవాల?" ప్రశ్నించేడు.

శ్యాంప్రకాశ్ లేచి నిల్చోని అందరికీ నమస్కరించేడు. అంటే ఇక మీరు వెళ్లొచ్చని అర్థం. ఏమీ చేయలేక, కండువా దులిపి అచ్చన్నాయుడూ, పైటకొంగు సర్దుకొని కృష్ణవేణీ, పొట్ట నిమురుకుంటూ 'గోవూ' లేచి, బయటకు నడిచేరు.

గవరయ్య టీ కప్పు తీసుకుంటూ "అమ్మగారేటో ఇంకా నిద్ర లెగలేదు బాబూ. ఒంటిల నిమ్మలంగున్నట్టు లేదు. ఆస్పత్రికి పంపిస్తే మంచిది" అని చెప్పేడు.

"ఔనౌను. ఎవరితోనో పంపించడం కాదు, నేనే తీసుకెళతాను." అన్నాడు శ్యాంప్రకాశ్.

"ఎక్కడ వీలౌద్ది బాబూ నీకు. వీలైనా నీ యెనక సెక్యూరిటీ బళ్లూ, ఆ ఆరన్లూ అమ్మగారికి నచ్చవు." అన్నాడు గవరయ్య.

'ఇంకేమి సెక్యూరిటీ బళ్ళులే గవరయ్యా... అన్నీ పోతాయి. ఏటీ ఉండవు, మనమే మిగుల్తామ్' అని మనసులో అనిపించి, నిరామయంగా చూసేడు గవరయ్యవేపు.

అప్పుడే పియ్యే రాజారావు పట్నాయక్ వచ్చాడు. అతివినయంగా నమస్కరించి నిలుచున్నాడు, పులికి తగినంత దూరంలో, కళ్ళు నేలకు దించి నిలుచున్న వఱడులా! అతని చేతిలో డైరీ, జేబులో సెల్లూ, నోట్లో జర్దా కిల్లీ తినగా మిగిలిన తమలపాకు ముక్కలూ ఉన్నాయి.

'తొమ్మిది గంటలకి వి.ఐ.పీ. విజిటర్స్, పదిన్నరకి పాత్రపురం ప్రజాసదస్సు, పన్నెండుకి రావనపాడు హార్బర్ కోసం సేకరించాల్సిన భూముల గురించి కలక్టరాఫీసులో సమీక్ష' చెప్తున్నాడు రాజారావు.

"అన్నీ కేన్సిల్ చేసేయ్" చెప్పేడు శ్యాంప్రకాశ్. దించిన కళ్ళు పైకెత్తి చూసేడు పియ్యే.

"గవరయ్యా అమ్మగార్ని తయారవ్వమను. ఆస్పత్రికి తీసుకెళ్తాను." చెప్పేడు గవరయ్యతో.

"మీరూ, మీ సెక్యూరిటీ గోలా అమ్మగారికి..." గవరయ్య మాటలు పూర్తికాకముందే "అవేవీ ఉండవు. నేనే కారులో తీసుకెళ్తాను. అమ్మగార్ని తయారవ్వమను" అని చెప్పి, లేచి ఇంట్లోకి వెళ్లిపోయాడు శ్యాంప్రకాశ్.

పియ్యేకి ఏం చెయ్యాలో బోధపడలేదు. గుహలోకి పులితో పాటూ వెళ్లలేక, వెనుదిరగలేక, అటూ ఇటూ తిరిగే వఱడులా అక్కడే అటూయిటూ పచార్లు చెయ్యసాగేడు. గవరయ్య ఆశ్చర్యం నుండి తేరుకొని, గబగబా ఇంట్లోకి వెళ్ళేడు. శ్యాంప్రకాశ్ మాటలు విన్న ఖారవేలులో అప్పటిదాకా ఉన్న విచారం తొలగిపోయింది. హుషారు తెచ్చుకుంది. తోక పదేపదే ఊపుకుంటూ బంగ్లా బయటకు ఠీవిగా నడిచింది. అంత ఠీవిగా నడవలేని రాజారావ్ పట్నాయక్ పచార్లు ఆపి, తాటిపండు పడితే మూలిగే వఱడులా బంగ్లాకు ఈశాన్యంలో ఉన్న మంత్రిగారి పేషీకి నడిచేడు.

★★★

స్వంత వాహనంలో భార్యను పట్నానికి వెలుపల, పల్లెలకు దగ్గరగా తన మిత్రుడు రామకృష్ణ నడిపే ప్రజా వైద్యశాలకు తీసుకెళ్ళాడు శ్యాంప్రకాశ్. ఆకుపచ్చ పర్యావరణంలో, విశాలమైన ఆవరణలో నడుపుతున్న ఆస్పత్రి అది. డాక్టర్ల క్వార్టర్స్ కూడా అందులోనే. వాటికి కొంత దూరంలో రోగుల వార్డులు, డాక్టర్ల రూములూ, లెబొరేటరీ.

డాక్టర్ రామకృష్ణ గది చల్లగా, ప్రశాంతంగా ఉంది. గది మీద శ్లాబ్లో పూలమొక్కలూ, కూరగాయలూ పెంచుతునారు. వాటి

వలన ఆ గదిలోకి ఎండ వేడి రాదు, ఏసీ అవసరం లేదు. ఆ గదే కాదు, అన్నీ గదుల మీదా అలాగే మొక్కలు పెంచారు. ఆస్పత్రికి కావలసిన ఆహారపంటలూ, పాడీ అన్నీ ఆస్పత్రికి కొద్ది దూరంలో ఉన్న వ్యవసాయక్షేత్రం నుండి వస్తాయి. వీటన్నిటినీ డాక్టర్ రామకృష్ణ, ఆయన భార్య డాక్టర్ పద్మ పర్యవేక్షిస్తారు.

రామకృష్ణ ఆశ్చర్యపోయాడు శ్యాంప్రకాశ్‌ను చూసి. "కార్పొరేట్ ఆస్పత్రులమీద విరక్తి కలిగిందా? నా మీద దయ కలిగిందా?" అని పలకరించేడు.

శ్యాంప్రకాశ్ ఏమీ బదులివ్వలేదు. చిన్నగా నవ్వేసి, భార్య అనారోగ్యం గురించి చెప్పి, ఆమెను చూపించేడు. రామకృష్ణ వెంటనే పద్మకు ఫోన్ చేసి, ఆమెను రమ్మన్నాడు.

"చాలా బిజీగా ఉన్నట్టున్నారు?" అడిగాడు శ్యాంప్రకాశ్

"మనదేశలో రోగులూ, పేదవారు ఎక్కువ కదా!" జవాబిచ్చేడు రామకృష్ణ.

ఇంతలో బయట ఏదో కలకలం వినబడింది. ఆస్పత్రి ఆవరణలోకి కొన్ని కార్లూ, పోలీసు వాహనాలూ వచ్చి ఆగాయి. వాటిలోనుంచి దిగిన అధికార్లు ఆస్పత్రి ఆవరణ కొలతలు తీయబోతున్నారు. ఆస్పత్రి సిబ్బందీ, తిరగాడగలిగే రోగులూ అధికార్లతో గొడవ పడుతున్నారు. కొలతలు తీయకుండా అడ్డుపడుతున్నారు.

డాక్టర్‌గారు కాలింగ్ బెల్ నొక్కేరు. అది విని వచ్చిన కాంపౌండర్‌ని అడిగి, గొడవేమిటో తెలుసుకున్నారు.

"ఏదో పెద్ద ఫేక్టరీ పెట్టడానికి భూమి సేకరిస్తున్నారట కదా, హాస్పిటల్ కూడా తీసుకుంటామంటున్నారు. ఏం చేయాలా అన్న ఆలోచనలో ఉన్నాం. పరవాలేదు, పోరాడతాం. ప్రజలకు ఇష్టం లేకుండా ప్రభుత్వమెలా తీసుకుంటుందంటున్నారు కమ్యూనిస్టులు. 'పోరాడితే పోయేదేమీ లేదు... బానిస సంకెళ్ళు తప్ప...' అని మార్క్సని కోట్ చేస్తున్నారు." అని నవ్వేడు డాక్టర్ రామకృష్ణ.

"కానీ మాలాంటివాళ్ళం సంకెళ్ళకోసం పోరాడుతున్నాం... కార్పొరేటోడేసే బంగారు సంకెళ్ళ కోసం, పార్టీవాళ్లేసే పదవి సంకెళ్ళకోసం! బంగారం, పదవీ అనుకుంటున్నాం గానీ, అవీ సంకేళ్లే! అవి పడ్డాక వాళ్ళేం చెప్తే అదే చేస్తాం. దేన్ని తాకట్టు పెట్టమంటే దాన్నే తాకట్టు పెడతాం. అమ్మెయ్యమంటే అమ్మేస్తాం. ఎవరి ఉసురు పోసుకోమంటే, వారి ఉసురు పోసుకుంటాం." అన్నాడు శ్యాంప్రకాశ్.

"ఈ ఆకస్మిక వైరాగ్యానికి కారణమేమిటి మిత్రమా?" ప్రశ్నించేడు డాక్టర్ రామకృష్ణ.

కొన్నాళ్లుగా తనలో గూడు కట్టుకుంటున్న అసహనాన్ని అలా చెప్పాడు గానీ, వివరించడానికి మనసొప్పలేదు. పక్కన భార్య ఉంది. ఆమె ఆరోగ్యంగా లేదు... అనిపించి, టాపిక్ మార్చేశాడు. కాసేపు ఇద్దరూ తమ కుటుంబ విషయాలు మాట్లాడుకున్నారు. బాల్యమిత్రుల గురించి మాట్లాడుకున్నారు. చాన్నాళ్ల తరవాత మనసు తేలికైనట్టు అనిపించింది శ్యాంప్రకాశ్‌కు.

ఎవరితో ఎంత మాట్లాడాలి. ఎవరిని కలవాలి. ఎవరిని ఎంత దూరంలో ఉంచాలి... అన్నీ కొలతల జీవితమైన శ్యాంప్రకాశ్‌కు ఆ కొలతల అవసరం లేకపోయింది. మనసుకు తోచినట్టు మాట్లాడాడు.

"అందరం కలుద్దాం. కేవలం కలవడం, కబుర్లాడుకోవడం, ఆటపాటల్తో గడపడమే... ఇంకే వ్యవహారం ఉండకూడదు. ఆ

రోజుల్లోకి... బాల్యం, యవ్వనాల్లోకి వెళ్లిపోదాం." అన్నాడు శ్యాంప్రకాశ్.

అంతలో బయట గొడవ పెద్దదైంది. కాంపౌండర్ ఆందోళనగా వచ్చి, "సార్ ఎవరో వచ్చి మన హాస్పటల్ కొలతలు తీస్తున్నారు. మన స్టాఫ్ వద్దంటున్నా ఆగటం లేదు. పేషెంటులూ వద్దంటున్నారు. వాళ్ళమీద లాఠీలెత్తుతున్నారు సార్" అని చెప్పేడు ఆయాసపడుతూ.

"ఇంకా ప్రజాసదస్సులు జరపలేదు, ప్రజల అంగీకారం తీసుకోలేదు. ఈ కొలతలేంటి మిత్రమా?" అని ప్రశ్నిస్తూ కుర్చీలోనుంచి లేచాడు రామకృష్ణ. డాక్టర్‌తో పాటు, శ్యాంప్రకాశ్ కూడా లేచాడు, శ్రీమతిని కూర్చోమని చెప్పి. ఇద్దరూ హాస్పటల్ ఆవరణలోని వార్డు ఏరియాకి వెళ్ళేరు.

"అక్రమకొలతలు ఆపాలి. పోలీస్ గో బేక్. పరిశ్రమలకోసం పంటభూముల్ని లాక్కోవద్దు..." నినాదాలు ఆలయంలో జేగంటల్లా మోగుతున్నాయి. కొలతలు తీయబోతున్న అధికారుల్ని అడ్డుకుంటున్నారు కొందరు. వారిని పోలీసులు అడ్డు తొలగిస్తున్నారు. గొడవౌతోంది.

డాక్టరూ, శ్యాంప్రకాశూ అక్కడికి చేరుకున్నారు. శ్యాంప్రకాశ్‌ని చూసిన ఆందోళనకారులు "శ్యాంప్రకాశ్ డౌన్ డౌన్... ఇదేమి రాజ్యం... పోలీసు రాజ్యం, దోపిడీ రాజ్యం" అని నినదించేరు. ఆందోళనకారుల్లో కమ్యూనిస్టులు కనిపించేరు శ్యాంప్రకాశ్‌కి. వారి మీద అసహనం కలిగి, కోపం వచ్చినా, వాతావరణాన్ని గ్రహించి, తమాయించుకొని, ఆందోళనకారులకు నమస్కరించేడు. తరవాత అధికారులను...

"ఇంకా ప్రజాసదస్సులు జరగాలి కదా? తీర్మానాలు అవ్వాలి కదా? మంత్రిమండలి నిర్ణయాలింకా ఏమీ కాలేదు. అప్పుడే స్థలసేకరణకు సంబందించి కొలతలెందుకు తీస్తున్నారు? ఎవరి ఆర్డర్స్ ఇవి? నాకు తెలియకుండా ఇది ఎలా చేస్తున్నారు?" ప్రశ్నించాడు.

"ఎప్పుడైనా తప్పదు కదా కొలతలు తీసుకొని ఎస్టిమేట్ వెయ్యడం. ప్రాసెస్ అయ్యేలోగా ఆ పని ముందు చేసెయ్యండని వైజాగ్ సాయిగారు కలక్టర్‌గారిని ఆదేశించారు సర్. కలక్టర్‌గారు ఎసైన్ చేసిన ప్రోగ్రాం సర్" వివరించాడో అధికారి.

ఆ అధికారి కలక్టర్‌కి నమ్మిన బంటు. కలక్టర్ వైజాగ్ సాయికి నమ్మిన బంటు. ప్రొసీజర్లూ, గజెట్లూ వచ్చేలోగా సంబంధిత పనులు ఇలా దోత్ఫరీగా చేసేస్తుంటారు.

"ఆపేయండి, కొలతలేమీ తియ్యొద్దు"

"వైజాగ్ సాయిగారి ఆదేశం సార్"

"నేను చెప్తున్నాను, వెళ్లిపోండి."

"గో బేక్... గో బేక్..." ఆందోళనకారుల నినాదాలు.

చేతులెత్తి నమస్కరించి, ఆందోళనకారులను శాంతించమన్నాడు శ్యాంప్రకాశ్. ఆందోళనకారులు నినాదాలు ఆపేరు.

"సార్ కలక్టర్‌గారి ఫోను" అంటూ ఫోన్ అందించబోయేడు అధికారి. శ్యాంప్రకాశ్‌కి ఎక్కడలేని కోపం వచ్చింది. అధికారి అందించిన ఫోన్ తీసుకొని, దాన్ని విసిరికొట్టి,

"ముందు మీరిక్కడ్నుంచి పొండి. ఆ కలక్టర్ని రమ్మనండి" అని కసురుకున్నాడు. అధికారులు తర్జనభర్జన పడి, చివరికి వెనుదిరిగేరు.

వారంరోజుల తరవాత శ్యాంప్రకాశ్ భార్య కోలుకుంది. పొద్దుపొద్దున్నే నిద్రలేచింది. శ్యాంప్రకాశ్‌తో పాటూ మార్నింగ్‌వాక్ చేసింది. తరవాత బాదం చెట్టుకింద నిర్మించిన పీఠం మీద కూర్చొని, భర్తతోపాటు యోగా చేసింది. ఇద్దర్నీ పరమానందంగా చూస్తూ, వాళ్ళ ముందు కాళ్ళు చాపి కూర్చుంది ఖారవేలు.

"డాక్టర్ రామకృష్ణగారి ఆస్పత్రి దగ్గరలో మంచి ఇల్లు కట్టుకొని, ఆయన గారిలా ఏదో చేస్తూ బతికితే బాగుంటాదనిపిస్తోందండీ ఈ బంగ్లా వదిలేసి!" అన్నది భార్య.

శ్యాంప్రకాశ్ బదులివ్వలేదు. యోగానుంచి కళ్ళు తెరిచేడు. కాసేపటికి బంగ్లా నుంచి కేకలు వినిపించేయి. గురవయ్య ఎవరిమీదో కేకలు వేస్తున్నాడు. భార్యాభర్తలిద్దరూ యోగా ముగించి లేచేరు. ఖారవేలు లేచి గబగబా బంగ్లా వేపు నడిచేడు.

"ఇంటిలోపటికి ఎల్లడానికి ఈల్లేదంటే ఈల్లేదు. పొద్దింకా దూరిందోలేదో ఏటీ గాచ్చారం. పోలీసోల్ల పాదాలింటిలో పెట్టడమేటి? వొల్లగాదు ఎల్లండెళ్ళండి. పదిగంటల తరాత రండి. అయ్యగారింకా తానం గీనం చెయ్యాల, పూజా గీజా చెయ్యాల, గెంజీ కడుగూ తాగాల. తరాతే ఈ పంచాయతీ అయినా. ఎల్లండెళ్ళండి." గొంతు నరాలు బిగించి చెప్తున్నాడు గవరయ్య తలుపు దగ్గర నిలబడి.

బంగ్లా బయట వాహనం ఆపి, ఇద్దరు ఆఫీసర్లూ, ముగ్గురు గుమస్తాలూ వచ్చేరు ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ నుంచి. ఆ దుస్తులూ, ఆ ఘరానా నచ్చని గవరయ్య వారిని లోపలకు అనుమతించడంలేదు. ఈలోగా ఖారవేలు చేరేడు. గవరయ్య పక్కన నిలబడ్డాడు.


ఈడీ అధికారులు గవరయ్యను నెట్టేసి లోపలకు వెళ్ళబోతే, గవరయ్య వారిని అడ్డుకొని, ప్రవేశానికి వీల్లేకుండా తలుపులు వేసేసి, తాళం వేసేసి, బయటకు నడిచాడు.

అధికారులకేం చెయ్యాలో బోధపడక, గవరయ్య వేపూ, బంగ్లావేపూ చూస్తూ నిలబడ్డారు.

ఖారవేలు పొండి, వెళ్లిపోండి అన్నట్టుగా భౌ...భౌభౌ అనరిచింది భీకరంగా.

# ఖుదానంద్

## మల్లాది రామకృష్ణ శాస్త్రి



### కథా మార్గదర్శి కథ

*ఖాలీసీసాలూ, గ్లాసులూ ఉగ్గుగిన్నెలు లాగా తోచినవి. వాడు ఇందాకటినుంచీ కూర్చున్న కుర్చీ ఉయ్యాలై... పొత్తిళ్లలో పడుకుని, ఉంగా ఉంగా అంటూ, కాళ్లూ చేతులూ తొట్టె గిలకలకు వేసి కొట్టుకుంటూ, తల్లి ఆశాశపెట్టే గిలకపండు అందుకునేందుకు వంకర చేతులు పిడికిళ్లతో జాపే ఆముదపు గుడ్డులులాగా... కందగడ్డలాగా... ఉన్నాడు లక్ష్మీకాంతం!*

లక్ష్మీకాంతం, పారిపోయి వచ్చి, మాయింట్లో దాక్కున్నాడు...

పారిపోయివచ్చాడంటే... వెంట ఎవరో తరుముకు వస్తూంటే, నురుగులు గ్రక్కుతూ పరుగెత్తుకుంటూ వచ్చాడని కాదు... దాక్కోడమంటే, ఎంత వెదికినా కనపడని ఏదో చీకటి గుయ్యారంలో నక్కి కూర్చోడమూ కాదు. నిదానంగా నడిచి వచ్చాడు. దొర కొడుకెవరా అన్నట్టు ఒళ్లు విరుచుకుని కుర్చీలో పడుకున్నాడు... అయినా, నాకు అలా అనిపించింది. వాడి నీడగా కొండంత భయం, పర్వతమంత ఆవేదనా కనిపించింది!.

"ఏం రా?" అని మౌనంగానే కుశల ప్రశ్నచేశాను.

"నేను తాగితే ఏం ఫరవాలేదు కదా!" అన్నాడు. ఓపట్టాన... ఎవరినో అడుగుతూన్నట్టు...

"ఎవరికీ ఫరవా...?"

'నీకు' అని మనసులో పలకడానికి నావంక చూపు గిర్రున తిప్పి..."నీకు అభ్యంతరం ఏమీ ఉండదు కదా?" అని గొణుక్కున్నాడు.

"లేళ్లూ, పులులూ కలిసి పూరి మేసే పుణ్యభూమి యీ ఆశ్రమం అన్న సంగతి మరచిపోతే ఎలా? మహరాజుగా సేవించు! నన్ను మటుకు సహపంక్తికి బలవంత పెట్టక... నే నిప్పుడే భోజనం చేశాను!" అని హెచ్చరించాను.

లక్ష్మీకాంతం జేబులోంచి మందు సరంజామా తీసి, గంగతో అపవిత్రం చేయకుండా దాహం పుచ్చుకున్నాడు. మొగం... జ్వరపు మొగం పడ్డది. కళ్లు మెరుస్తున్నాయి. అలా సిగరెట్ కాలుస్తూ, కాళ్ళూచేతులూ చాచుకుని ఒక నిమిషం పడుకున్నాడు. వడ కొడుతూంది గదా అని వట్టి వేళ్ల తెరలు దించి, నీటి జల్లు తిప్పాను.

"పోయింది రా..." రొదగా నిట్టూర్చాడనుకున్నాను మొదట... మాట కదా అని తరువాత మనసుకు తట్టింది.

ఎవరు? ... ఎక్కడికి... ఎందుకు?... ఈ మూడింటిలో ఏదో ఒక్కటైనా, మాట ధోరణిని అడగవలసిన ప్రశ్న...

అడుగుదామనుకున్నాను కాని, అడగకపోయినా జవాబు వాడంతట వాడే ఎలాగూ చెపుతాడు కదా అనిపించి, విని ఊరుకున్నాను.

“శకుంతల లేచిపోయింది రా' అంటూంటే... మాట్లాడవేం?” అని వాడు దండించాడు.

శకుంతల అంటే... నాకు అర్థం కాలేదు.

“నామూలానే లేచిపోయింది...” అదే శ్రుతిలో అన్నాడు.



‘నీతోనే ఎందుకు లేచిపోలేదు?' అని కొంటె విసురొకటి విసరమంది మనసు. కాని, వాడిలో ఆ బాధను చూసి, నా నోటికి జాలేసింది.

‘అలాగా పాపం' లాగా తల ఊగించాను.

“ఎవడితోనో... ఊరూ పేరూ లేనివాణ్ని తీసుకుని ఎక్కడికో లేచిపోయింది ...”

లేచిపోయే ముందు, నాయకుడి పేరు ప్రఖ్యాతులు ఆలోచించవలసిన అగత్యం ఏమిటో నాకు ఎంత మాత్రమూ బోధపడలేదు. ఇదేమన్నా పెండ్లి సంబంధమా... ఆర్షేయ, పౌరుషేయములు నిదానంగా విచారించడానికి! ఇంకో విషయం కూడాను...

ఇందులో వీడి నిర్వాహకం కొంత ఉందంటున్నాడుగా, మరి ఈ నిక్షేపరాయడు ఒరిగించిందేమిటి? తన చేతిమీదుగా ఈ సత్కార్యము జరుగుతూన్నప్పుడు, తాను, అంతమాత్రం మంచి చెడ్డలు ఆలోచించనక్కరలా? ఏమిటో అంతా అగమ్యంగా ఉంది.!

'మరి నా పెళ్లాం ఎందుకు... ఎందుకు లేచిపో లేదూ?' అంటాడనుకున్నాను. వాక్యం సగంలో త్రుంచేసి నిద్రపోయినాడు. నిద్రపట్టింది కాబోలు అనుకుంటూండే లోపుగానే... నిద్రలో మునిగి తేలి బడలిక తీరినవాడిలాగా... ఒక్క నిమిషంలో తెరిపిగా మేలుకున్నాడు.

"ఏంరా, యీ కోతి మొగాన్ని చూసి కళ్లున్న దెవతన్నా ముచ్చటపడుతుందట రా?" వాడు ధూకుడుగా అడిగాడన్నమాటే కాని, అందులో కొంత యధార్థం లేకపోలేదు. లక్ష్మీ కాంతాన్ని పరాకున అయినా, అందగాడను కునేందుకు వీలులేదు!

"శకుంతల మధుర మీనాక్షిలాగా కలకల్లాడుతూ ఉంటుందిరా! నేను ఎంత పుణ్యం చేసుకోబట్టో... అన్నయ్యా అని పిలిచేది రా... నాతో అరమరిక లేకుండా ఉండేదిరా!"

ఓహో.., ఇప్పుడు అర్థమైంది. శకుంతల అంటే, మనవాడి యింటికి ఎదురుగుండా మేడలో క్రింద భాగంలో ఉంటున్నాడే... తాసిల్దారు కూతురు! పిల్ల చాలా అందంగా ఉంటుంది... చిదిపి దీపం పెట్టవచ్చు. అవును, నేను ఒకటి రెండుసార్లు చూసిన జ్ఞాపకం కూడాను!

"అన్నయ్యా అనే మాటకు ఎన్ని అర్థాలుంటాయిరా? నీవే చెప్పు...?"

... ఏం చెప్పను? అందరికీ తెలిసిన ఆ ఒక్క అర్థమే నాకూ తెలుసును...ఈ నా అజ్ఞానాన్ని నా గ్రుడ్లు మిటకరించినవి.

"అన్నయ్యా' అంటే 'బావా!' అనీ, 'మామా!' అనీ అనుకోవచ్చునా? – చెల్లీ అని పిలుస్తూ, చాటునా పెళ్లాంగా వాడుకోవచ్చునా... మనిషైన వాడు ఎవడన్నా అలా గడ్డి తింటాడా?... పోనీ, మొగవాడు, ఏ కోటిమందిలోనే ఒకడు పశువౌతాడనుకో...అప్పుడు మాత్రం, అదెలా పరిపాటి అవుతుంది?... వాడు వట్టి పశువు కాక, మనిషెలా అవుతాడు?"

"అవును... నీ వంటూన్నదంతా నిజమే" నని తల ఊగించాను.

"నా పెళ్లాం నన్ను శుద్ధ పశువు కింద కట్టింది! శకుంతలను నేను ప్రేమిస్తున్నానని అనుక్షణమూ అభినందించడం మొదలు పెట్టింది రా. అలాటి పాపపు మాట లనవద్దని ఎన్నో విధాల బ్రతిమాలుకున్నాను. ఉహు... తల్లికీ పెళ్లానికీ తేడా తెలియని మనిషి.... ఊఁ... మనిషా, అది కూడా ఒక మనిషేనా?... నన్ను తిట్టి దుమ్మెత్తి పోసినా అంత బాధపడేవాణ్ణి కాదేమో! నేను చేస్తున్నది ఏదో ఘనకార్యమనీ... నేను కాగా అంత ప్రయోజకుణ్ణి కాగలిగాననీ, ఆవిడ అంటూన్నప్పుడల్లా నాగుండెలో శూలాలు నాటుకునేవి. నామీద ఎక్కడ లేని దయా, అపేక్షా యింటావిడకు పుట్టుకు వచ్చినవి... దయతో చంపడం అని యింగ్లీషు వాళ్లు అనే మాటలో హాలాహలం నాకు నరనరాల ప్రాకిపోయింది. శకుంతలకు మా ఆవిడ అఘాయిత్యం ఎక్కడ తెలుస్తుందో... ఆ అమాయకురాలి మనసు ఎక్కడ చివుక్కు మంటుందో అని నాకు వెర్రెత్తిపోవడం మొదలు పెట్టింది. కాని, నేను ఏం చేయను? ఈ పాపపు మాట ఆ అమ్మాయి చెవిని పడకుండా చేయడం ఎలా? ఏమీ పాలు పోయింది కాదు... తెంచుకు ఎక్కడికన్నా పారిపోతే? .. ఇహ మా ఆవిడ నోటికి హద్దూ పద్దూ ఉండదు.... పారిపోకుండా, యింటినే అంటిపట్టుకు ఉంటే... ఏ నిమిషాన ఏం ముణుగుతుందో? శకుంతలను, మాయింటికి రావద్దని చెపుదునా?.....అయితే, కారణం ఏమనాలి?"

"నీవు ఒక్కటి అడగవచ్చును... నీ పెళ్లాం నోటికి బుద్ధి చెప్పలేక పోయినావా అని. అదీ అలోచించాను. నాకూ తామసం

లేకపోలేదు. నన్నుచూసి యికిలిస్తూ మా గృహలక్ష్మి ఓ వెకిలి మాట కూసినప్పుడల్లా... ఆ పళ్లన్నీ ఒక్క వరుసను రాలేట్టు కొడదామా అనిపించేది. కాని చేయి లేచేది కాదు...ఏం చెయ్యను! అది నా దౌర్భాగ్యం... పెళ్లాన్ని కొట్టడం ఎన్నడూ అలవాటు లేదు... చూసన్నా ఉండకపోతిని... మానాన్న అమ్మమీద ఎన్నడూ చెయిచేసుకున్న పాపాన పోలేదు.!"

"అవాళ శ్రావణ మంగళవారం! శకుంతల తలంటి పోసుకున్న నునుపుతో, కొత్త చీరా, రెవికా కట్టుకుని, కలకల్లాడుతూ, వాడకట్టుకు పేరంటానికి వెళుతూ మా గుమ్మంలోకి వచ్చింది. ఏం వదినా అని మా ఆవిడను కూడా రమ్మనమని కేక వేసింది. అవిడ, చీర సింగారింపు యింకా తెమలలేదు కాబోలు, లోపలికి వచ్చి, నేను కూర్చున్న గదిలోకి తొంగిచూసి, వచ్చి కూర్చుని, ఏదో పత్రికలో బొమ్మలు చూస్తూన్నది. ఇహ కాస్సేపటికి... మా ఆవిడ అక్కడికి వచ్చింది. వస్తూనే, విషపు చూపొకటి చూసింది. ఆ వాలకం నేను చూశాను కాని, శకుంతల బొమ్మల ధ్యాసలో ఉండి దాన్ని గమనించలేదు.

పోనీ, అంతటితో పోనీయవచ్చునా- - - లోపలికి వచ్చిందల్లా, గుమ్మం అవతలకు ఎగిరి గంతు వేసి, ఆ విసురులోనే తలుపు ఛెళ్లిన వేసింది! శకుంతల ఉలికిపడి, తల ఎత్తింది. ఏమిటని ఆ చూపులు నన్ను ప్రశ్నించినవి. నేను అర్థం కానట్టు... చూసీ చూడనట్టు ఊరుకోగా, "'ఏమిటది?" అని పలికింది.

"ఏం లేదు, ఎక్కడనుంచో గాలి వచ్చి..."

"నాలుగుగోడల సందునా గాలి ఎల్లా విసురుతుంది."

"విసరదు... మసులుతుంది!"

"మసిలే గాలికి అంత అదిరిపాటు తనం ఉండదు."

"ఐదువ తనంతో బాటే అదిరిపాటు తనమూను..."

"ఐదు వరాలిచ్చిన ఆ ఐదువరాలి 'పేరేమిర'...."(శకుంతల ఎంతో బాగా పాడుతుందని చెప్పడం మరచి పోయినాను) శకుంతలతో యతికి ప్రతిగా యిలా కొంటెగా మాట్లాడటం చాలా సరదాగానే ఉంది. ఆ పిల్లదానికి అసలు కుళ్లు ఎక్కడ అర్థమైందోనని దిగులుగానూ ఉంది. నా గంద్రగోళం ఏ మాత్రం గమనించకుండా, శకుంతల సారంగపాణి చరణాన్ని మరో రెండుసార్లు సాగదీసి... 'తలుపు దగ్గిర నిలవేసి బ్రతిమాలితే గాని చెప్పవల్లే ఉంది..' అని నవ్వుతూ మారాం చేసే పోణిమిలో నా చెయ్యి పట్టుకుని గుమ్మం దగ్గిరకు లాక్కు వస్తూంది... ఇద్దరమూ వెకవెక పకపకలాడుతూన్నాము..."

"గుమ్మం రెండు రెక్కలూ దూదిపింజలు లాగా చెరో చెంపకూ ఎగిరిపడి, పుస్తీలను బాదుకుని లబలబలాడినవి... నమిలి మ్రింగేసేట్టు మాఆవిడ కణకణలాడుతూ నిలుచుంది ఎదురుగుండా... మాటలతో అయితే, ఎంతసేపు తర్జన భర్జన జరిగేదో, అవును కాదూలు ఎన్ని అనృతులు తిరిగేనో, ఎన్ని తిట్లు ఒట్లు గాలిలో కలిసిపోయేవో, సర్వత్రా ఎంత హైరాను చెలరేగేదో?... కాని మాటలకు అలవికాని శక్తి, ఒదుగు మౌనానికి ఉంది... మాటలు అర్థంలో ఆవగింజంత పాలును పలుకుతవి మౌనం కొండంతదాన్ని ముక్తసరిగా ఉద్ఘోషిస్తుంది! రెప్పపాటంతటిలో... పొంగి పొరలిన మౌనం, శకుంతలకు, సంగతి అంతా విప్పి చెప్పింది..."

"వదినా!" అన్నది, కలలో మూలిగినట్లు... శకుంతల.

' చెల్లాయ్' అన్నాయి... నవ్వుగా మా ఆవిడ పాపపు పెదవులు! నా తల పాతాళంలోకి క్రుంగిపోయింది.

"ఎన్ని యుగాలకో, నేను మల్లా తెప్పరిల్లి, తల ఎత్తి చూసేప్పటికి... మా ఆవిడ మొగమే చూశాను, శకుంతల లేదు!!

'పొరబాటున తలుపు తోశానండీ', అన్నది ఆ యిల్లాలు. నా బాధ పరమాత్ముడికైనా అర్థం కాదు. నదురూ బెదురూ లేకుండా అన్న ఆ ఒక్క ముక్క నన్ను రాక్షసుణ్ణి చేసేసింది. మెడ నులిమేస్తే... గుండె చీల్చి వెచ్చని పచ్చి నెత్తురు తాగితే... ఆ మెదడును కసకస నమిలి తినేస్తే... ఏం చేస్తే మటుకు ఏం లాభం? ఏం చేసినా ఒక్కటేగా అయేది? చచ్చి ఊరుకుంటుంది. కాని, రౌరవంలోకి శాశ్వతంగా యీ అబద్ధాన్ని వెంటపెట్టుకు పోతుంది... ఆ రాకాసిని హతమార్చడానికి భయపడ్డాను!

శకుంతల మళ్ళా నాశంటికి అగుపించలేదు. నిన్న ఎవడినో తీసుకు లేచిపోయింది! ఈ శుభవర్తమానం మా ఆవిడ నోటి మీదుగానే నాకు తెలిసింది!"

"శకుంతల మా ఆవిడకు ఉత్తరం వ్రాసిందిరా! అందులో పంక్తులు గుండెలో చింతనిప్పులై మండుతున్నాయిరా! 'వదినా! అన్నయ్యను వరించాననుకున్నావు కాదూ? నీకు అలా రాసిపెట్టి ఉంది గాని, అలాటి కోతిమొగాన్ని కట్టుకోవలసిన కర్మం నాకేం పట్టిందమ్మా? ఏరీ కోరీ, నా యిష్టం వచ్చిన వాడితో లేచిపోతున్నాను! నీతో మాట్లాడటమంటే సరదా; నీతో సరసమాడటమంటే సరదా! నీవంటే నాకు తగని సరదా. నీవు ఏమనుకుని పోతావో అని, నీమనసు ఎక్కడ నొచ్చుతుందో అని... నీకోసం, ఆయన్ని అన్నయ్యా అని పలుకరించేదాన్ని కాని, మీ ఆయనంటే నాకు తగని రోత సుమీ! ఉన్నమాట అన్నందుకు ఉలికిపడ్డావా వదినా?"

"ఈ ఉత్తరం చదివి మా ఆవిడ ఏనుగు నెక్కిందిరా! నా విషయంలో లేనిపోనివన్నీ అనుకున్నందుకు ఎంతో కించ పడ్డదిరా! మా కౌగిలింతలో నలిగి మన్మథుడి దుంప తెగిపోయిందిరా... ఏమీ అనలేక, ఏమీ చేయలేక, ఆ బాహు పంజరంలోంచి ఎలాగో తప్పించుకుని ఎగిరివచ్చి యిక్కడ పడ్డారా?"

లక్ష్మీకాంతం అయోమయంగా నిట్టూర్చి...పక్క కుదరని వాడిలాగా కుర్చీలో కొంత సేపు యాతనగా అటూ యిటూ మసిలాడు. గాజుకుప్పెలో కురదలా తీర్థాన్ని సేవించాడు. క్రమంగా మొగలలో వేడి ఎరుపు దిగిపోయింది. మనిషి తేరుకున్నాడు.

"శకుంతల నాకోసం ఎంత త్యాగం చేసిందో చూశావా?" అన్నాడు స్వగతంగా.

త్యాగమేమిటో నాకు బోధపడ లేదు.

"నా కాపురం చెడిపోతుందేమోనని, తన పరువును, తనవాళ్ల పరువును నట్టేట కలిపింది. ఇలా చేయకుండా, యింటిపట్టునే ఉండి, ఎన్ని ప్రమాణాలు చేసినా మా ఆవిడ నమ్మదని శకుంతలకు తెలుసును. కాని...ఎంత పని చేసిందిరా, వెర్రిపిల్ల! నా కాపురం తగులడిపోతె మాత్రమేం, వెయ్యేళ్లు వర్ధిల్లాలిసిన బంగారుతల్లి."

"ఇదంతా మీ ఆవిడ మీది అభిమానమేమో...?"

"ఆఁ...వల్లకాదు! ఆవిడంటే శకుంతలకు తగని అసహ్యం... నాకోసమని ఆవిడను మెచ్చుకుంటూ ఆఅబద్ధాలన్నీ వ్రాసింది... సరేకాని, యిప్పుడు ఏమిటి చేయడం?" లక్ష్మీకాంతం ఉరిమి చూస్తూ ప్రశ్నించాడు, పదేపదే!

ఏం చేయమనడానికీ నా కేమీ పాలు పోలేదు... సలహా యివ్వకుండా ఊరుకునేందుకు అంతకన్నా వీలులేదు ఆ స్థితిలో!

"ఇంటికి మాత్రం వెళ్లను... ఇహ ఏమైనా సరే! మా ఆవిడ భూతంలాగా పట్టుకుంటుంది. అది పతివ్రత కావడం కూడా నా ప్రాణానికే వచ్చింది. ఎర్రగా బుర్రగా ఉన్నవాణ్ణి ఎవడినన్నా తీసుకుని లేచన్నా పోదేం?"

నాకు నవ్వు వచ్చింది. కాని, వాడి బాధ అర్థమైంది.

"పోనీ, అలా సలహా యివ్వరాదూ?" అన్నాను... ఆలోచన చెపుతూన్నట్టు...

"చెపితే నవ్వుతుంది రా..."

వాడి అవస్థకు తగని జాలి వేస్తూంది అమాయకుడికి అతి తెలివితేటలు ఉన్న పిల్లను యిచ్చి పెళ్లి చేయడం ఎంత అనర్థమో నాకు యిప్పుడు బోధపడింది.

"ఏంరా, పాపపరిహారార్థం నేను చెప్పిన పని చేస్తావా?" అన్నాను.

వాడు ఎగిరి గంతేసినంత అప్రమత్తుడైనాడు.

"ఎవతెనన్నా కుర్రదాన్ని వెంట వేసుకొని,కొన్నాళ్ల పాటు తీర్థయాత్ర చేసిరా..."

నేను వెక్కిరిస్తున్నా ననుకున్నాడు.

"నిజంగానే చెపుతున్నాను భాయీ. శకుంతలకు అపచారం చేశాననుకుంటున్నావు కాని, నీ స్థితి మరీ శోచనీయమన్న సంగతి మరచిపోతున్నావు. మీ ఆవిడ దృష్టిలో నీవో పసిపాపవు. పిల్లాడిని గారాబం చేసినట్టు చేస్తూంది. తల్లిలాగా పెంచుతూంది. నీ యిల్లాలు నిన్ను వల్లుతూంది... ఇది నీ మగసిరికి పరువా? శకుంతలకు ఏదో నీ వల్ల అపచారం జరిగిందనుకుంటున్నావు కాని, నీవు ఎంత అర్భకుడివై పోతున్నావో అలోచించిడం లేదు! మడిగట్టుకుని కూర్చున్న మగవాడిమీద ఆడదానికి మమత ఉండదురా. మొగుడు కొరగాని వాడైతే, ఇక ఆ యిల్లాలి ఆనందానికి పట్టపగ్గాలు ఉండవు. తనకు దక్కకపోతున్నాడే అనే బాధలోఆమె మైమరచి పులకరించుతుంది! తన కౌగిలిలోకి లాక్కునేందుకు మన్మథుడూ, వసంత మాధవులూ ప్రసాదించిన వలలన్నీ పన్నుతుంది... ప్రేమిస్తుంది. శకుంతలకు ఉన్న తెగింపైనా నీకు లేకపోతే ఎలా? లే, ప్రయాణం కట్టు!"

ఆకు నందకుండా, పోకను పొందకుండా, కోమటి పురాణంలాగా దీర్ఘపన్యాసం చేశాను...లక్ష్మీకాంతం నాకు గుడ్లు వప్పగించి, చూస్తూ కూర్చున్నాడు.

"అయితే, యింతకూ నన్ను ఏం చేయమంటావు?" అన్నాడు, ఎప్పటికో తెప్పరిల్లి.

"ఏం చేసినా సరే... కాని, యిలా హాలాహలం మ్రింగుతూ కాలం గడపటం మాత్రం వద్దు!"

"త్రాగకపోతే, శకుంతల జ్ఞాపకం వస్తుంది... త్రాగితే... మా ఆవిడ చేసిన ద్రోహం జ్ఞాపకం వస్తుంది... త్రాగి

మరచిపోదా మనుకున్నాను...అదీ సాగడం లేదు!"

"త్రాగుదామనే సంగతి మరచిపో... అప్పుడు యిద్దరూ జ్ఞాపకం రారు!"

"మా ఆవిడ నన్ను మరచిపోయినా బాగుండును!"

"నిన్ను మరచిపోతే ప్రొద్దు పోవడం ఎలా...ఎక్కడున్నా వెదుక్కుంటూ వస్తుంది!"

"అవును, అది అంతదీ ఔను." నేను 'అలాగా' అని తల ఊగించాను.

సంజెవేళ అవుతూంది. ఇద్దరమూ అవీ యివీ తిని కాఫీ పుచ్చుకుంటున్నాము. లక్ష్మీకాంతం భార్య లోపలికి చక్కా వచ్చింది. ఆవిడను చూసీ చూడటంతోనే మన ధీరుడు కుర్చీతో సహా గజగజలాడి పోయినాడు! కేవలం పిల్లి అయిపోయినాడు.

"సినిమాకు వెళదాం, రండి" అన్నది కోమల స్వరంతో, పల్లెటూరి బడిపంతుల అదమాయింపుతో.

"నాకు ఒంట్లో ఏటూ బాగుండలేదు." అన్నాడు నీరసంగా.

"మరి ... బీచికి పోదామా?"

"నాకు మనసేమి బాగుండలేదు."

"అలాగా? అయ్యో పాపం! అలా అయితే ఎక్కడికీ వద్దు, యింటికే పోదాం..."

"నీవు వెళ్లు. నేను కొంచెంసేపుండి ... "

చేయి అందిచ్చి, పసివాడిని లాగా పొదివి పట్టుకుని నిలవేసింది. వెళ్లి వస్తామని నాతో చెప్పి, మెల్లిగా, సందిట నడిపించుకుంటూ వెళ్లి, కారులో కూర్చో వేసింది. డ్రైవర్‌తో ఫలానా సినిమాకు పోనీమంది. మలుపు తిరిగి మాయమయేదాకా కారు వెన్ను పరధ్యానంతో పరకాయించి చూస్తూ... మెట్లమీదనే అలా నిలవబడిపోయి ఉండి, లోపలికి వెళ్లి పోయినాను.

ఖాలీసీసాలూ, గ్లాసులూ ఉగ్గుగిన్నెలు లాగా తోచినవి. వాడు ఇందాకటినుంచీ కూర్చున్న కుర్చీ ఉయ్యాలై... పొత్తిళ్లలో పడుకుని, ఉంగా ఉంగా అంటూ, కాళ్లూ చేతులూ తొట్టె గిలకలకు వేసి కొట్టుకుంటూ, తల్లి ఆశాశపెట్టే గిలకపందు అందుకునేందుకు వంకర చేతులు పిడికిళ్లతో జాపే ఆముదపు గుడ్డులులాగా... కందగడ్డలాగా... ఉన్నాడు లక్ష్మీకాంతం! అవును, కొన్ని జీవితాలకి ఎప్పటికీ పురుడు వెళ్ళదు.

మొన్న ఈ నడుమ ఎప్పుడో ... ఆల్బర్ట్ హాలులో భరతనాట్యం చూస్తూంటే... అవతల ఆ చివర కూర్చుని ఉన్నారు! దంపతులు ఇద్దరూ చిలకాగోరింకల లాగా నవ్వుతూ, తుళ్లుతూ క్రిక్కిరిసి కూర్చుని తదేకదీక్షతో ప్రదర్శనంలో నిమగ్నులై ఉన్నారు!

లక్ష్మీకాంతాన్ని చూసి, ఎక్కడ జాలిపడతానో అని భయమేసింది!



చిన్నప్పడు తాతా అమ్మమ్మల దగ్గర కథలు విన్నాం!
అర్థమయ్యా అవని వయసులో...
ఎంతో ఉత్తేజంగా కళ్ళు, చెవులు అప్పగించి విన్న అనుభవం తలుచుకుంటే
ఓ తియ్యటి అనుభూతి కలుగుతుంది!
బడిలో మాష్టారు పాఠం చెబుతూ, సందర్భానుసారంగా కథ చెపుతుంటే..
పాఠం, కథ కలిపి మెదడులో చోటు చేసుకోవడాన్ని తలుచుకుంటే
ఓ వెచ్చటి అనుభూతి చుట్టుముట్టేస్తుంది!
ఆ కథల సారం, అనుభవాలు, అనుభూతులు...
మనకి తెలియకుండానే మన నడవడిక మీద ప్రభావం చూపెడతాయి!
కథ మనల్ని నడిపిస్తుంది! కథతో మన ప్రయాణం సాగుతుంది!
కథ కూడా మనతో నడుస్తుంది! మనల్ని తట్టి లేపుతుంది!

**కథామంజరి.. ఆ గమనంలోనే! ఆ దిశలోనే! ఆ లక్ష్యం తోనే!**